www.visalaandhra.com | VISALAANDHRA Regd No.VJ/042/2018-20 | పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం | వెల: రూ.5.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 68, సంచిక : 194

ఆదివారం 06-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ



కళ... తప్పింది

Sunday Special

- తీరిక లేని జనం...
- సంప్రదాయం దూరమవుతుంది
- రెచ్చిపోతున్న వ్యాపారులు
- ఇష్టమొచ్చినట్టు ధరలు
- జాబ్‌వర్క్‌కు పిండి వంటల తయారీ
- వండిస్తే కిలోకు వంద రూపాయలు

7 లో

తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగ సంక్రాంతి. ప్రతి ఇంట్లోను సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణ మొదలు కొత్త అల్లుళ్ల కోసం వంటకాలు సిద్ధం చేస్తారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల ముందు నుంచే అరిసెలు, బూరెలు, కజ్జికాయలు, జంతికలు, చెక్కలు తదితర పిండి వంటల తయారీతో సందడిగా మారేది. ఇప్పుడు కాలం మారింది. ఆ వంటలు వండుకుందామన్నా పట్టణ వాతావరణంలో సాధ్యం కాని పని. 50శాతం మందికి ఎలా వండాలో కూడా తెలియదు. దీనిని గుర్తించిన వ్యాపారులు దశాబ్దకాలంగా అన్ని సంప్రదాయ వంటకాలను పండుగ సందర్భంగా మార్కెట్లో ఉంచుతున్నారు.



జన్మభూమి నిధులు

మంచుగడ్డలే...

- రూ.50 వేలకుపైగానే సభల ఖర్చు
- నిధులు తొక్కిపెడుతున్న మండల అధికారులు
- ఆర్థికభారంపై పంచాయతీ కార్యదర్శుల ఆందోళన

జిల్లాకు రూ.కోటి విడుదల
మండలానికి రూ.2 లక్షలు

పంచాయతీలకు రిక్తహస్తమే

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు గ్రామ సభల నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా పరిణమించాయి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీలకు సభల నిర్వహణ తలకు మించిన భారమైంది. ఒక్కో గ్రామ సభ నిర్వహణకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. ఈ భారాన్ని మైనర్ పంచాయతీలే కాదు..మేజర్ పంచాయతీలు సైతం మోయలేనిస్థితి. గ్రామ సభల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించినా, అవి పంచాయతీలకు చేరటమనేది 'మంచుగడ్డ'లా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఐదు జన్మభూమి కార్యక్రమాలు జరగ్గా ఒక్క గ్రామ సభకు కూడా మండలాల నుంచి నిధులు వచ్చిన దాఖలాలు లేవు. అధికారులను ప్రశ్నించేందుకు ధైర్యం చేయలేక...పంచాయతీ కార్యదర్శులే మొత్తం ఖర్చు భరిస్తున్నారు. పంచాయతీలపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో నిధులు కేటాయిస్తుంటే, అవార్డుల కోసం మండలస్థాయి అధికారులు తలకు మించిన భారాన్ని మోపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2లో



ఫైల్ ఫోటో



8, 9 తేదీల్లో బ్యాంకు
ఉద్యోగుల సమ్మె

ఉద్యోగ విధానాలపై కేంద్రం తీరును నిరసిస్తూ..

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు మరోసారి సమ్మె బాటపట్టారు. ఉద్యోగ విధానాలపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 10 కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా వచ్చే వారంలో రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నట్లు బ్యాంకు సంఘాలు వెల్లడించాయి. 'జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్ఐ) పిలుపునిచ్చాయి. ఈ సమాచారాన్ని ఆ యూనియన్లు భారత బ్యాంకుల సంఘానికి(ఐబీఏ) అందించాయి' అని బీఎస్ఈ ఫైలింగ్ సందర్భంగా ఐడీబీఐ బ్యాంక్ పేర్కొంది. బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. వేతన సవరణ, పెన్షన్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబరు 21న బ్యాంకుల అధికారులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఆ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది డిసెంబరు 26న సమ్మె చేశారు.

ఇదీ లోకం!



హలో సీఎం గారా? ఇప్పుడున్న ఫోన్‌తోనే ఇంట్లో చాలా గొడవలు అయిపోతున్నాయండీ..

సంఘ్ విధ్వంసం

కేరళలో ఆగని హింస
అట్టుడుకుతున్న రాష్ట్రం

చట్టాన్ని గౌరవించాలి : ఐరాస

ఐక్యరాజ్య సమితి : శబరిమలలోకి మహిళల ప్రవేశానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం, ఆ తీర్పును కేరళ ప్రభుత్వం అమలు చేయడంతో చెలరేగిన హింసపై ఐక్యరాజ్యసమతి స్పందించింది. ప్రతి ఒక్కరూ కోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. సుప్రీం

- మిగతా 2 లో

- కన్నూర్ సహా పలు జిల్లాల్లో ఉద్రిక్తత
- వామపక్ష నేతల ఇళ్లపై బాంబు దాడులు

కన్నూరి / తిరువనంతపురం / కొచ్చి : శబరిమల వివాదంపై కేరళ రాష్ట్రం రణరంగంగా మారింది. అయ్యప్ప భక్తుల ముసుగులో సంఘ్‌పరివార్ శక్తులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. శనివారం రాష్ట్రంలో హింస చెలరేగింది. రాజకీయంగా సున్నితప్రాంతమైన కన్నూర్‌లో సీపీఎం, బీజేపీ, ఆర్ఎస్ఎస్ వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. లెఫ్ట్ పార్టీ నేతల ఇళ్లపై మనువాదులు, హిందోన్మాదులు బాంబులతో దాడులు చేశారు. కన్నూర్‌లో 260 మందిని పోలీసులు అరెస్టు చేయగా రాష్ట్రవ్యాప్తంగా 1700 మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడ్రోజులుగా రాష్ట్రంలో హింస కొనసాగుతోంది. దాదాపు ఏడాది తర్వాత రాజకీయ హింస చెలరేగడంతో సామాన్య జనజీవనం స్తంభించింది. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని అడ్డుపెట్టుకొని హిందోన్మాదులు రాష్ట్రాన్ని యుద్ధక్షేత్రంగా మార్చేశారు. శనివారం మడపీడికాయిల్‌లో సీపీఎం ఎమ్మెల్యే ఏఎన్ షంషీర్, పార్టీ కన్నూరు జిల్లా కార్యదర్శి పి.శశి ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు వి.మురళీధరన్ ఇంటిపైనా దాడి జరిగినట్టు తెలుస్తోంది.



కన్నూర్, పెరంబ్రాతో పాటు కోజికోడ్, మలప్పురం, ఆదూర్ జిల్లాల్లో ఉద్రిక్తత నెలకొంది. కన్నూర్ జిల్లాలో పెట్రోలింగ్‌ను పోలీసులు ముమ్మరం చేశారు.

ధలాస్సెరీలో 19 మంది అరెస్టు కాగా 33 మందిని ముందస్తుగా అరెస్టు చేశారు. పరియారంలో ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తి నిప్పుపెట్టినట్టు పోలీసులు తెలిపారు. గతరాత్రి పెరంబరాలోని ఇరిత్తిలో సీపీఎం కార్యకర్తపై దాడి జరగగా, ఆర్ఎస్ఎస్ నేత కె.చంద్రశేఖరన్ ఇంటిపై 24 మంది మార్క్సిస్టు కార్యకర్తలు దాడి చేసినట్టు సమాచారం. ఉద్రిక్తత

- మిగతా 2 లో

'పరారైన ఆర్థిక నేరస్థుడి'గా
మాల్యా

- ఆస్తుల జప్తుకు మార్గం సుగమం
- ఈడీ పిటిషన్‌కు కోర్టు అంగీకారం
- మాల్యా కోసం ఆర్థర్ రోడ్డు జైలు సిద్ధం



ముంబై : దేశంలోని బ్యాంకులకు సుమారు రూ.9 వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను 'పారిపోయిన ఆర్థిక నేరస్థుడి'గా ప్రకటించారు. ముంబైలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానం శనివారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం-2018 ప్రకారం మాల్యాకు పారిపోయిన ఆర్థిక నేరస్థుడు ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పీఎంఎల్ఏ న్యాయస్థానంలో గతంలో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఈడీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతోపాటు ఈడీ అభ్యర్థనపై స్టే విధించాల్సిందిగా మాల్యా గతంలో వేసిన పిటిషన్‌ను పీఎంఎల్ఏ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ తీర్పుతో మాల్యాకు సంబంధించిన ఆస్తులన్నీ ఇక ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చు. ఈ చట్టం కింద న్యాయస్థానం ప్రకటించిన తొలి పారిపోయిన

- మిగతా 2 లో



పొత్తు పొడిచింది

- యూపీలో ఎస్పీ బీఎస్పీ కూటమి
- అఖిలేష్, మాయావతి మధ్య చర్చలు సఫలం
- నెలాఖరులోగా వెలువడనున్న అధికారిక ప్రకటన

9లో



రుణమాఫీ పేరుతో మోసం

- రైతులను తప్పదారి పట్టిస్తున్నారు
- మోడీ ఎదురుదాడి

9లో

వ్యవసాయానికి పెద్దపీట

సంక్రాంతి తర్వాత మళ్లీ రుణమాఫీ

- వంశధార- నాగావళి అనుసంధానం
- శ్రీకాకుళం జిల్లాకు గోదారి జలాలు
- రాజాం గ్రామసభలో చంద్రబాబు



విశాలాంధ్ర-రాజాం : రాష్ట్రంలో వ్యవసాయరంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం గ్రామసభ జరిగింది. ముఖ్యఅతిథిగా చంద్రబాబు మాట్లాడుతూ 2004-2014 సంవత్సరాల మధ్య వ్యవసాయం చిన్నాభిన్నం కావడంతో రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకొచ్చిన తరువాత 24 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 10 శాతం వడ్డీతో రుణమాఫీకి చర్యలు చేపట్టామని, సంక్రాంతి తర్వాత మిగిలిన రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రకరకాల కార్యక్రమాలతో వ్యవసాయంలో మంచి ప్రగతి సాధించిన ఘనత మన రాష్ట్రానికే దక్కిందన్నారు. వ్యవసాయంలో 11 శాతం వృద్ధి సాధించామన్నారు. జిల్లాలో వంశధార రెండవ దశ పూర్తిచేసి వంశధార, నాగావళి అనుసంధానం చేయనున్నామన్నారు. గోదావరి నీటిని అవసరమైతే శ్రీకాకుళం జిల్లాకు తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి సేద్యానికి శ్రీకారం చుట్టిన క్రమంలో పారిస్‌లో అవార్డు అందుకున్నట్టు చెప్పారు. 1.30 కోట్ల మందికి భూ ఆరోగ్యకార్డులు ఇచ్చామని, వ్యవసాయరంగంలో ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు, మత్స్య, పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి చేస్తున్నామన్నారు. బటన్ నొక్కితే వ్యవసాయ యంత్రం మీ ముందుకువచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి స్మార్ట్‌ఫోన్ ఇస్తామని, 1100 కాల్ సెంటర్‌కు సమాచారం

- మిగతా 2 లో



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

బీజేపీకి అంతిమ ఘడియలు

- రాజకీయ క్రీడలో ప్రజలను బలికానివ్వం
- అగ్రిగోల్డ్‌పై రాజకీయాలు వద్దు
- అసోసియేషన్ చారిత్రక విజయం : ముప్పాళ్ల నాగేశ్వరరావు

2లో



తగ్గిన సర్వీసులు - పెరిగిన ఇక్కట్లు

పోలవరం - అమరావతి సందర్శనకు బస్సుల తరలింపు

బస్ స్టేషన్లలో గంటల కొద్దీ ప్రయాణికుల పడిగాపులు

సీట్ల కోసం తోపులాట, వాగ్వాదాలు

3లో

మే 3 నుంచి
టి ఎంసెట్

ప్రవేశపరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో 2019 ఎంసెట్ షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య పాపిరెడ్డి శనివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీ వివరాలతో పాటు పరీక్ష తేదీలను వెల్లడించారు.

టీఎస్ ఎంసెట్ (జేఎన్‌టీయూహెచ్) పరీక్షలు మే 3, 4, 6 తేదీల్లో (ఇంజినీరింగ్), 8, 9 తేదీల్లో (అగ్రికల్చర్) జరుగుతాయి. మే11న టీఎస్ ఈసెట్ (జేఎన్‌టీయూహెచ్), 20న టీఎస్ పీఈసెట్ (మహాత్మాగాంధీ యూనివర్సిటీ); 23, 24 తేదీల్లో టీఎస్ ఐసెట్ (కేయూ); 26న టీఎస్ లాసెట్ (ఓయూ); టీఎస్ పీజీఎల్‌సెట్ (ఓయూ); 27, 29 తేదీల్లో టీఎస్ పీజీఈసెట్ (ఓయూ); 30, 31 తేదీల్లో టీఎస్ ఎడ్‌సెట్ (ఓయూ) పరీక్షలు ఉంటాయి.

అవసరమైతే యుద్ధానికి సిద్ధం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

బీజింగ్ : దక్షిణ సముద్రంలో అమెరికా ఆగడాలు, తైవాన్ పునరేకీకరణకు విఘాత చర్యల నేపథ్యంలో... ఏ క్షణంలోనైనా యుద్ధానికి సిద్ధంగా ఉండాలని చైనా అధ్యక్షుడు తన సైన్యాన్ని అప్రమత్తం చేశారు. దక్షిణ సముద్ర ప్రాంతంలో అమెరికా సృష్టిస్తున్న ఉద్రిక్తలు, తైవాన్ హోదాలో ప్రతిష్టంభన నేపథ్యంలో.. సైన్యం మరింత బలోపేతం కావాలని, అవసరమైతే యుద్ధానికి సిద్ధం కావాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఓ సైనిక స్థావరంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం అనేక సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటోందని, ఈ స్థితిలో దేశభద్రతకు, అభివృద్ధి పరిరక్షణకు సైన్యం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నూతన శకంలో సైన్యం వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, అవసరమైతే యుద్ధానికి వెనుకాడరాదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఈ శతాబ్దంలో ఎన్నడు తలెత్తని పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయన్నారు. ఐతే చైనా అభివృద్ధికి వ్యూహాత్మక అవకాశాలను వదులుకోదన్నారు. సైన్యం ఎప్పటికప్పుడు ఆధునీకరణ బాటలో నడిచి సరికొత్త వ్యూహాలను సిద్ధం చేసుకోవాలన్నారు. తైవాన్‌లో దీవులన్నింటినీ ఏకం చేసి పునరేకీకరణకు కట్టుబడి ఉన్నట్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే ద్వీపాలకు భద్రత కల్పించే ఆసియా రీ అస్యూరెన్స్ ఇనిషియేటివ్ యాక్ట్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో తైవాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



కాలిఫోర్నియాలో

కాల్పుల కలకలం...

టొరెన్స్: అమెరికా కాలిఫోర్నియాలో గుర్తుతెలియని జరిపిన విచక్షణరహిత కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. టోరెన్స్‌లోని గబ్లె హౌస్ బౌల్‌లో శనివారం ఓ వ్యక్తి కాల్పులకు తెగబడ్డాడు. ఈ దాడిలో ముగ్గురు మృతి చెందారు. అనేక తీవ్రంగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

కాల్పులు జరిగిన ప్రదేశం వద్దకు ఎవరూ రావొద్దని పోలీసులు ట్విటర్ ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. తూటాలు తగలడం వల్ల కొందరు క్షతగాత్రులు రక్తపు మడుగులో పడి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. లాస్‌ఏంజెల్స్‌కు టోరెన్స్ 20 మైళ్ల దూరంలో ఉంది. ఇదిలా ఉంటే.. 2017లో అమెరికాలో గన్‌కల్చర్‌కు 40,000 మంది బలయ్యారు.

రోహింగ్యాలను ఎందుకు వెళ్లగొట్టారు



ఐక్యరాజ్యసమితి : ప్రాణభయంతో తలదాచుకోవటానికి వచ్చిన రోహింగ్యాలను భారత ప్రభుత్వం తిరిగి స్వదేశానికి అప్పగించటంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల మండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. శరణుకోరిన బాధితులను ఆదుకోకుండా స్వదేశానికి ఎందుకు పంపించారో స్పష్టం చేయాలని శరణార్థుల మండలి హైకమిషనర్ భారత సర్కారును వివరణ కోరారు. శరణార్థులు తమకు తాము స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతామంటే పంపించాలే గానీ.. బలవంతంగా మాతృదేశ ప్రభుత్వానికి అప్పగించకూడదు. 2013లో అస్సాంకు చేరుకున్న ఏడుగురు రోహింగ్యా శరణార్థులను అక్రమ ప్రవేశం పేరిట జైలులో ఉంచారు. ఐతే, గత గురువారం వీరిని మణిపూర్ సరిహద్దులో మయన్మార్ అధికారులకు అస్సాం పోలీసులు అప్పగించారు. ఐక్యరాజ్యసమితి శరణార్థ మండలిలో పేర్లు నమోదు చేసుకున్న 18000 మంది రోహింగ్యాలు భారత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తలదాచుకున్నారు. వీరికి రక్షణ కల్పించాలని ఐక్యరాజ్యసమితి భారత్‌ను కోరింది. కాగ, గడచిన మూడు నెలల్లో రెండో సారి రోహింగ్యా శరణార్థులను స్వదేశానికి భారత ప్రభుత్వం

భారత్ వివరణ కోరిన ఐరాస

వెళ్లగొట్టింది. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేసింది.. రోహింగ్యాలు తిరిగి మాతృదేశానికి వెళ్లే పరిస్థితులు మయన్మార్‌లో లేవని, కానీ ఉద్దేశ పూర్వకంగా ఈ శరణార్థులను భారత్ వెనక్కి పంపించి వేస్తోందని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఉప అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ ఆక్షేపించారు. రోహింగ్యాలను తిప్పి పంపించటానికి ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పాడ్డాయి, అసలు శరణార్థులు స్వచ్ఛందంగానే వెళ్లిపోతామని కోరారా? ఈ విషయాన్ని ఏరీతిలో అంచనా వేశారు? స్పష్టం చేయాలని భారత సర్కారును ఐక్యరాజ్యసమితి ప్రశ్నించింది. రోహింగ్యాలకు భద్రత కల్పించాలని అనేక పర్యాయాలు ఐక్యరాజ్యసమితి కోరినా భారత ప్రభుత్వం స్పందించటం లేదని ఫర్హాన్ హక్ విమర్శించారు.

షట్‌డౌన్‌లోనూ ఉద్యోగుల సహకారం : ట్రంప్



వాషింగ్టన్: అమెరికా షట్‌డౌన్ నెలల పాటు లేదా సంవత్సరాలైనా కొనసాగొచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. శుక్రవారం పలువురు సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ, కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించేందుకు తనకు జాతీయ అత్యవసర పరిస్థితి విధించే అధికారం ఉందని చెప్పారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మించడానికి నిధులు కేటాయించాలని ట్రంప్ డిమాండ్ చేస్తుండగా, డెమోక్రాట్లు అందుకు ఒప్పుకోకపోవడంతో ద్రవ్య వినిమయ బిల్లు పెండింగ్‌లో పడిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికాలో గత కొన్ని రోజులుగా పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. దీని వల్ల 8లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు వేతనాలు లేకుండా పనిచేస్తున్నారు. చాలా మంది ఉద్యోగులు షట్‌డౌన్‌కు సహకరిస్తున్నారని ట్రంప్ చెప్తున్నారు. సరిహద్దులో రక్షణ గోడ తమకు ఎంతో అవసరమని భావిస్తున్నారని ట్రంప్ వెల్లడించారు. తాము ఏమీ ఆటల గురించి మాట్లాడడం లేదని, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని అన్నారు. అంతకు ముందు అధ్యక్షులు గోడ నిర్మాణం చేపట్టి ఉండాల్సిందని వెల్లడించారు. షట్‌డౌన్ ఇప్పుడే ముగియకపోవచ్చని కూడా చెప్పారు.

పాలస్తీనాలో తెరమీదకు

ప్రజాస్వామ్య కూటమి

ఐదు ప్రగతిశీల పార్టీలతో ఏర్పాటు



రామల్లా : పాలస్తీనాలో హమాస్, ఫతాల ద్విదాధిపత్యానికి చరమ గీతం పాడేందుకు ఐదు ప్రగతిశీల వామపక్ష పార్టీలు జట్టు కట్టాయి. గజా ప్రాంతాన్ని హమాస్, పశ్చిమ తీరాన్ని ఫతా పార్టీలు పాలిస్తున్న తరుణంలో ఐక్య పాలస్తీనాను సాధించి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనే ధ్యేయంతో సంకీర్ణ దిశగా వామపక్ష పార్టీలు అడుగులు వేస్తున్నాయి. 2006 నుంచి పాలస్తీనాలో ఎన్నికలు జరగటం లేదు. మరో వైపు అమెరికా దాడులు, ఇంకో వైపు జెరుసలేంను స్వాధీనం చేసుకుని ఇజ్రాయేల్ యూదీకరణ చేస్తూ వలస రాజ్య స్థాపనకు పన్నాగాలు రచిస్తున్న నేపథ్యంలో... పాలస్తీనా ఏకీకరణ అత్యవసరమని వామపక్ష పార్టీలు భావించాయి.

ఈ రాజకీయ పరిణామాల్లో పాలస్తీనా పీపుల్స్ పార్టీ, పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా, డెమోక్రటిక్ ఫ్రంట్ ఫర్ ది పాలస్తీనా పీపుల్, పీఎస్ఐఎంబీ, పాలస్తీనా డెమోక్రటిక్ యూనియన్ ఏక తాటిపైకి వచ్చాయి. ఈ ప్రజాస్వామ్య కూటమి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనిజేషన్ నియమ నిబంధనలతో పనిచేస్తుంది. ఇజ్రాయేల్ దురాక్రమణను, వలసరాజ్య స్థాపనను, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను అడ్డుకోవటం, జాతీయ ఆర్థిక స్థితిని దెబ్బతీసే ఇంధన విధానాన్ని తిప్పికొట్టే లక్ష్యంగా ఈ కూటమి పని చేస్తుంది. ప్రజాస్వామ్య శక్తులు ఏకం కాకపోతే అమెరికా నిత్యదాడులు, ఇజ్రాయేల్ దురాక్రమణలతో పాలస్తీనా దివాళా తీసే పరిస్థితి ఏర్పడుతుందని సంకీర్ణ కూటమి నేతలు అభిప్రాయపడ్డారు. గాజ, వెస్ట్‌బ్యాంకును ఏకం చేసి పౌరుల సామాజిక భద్రత, సామాజిక న్యాయం, ఆర్థిక హక్కులు, భావ స్వేచ్ఛను రక్షించే దిశగా సరికొత్త రాజకీయాలు అవసరమని సంకీర్ణ కూటమి అభిప్రాయపడింది. ప్రతి పార్టీ తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే కూటమిని బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. నిర్ణయాత్మక రంగాల్లో మహిళలకు సమానత్వం, స్వేచ్ఛను ఇవ్వాలని సంకీర్ణ కూటమి భావిస్తోంది. ముస్లిం హమాస్ గాజాలో మహిళా టీవీ ఏర్పాటును వ్యతిరేకించింది. మహిళలకు స్వేచ్ఛ ఇచ్చే విషయంలో హమాస్ వ్యతిరేకిస్తోంది. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ, జెరుసలేంను దేశ రాజధానిగా సాధించేందుకు దృఢసంకల్పంతో ఆదర్శ పాలస్తీనా ఐక్యతను చాటి చెప్పాలని ప్రజాస్వామ్య కూటమి లక్ష్యంగా పెట్టుకుంది.

బీజేపీకి అంతిమ ఘడియలు

విశాలాంధ్ర-గుంటూరు : రాజకీయ క్రీడలో ఏపీ ప్రజలను బలికానివ్వబోమని సీపీఐ ఏపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలపై రెండు రోజులు ఢిల్లీలో ఆందోళన చేశామన్నారు. సీపీఐ, సీపీఎం, జనసేన, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, ప్రజాసంఘాలు, యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆందోళనకు నాయకత్వం వహించిందన్నారు. హోదా అడిగితే పోలీసులతో కొట్టించారని కేంద్ర ప్రభుత్వంపై ముప్పాళ్ల విమర్శలు చేశారు. లాఠీచార్జిలో తనతో పాటు విద్యార్థి, యువజన కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. హోదా కోసం నాలుగున్నరేళ్లుగా పోరాడుతున్నామని, ఎన్నికల వేళ తమ డిమాండును గుర్తు చేద్దామని ఢిల్లీలో ధర్నా చేశామన్నారు. ప్రధాని మోడీ మొరటుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏపీ హామీలను వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. నిన్న పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని సీపీఐ కేంద్ర కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డి.రాజా నేతృత్వంలో తాను, రామకృష్ణ, చలసాని శ్రీనివాస్, జార్జి విక్టర్ తదితరులం కలిశామన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తరహాలో ఏపీకి నిధులివ్వాలా అని జైట్లీ చెత్త వాదన చేశారన్నారు. తామిచ్చిన వినతిపత్రంలోని అన్ని అంశాలను పరిశీలిస్తామంటూ ముఖస్తుతి కోసం చెప్పారని విమర్శించారు. హామీలు అమలు చేయకపోతే బీజేపీకి అంతిమ ఘడియలు దాపురించినట్లేనన్నారు.

అసోసియేషన్ చారిత్రక విజయం

అగ్రిగోల్డ్ బాధితుల కోసం నాలుగేళ్లుగా తమ అసోసియేషన్ అలుపెరగని పోరాటం చేసిందని, బాధితులకు అండగా తమతో కలిసి రావాల్సిన వైసీపీ ఇప్పుడు ఉద్యమాలు చేయడం ఏమిటని ముప్పాళ్ల ప్రశ్నించారు. ఆందోళన విజయం తర్వాత వైసీపీ బాసట కమిటీ ధర్నా చేపట్టడమేమిటని నిలదీశారు. అన్ని పార్టీలను ఉద్యమంలోకి ఆహ్వానించామని, ఎవరూ సహకరించకపోయినా ఉద్యమాన్ని కొనసాగించామని, ఫలితం వచ్చే దశలో రాజకీయాలు చేసి బాధితులను రెండుగా చీల్చడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో 32 వేల ఆర్థిక కుంభకోణాలు జరిగాయని, కానీ ఏ రాష్ట్రంలో ఇంత త్రికరణ శుద్ధిగా పోరాడిన చరిత్ర ఉందా అని ముప్పాళ్ల ప్రశ్నించారు.

పోరాటం ఫలితంగానే మంత్రులు ఆనందబాబు, కాలువ శ్రీనివాసులు, ప్లానింగ్ కమిషన్ ఛైర్మన్ కుటుంబరావు తమ వద్దకు వచ్చి మీడియా సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు విడుదలైనా డబ్బు పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్థుడిగా మాల్యా

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక నేరగాడు మాల్యానే కావడం గమనార్హం. తాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిని కాదంటూ గత నెల మాల్యా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ విచారణపై స్టే విధించాలంటూ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన మాల్యాను భారత్‌కు అప్పగించాల్సిందిగా లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ న్యాయస్థానం గత నెల తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

మాల్యాపై తప్పుడు కేసులు పెట్టినట్లు ఎలాంటి ఆధారాలు కనిపించలేదని, అందువల్ల భారత్‌లోని కోర్టులకు మాల్యా సమాధానం చెప్పాలని లండన్ వెస్ట్‌మినిస్టర్ కోర్టు చీఫ్ మేజిస్ట్రేట్ జడ్జి ఎమ్మా ఆర్బత్‌నాట్ వ్యాఖ్యానించారు. మాల్యా కోసం ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలును సిద్ధం చేశారు. బ్రిటన్ నుంచి తీసుకొచ్చిన అనంతరం మాల్యాను ఇక్కడే ఉంచనున్నారు. ఇదిలా ఉంటే భారతీయ బ్యాంకులకు రుణాలను చెల్లిస్తానంటూ మాల్యా ఇటీవల ప్రకటించారు. ఈ డబ్బును తీసుకోవాలంటూ బ్యాంకులను, ప్రభుత్వాన్ని కోరారు.



సంఘ్ విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

నడుమ సీపీఎం, బీజేపీ-ఆర్ఎస్ఎస్ నాయకుల మధ్య మాటలతూటాలు పేలాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఘర్షణలకు ఆర్ఎస్ఎస్సే కారణమని, శాంతికి విఘాతం కలిగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆలయాలు, విద్యాసంస్థలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వర్గాలు రణరంగంగా మారుస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. సీపీఎం కన్నూర్ జిల్లా కార్యదర్శి పి.జయరాజన్ కూడా బాలకృష్ణన్ మాటలతో ఏకీభవించారు. హింసను ఆపాలంటూ సంఘ్ పరివార్‌ను కోరారు. శబరిమల ఆలయ సంప్రదాయాన్ని పాలకపక్షం ఉల్లంఘించడమే ఆందోళనలకు దారితీసినట్టు బీజేపీ ఎంపీ వి.మురళీధరన్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆయన పీటీఐతో మాట్లాడారు. ధలాస్సెరీ, వడియిల్ పీడికియాలోని తన పూర్వీకుల ఇంటిపై దాడి జరిగిందని, ఆ సమయంలో తన సోదరి, ఆమె భర్త, కుమార్తె ఆ ఇంట్లో ఉన్నారని, అదృష్టవశాత్తు వారంతా క్షేమంగా బయటపడ్డారని చెప్పారు. కాగా, ఉద్రిక్తత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు బలగాలను పోలీసులు మోహరించారు. పలుచోట్ల నిషేధాజ్ఞలు విధించారు.

ఆయన బ్రాహ్మణ రక్కసుడు : మంత్రి సుధాకరన్

శబరిమల ఆలయ ప్రధాన అర్చకుడు 'బ్రాహ్మణ రక్కసుడు' అని సీపీఎం సీనియర్ నేత, పీడబ్ల్యూడీ మంత్రి జి.సుధాకరన్ విమర్శించారు. మహిళలు ప్రవేశించినందుకుగాను ఆలయ శుద్ధీకరణను చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఈ అర్చకుడు బ్రాహ్మణుడు కాదు.. బ్రాహ్మణ రక్కసుడు. ఓ బ్రాహ్మణుడు రాక్షసుడిగా మారితే ముప్పు తప్పబోదు. అతను శుద్ధ బ్రాహ్మణుడు కాదు.. అయ్యప్ప స్వామిపై ప్రేమానురాగాలు, గౌరవం, భక్తి ఆయనకు లేవు' అని విమర్శించారు.

జన్మభూమి నిధులు మంచుగడ్డలే...

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : రాష్ట్రంలో ఈ నెల రెండో తేదీ నుంచి ఆరో విడత జన్మభూమి - మా ఊరు గ్రామసభలు ప్రారంభమయ్యాయి. 11వ తేదీ వరకు కొనసాగుతాయి. ఎప్పటి మాదిరిగానే జన్మభూమి నిర్వహించే ప్రతిసారీ, సభ నిర్వహణ, స్నాక్స్, టీ తదితర ఖర్చుల కోసం ప్రభుత్వం జిల్లాకు కోటి రూపాయలు మంజూరు చేసింది. ఆ నిధులు జిల్లా కలెక్టర్ల ద్వారా అన్ని మండలాలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లకు వస్తా యి. అక్కడ నుంచి గ్రామ పంచాయతీ, వార్డులకు కేటాయిస్తారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో నేరుగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలోనే గ్రామసభలు జరుగుతుండగా, ఆర్థిక ఇబ్బందులు తక్కువగానే ఉంటున్నాయి. ఎటొచ్చి గ్రామ పంచా యతీలకే సభల నిర్వహణ భారంగా మారింది. మండలాలకు కేటాయించే నిధులు మండల పరిషత్ కార్యాలయాలను దాటి గ్రామాలకు చేరటం లేదు. ఐదు విడతల జన్మభూమి గ్రామ సభలకు మేజర్ పంచాయతీలు రూ.2.50 లక్షలు, మైనర్ పంచా యతీలు రూ.1.25 లక్షలు ఖర్చు చేశాయి. అందులో ఒక్క నయాపైసా కూడా తమకు అందలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శులే చెబుతున్నారు. గ్రామసభల నిర్వహణ ఖర్చుల బిల్లులను తాము ఎంపీడీఓలకు సమర్పిస్తున్నా, నిధులు విడుదల చేయని పరిస్థితి నెలకొంది. బిల్లుల కోసం అధికారులను ఎదిరించే ధైర్యం లేక మిన్నకుంటున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని సీనియర్ పంచాయతీ కార్యదర్శి ఒకరు వాపోయారు. ప్రస్తుత జన్మభూమి కోసం గత నెలలోనే ప్రభుత్వం రూ.13 కోట్లను విడుదల చేసింది. గ్రామసభలు ప్రారంభమై ఐదు రోజులైనా నేటి వరకు అవి గ్రామాలకు చేరకపోవటం గమనార్హం.

షామియానాకే చాలదు...

జన్మభూమి-మా ఊరు గ్రామసభల నిర్వహణకు ప్రభుత్వం కేటాయించే నిధులు అత్తెసరుగానే ఉంటున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జిల్లాకు కేటాయించే రూ.కోటిలో మండలానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు మంజూరవుతుండగా, మేజర్ పంచాయతీలకు రూ.14 వేలు, మైనర్ పంచాయతీలకు రూ.8 వేల చొప్పున ఎంపీడీఓలు కేటాయిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు షామియానాకే చాలటం లేదని అధికారులే అంగీకరిస్తున్నారు. ఒక్కో సభకు ఒక్కో పంచాయతీపై ఏకంగా రూ.25 వేల నుంచి రూ.50 వేల భారం పడుతోంది. తాజా జన్మభూమిలో రాజధాని అమరావతిలోని ఒక గ్రామ పంచాయతీకి ఏకంగా రూ.60 వేలు ఖర్చయింది. షామియానా, కుర్చీల ఖర్చు కాకుండా స్నాక్స్, టీ, భోజనాలకే ఈ మొత్తం ఖర్చయినట్లు సీనియర్ పంచాయతీ కార్యదర్శి ఒకరు తెలిపారు. పక్కనే ఉన్న మరో పంచాయతీకి దాదాపు రూ.50 వేలు ఖర్చయిందన్నారు. సభ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఏ క్షణంలోనైనా కలెక్టరు, మంత్రి వస్తారని చెప్పి వేలాది రూపాయలు ఖర్చు చేయిస్తున్నారని తెలిపారు. ఐదు విడతలలో తాము మండల పరిషత్ నుంచి నయాపైసా ఎరుగమని ఆయన వాపోయారు.

అప్పులు చేస్తున్న కార్యదర్శులు

జన్మభూమి గ్రామసభల కోసం కొందరు పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి మరీ ఖర్చు పెడుతున్నారు. రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలో అవార్డులు ఉన్నాయని, ఏర్పాట్లు ఘనంగా ఉండాలంటూ అధికారులు ఒత్తిడి చేయటం వల్లే ఖర్చు పెరుగుతోందంటున్నారు. అసలే పంచాయతీల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. మైనర్ పంచాయతీల పరిస్థితిని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆదాయ వనరులు లేని పంచాయతీ కార్యదర్శుల బాధలు వర్ణనాతీతం. జన్మభూమి-మా ఊరు గ్రామసభలకు మండలస్థాయి బృందంలో కనీసం 30 మందికి పైగానే ఉంటున్నారు. వీరితోపాటు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది ఇలా అందరినీ కలుపుకుంటే కనీసం 50 మందిపైనే ఉంటారు. వీరందరికీ స్నాక్స్, టీతోపాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలంటే మాటలు కాదంటున్నారు. మండలాలకు కేటాయించే నిధులను మండలస్థాయి అధికారులే భోంచేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కానీ, ఎవరూ ధైర్యం చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటం లేదు.

క్రీడా, సాంస్కృతిక పోటీలకూ...

జన్మభూమి గ్రామసభలే అనుకుంటే క్రీడలు, సాంస్కృతిక పోటీలను కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఒక్కో గ్రామానికి రూ.వెయ్యి మంజూరు చేసింది. వాస్తవానికి వీటి నిర్వహణకు ఒక్కో పంచాయతీపై కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేలు అదనంగా ఖర్చవుతోంది. సంక్రాంతి కావటంతో రంగోలి పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఈ పోటీలలో ప్రజలంతా పాల్గొనేందుకు ప్రచారం చేయాలి. టాం టాం వేసినా, మైకు ప్రచారం చేసినా రూ.వెయ్యి ఖర్చవుతుందని, ఇక పోటీలకు డబ్బులెక్కడ నుంచి తేవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జన్మభూమి గ్రామసభల నిర్వహణకు కేటాయించే నిధులు పెంచి, వాటిని నేరుగా పంచాయతీలకు అందజేయాలని పలువురు కోరుతున్నారు.

చట్టాన్ని గౌరవించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలను గౌరవించాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోని గుటెరస్ సూచించారు. 'ఈ అంశంలో సుప్రీంకోర్టు పలు ఆదేశాలను జారీచేయడం మీకు తెలుసు. భారత న్యాయవ్యవస్థను అందరూ గౌరవించాలి. అన్ని పార్టీలు చట్టానికి కట్టుబడి నడుచుకోవాలని కోరుతున్నాం. ఐరాసకు ఉన్న స్థానమేమిటో మీకు తెలియనది కాదు. అందరికీ సమాన హక్కులు కల్పించడమే ఐరాస ధ్యేయం' అని ఐరాస అధికారి ఫర్హాన్ హక్ మీడియాతో అన్నారు. శబరిమల వివాదంలో ఐరాస వైఖరి ఏమిటన్న ప్రశ్నకు 'చట్టానికి లోబడి వ్యవహరించాలనే సూచిస్తామని ఆయన బదులిచ్చారు. ఇస్లాం, కాథలిజం ఇలా అన్ని మతాల మహిళలకు సమాన హక్కులపై మీరేమంటారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ' అందరికీ సమాన హక్కులు ఉండాలి. అయితే అది ఏ విధంగా అమలవుతుందన్నదే ప్రధాన ప్రశ్న. శబరిమల వ్యవహారంలో కోర్టులు చెప్పినట్టు నడుచుకోవడం సబబుగా ఉంటుంది. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించేలా ప్రతి ఒక్కరిని ప్రోత్సహించడం మా కర్తవ్యం' అని హక్ అన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

పంపవచ్చన్నారు. ఉపాధి కార్యక్రమలతో పాటు ఆదరణలో 64 శాతం, పింఛన్లలో 72 శాతం, జీవం జ్యోతిలో 83 శాతం, తాగునీటిలో 49 శాతం, మధ్యాహ్న భోజనంలో 64 శాతం మేర ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలతో జాప్యం వల్ల వేతనం చెల్లింపులో ఆలస్యం కారణంగా ఉపాధి హామీలో 43 శాతం సంతృప్తి ఉందన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా అన్ని చర్యలు చేపడుతున్నామని, ఉద్యాన పంటల సాగుకు జిల్లావాసులు ముందుకు రావాలన్నారు. సంక్రాంతి తరువాత రైతులకు తొమ్మిది గంటలపాటు విద్యుత్ సరఫరా చేసే విషయాన్ని ప్రకటించనున్నామని తెలిపారు. జిల్లాకు జలసిరి కింద 25 వేల పంపుసెట్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. సోలార్ పంప్‌సెట్లు, ఎనర్జీ సేవ్ పంపుసెట్లు ఇవ్వనున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పండగను ఆనందంగా జరుపుకోవాలని చంద్రన్న కానుకలు అందజేస్తున్నామన్నారు. అనేక కష్టాల్లోని రాష్ట్రానికి కేంద్రం సహాయం లేనప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో మాత్రం రాజీపడడం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకట్రావు, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు, జిల్లా పరిషత్ అధ్యక్షులు చౌదరి ధనలక్ష్మి, పార్లమెంటు సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కె.ధనంజయ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ఐటీడీఏ పీవో ఎల్. శివశంకర్, మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహనరావు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే తలే బద్రయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష, నాయకులు చౌదరి బాబ్జి, జడ్డు ఉషారాణి, జడ్డు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

9న గ్రామీణ బంద్‌లో రైతులు : ఏపీ రైతు సంఘం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఈనెల 9వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌లో రైతులు, రైతు సంఘ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. ఈమేరకు వారు శనివారం సంయుక్తంగా ప్రకటన చేశారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా ఈనెల 8,9వ తేదీల్లో కార్మికవర్గం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వ్యవసాయానికి పెట్టుబడిపై 50 శాతం అదనంగా గిట్టుబాటు ధర కల్పిస్తామన్న మోడీ హామీ నెరవేరలేదన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులపై ఉన్న ప్రేమ రైతులపై లేదన్నారు. రైతాంగానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణాలు మాఫీ చేయాలని, కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్లను కేంద్రం పరిష్కరించాలన్నారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందచేసి బ్యాంకు రుణ సదుపాయాన్ని కల్పించాలి, కరవు, తుపాను, వరద ప్రాంతాల్లో ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారం చెల్లించాలనే డిమాండ్స్ సాధన కోసం జరిగే సమ్మెలో రైతులు, వృత్తిదారులు, వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

సార్వత్రిక సమ్మెకు బీకేఎంయూ మద్దతు

దేశవ్యాప్తంగా జనవరి 8,9వ తేదీల్లో జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు తెలియచేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక సంఘాలు చేస్తున్న న్యాయసమ్మతమైందని, కార్మికుల డిమాండ్ల సాధన కోసం బీకేఎంయూ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలిపారు.



సార్వత్రిక సమ్మెను

జయప్రదం చేయండి

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 8, 9 తేదీల్లో జరుగు జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నందు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఓబులేసు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 8, 9 తేదీల్లో జరుగు సమ్మెలో వైద్య ఉద్యోగులంతా పాల్గొని వారి పని ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సూర్యవతి మాట్లాడుతూ సమ్మెకు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ పూర్తి మద్దతు ఇస్తుందని, రాష్ట్రంలోని అన్ని వైద్యశాలల్లో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, కార్మిక, ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడతామని తెలిపారు. ఈ సమ్మెకు ప్రజానీకం పూర్తి సహకారాలు అందించాలని, కార్మికుల హక్కులను రక్షించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజునాయుడు, కోశాధికారి గిరిబాబు, రాష్ట్ర కార్యదర్శి ఎన్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి 8, 9 తేదీల్లో జరుగు దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.లక్ష్మీదేవి, పి.సూర్యవతిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర ధరలను అదుపులో పెట్టాలని, కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ స్కీంల్లో పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండు చేశారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. రోజు రోజుకూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండు చేశారు. పై డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8, 9 తేదీల్లో జరుగు సార్వత్రిక సమ్మెలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జీవన ప్రమాణాలు పెంపునకే జన్మభూమి

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జీవన ప్రమాణాలు పెంచేందుకే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చంద్రబాబు అన్నారు. జన్మభూమి నాలుగో రోజుపై శనివారం ఆయన కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ జన్మభూమిలో ఫిర్యాదుల సంఖ్య సగం తగ్గి, ప్రజల భాగస్వామ్యం రెట్టింపు అయిందన్నారు. వైద్యశిబిరాలు, వెటర్నరీ క్యాంపులకు స్పందన బాగుందన్నారు. ప్రతి గ్రామంలో, వార్డులో అభివృద్ధి పనులు చేశామని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రజల్లో సంతృప్తే ఫిర్యాదుల సంఖ్య తగ్గడానికి కారణమన్నారు. రేషన్, పెన్షన్, ఇళ్ల కోసం వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, అర్జీదారుల్లో అర్హులందరికీ న్యాయం జరగాలన్నారు. సొంత ఇల్లు లేని ప్రతి ఉద్యోగికి గృహ వసతిని కల్పిస్తామని, వారి కలను నెరవేరస్తామన్నారు. ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి భూములను గుర్తించాలని, అపార్ట్‌మెంట్లను నిర్మించి ప్లాట్లను కేటాయించాలన్నారు. సంక్రాంతి రోజుల్లో జన్మభూమి పండగలా జరపాలన్నారు. తీవ్ర ఆర్థిక లోటులో కూడా రైతులకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు సీఎం చెప్పారు.

అబద్ధాల మోడీ.. తప్పుడు హామీల బీజేపీ

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అబద్ధాల ప్రధానిగా నరేంద్ర మోడీ, తప్పుడు హామీల పార్టీగా బీజేపీ చరిత్రలో మిగిలిపోతారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ధ్వజమెత్తారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన చేశారు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన రూ. 1,050 కోట్లకు వినియోగ సర్టిఫికెట్లు (యూసీ)లు ఇవ్వలేదని ఇటీవల జరిగిన 5 పార్లమెంటు నియోజకవర్గాల వీడియో కాన్ఫరెన్స్‌లో మోడీ పేర్కొనడం పచ్చి అబద్ధమన్నారు. నీతి అయోగ్ నుంచి కేంద్ర ఆర్థికశాఖకు గత ఏడాది డిసెంబరు 18వ తేదీన పంపిన లేఖలో ఏపీ రూ. 1,049.34 కోట్లకు యూసీలిచ్చినట్లు స్పష్టంగా పేర్కొందన్నారు. రాజ్యసభలో కేవీపీ రామచంద్రరావుకు ఇచ్చిన సమాధానంలో 2018 జనవరి వరకూ ఇచ్చిన యూసీలపై ఏపీ రూ. 946.50 కోట్లకు యూసీలిచ్చినట్లుగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చెప్పారన్నారు. నీతి అయోగ్ చైర్మన్‌గా ఉన్న పీఎం మోడీకి ఈ లేఖ తెలిదన్నారంటే ప్రభుత్వం ఏవిధంగా నడుస్తుందో అర్థమవుతోందన్నారు. ఏపీ యూసీల గురించి మాట్లాడే ముందు కేంద్రం యూసీలపై ఎందుకు స్పష్టత ఇవ్వరు? అని ఆయన ప్రశ్నించారు. ఎడ్యుకేషన్ సెస్ కింద వసులు చేసిన రూ. 82వేల కోట్లను ఇప్పటి వరకూ ఎందుకు ఖర్చు చేయలేదో మోడీ సమాధానం చెప్పాలన్నారు. ఏపీపై మోడీ కక్ష సాధింపునకు ఆయన వ్యాఖ్యలే అద్దం పడుతున్నాయని ఆయన తెలిపారు. దీనికి బీజేపీ తగిన మూల్యాన్ని చెల్లించకతప్పదని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఘోరంగా ఓడిపోవడం ఖాయమని కుటుంబరావు స్పష్టం చేశారు.

తగ్గిన సర్వీసులు..

పెరిగిన ఇక్కట్లు!

- పోలవరం, అమరావతి సందర్శనకు బస్సుల తరలింపు
- బస్‌స్టేషన్లలో గంటల కొద్దీ ప్రయాణికుల పడిగాపులు
- సీట్ల కోసం తోపులాటలు, వాగ్వాదాలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) ప్రయాణీకుల సహనానికి పరీక్ష పెడుతోంది. నిర్దేశించిన వేళకు బస్సులు నడవడం లేదు సరికదా, కొన్ని మార్గాల్లో తక్కువ సర్వీసులు ఉండడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సర్వీసులు కుదించి వేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో వివిధ పనులపై సమీపంలోని నగరాలు, పట్టణాలకు వెళ్లేవారి బాధలు వర్ణనాతీతం. సంస్థ ప్రస్తుతం అద్దె బస్సులతో కలిపి దాదాపు 12 వేల బస్సులను నిర్వహిస్తోంది. వీటిలో 50 శాతం బస్సులు గ్రామీణ ప్రాంతాలకు నడిపే పల్లె వెలుగు బస్సులే. అయితే ప్రభుత్వం వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, యువకులను పోలవరం, అమరావతి రాజధాని నగర సందర్శనలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగిస్తోంది. దీంతో ఏయే జిల్లాల నుంచి బస్సులను సమకూరుస్తున్నారో ఆ జిల్లాల్లో బస్సుల కొరత ఏర్పడి ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను చూపేందుకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ లేదా మంత్రి కోరిక మేరకు ఆయా జిల్లాలోని డిపోల్లో బస్సులను సమకూర్చాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు డిపో మేనేజర్లకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. బస్సుల అద్దె సహా సందర్శకులకు అల్పాహారం, భోజన సదుపాయాలకు అయ్యే వ్యయాన్ని జల వనరుల శాఖ భరిస్తోంది. అలాగే గత డిసెంబరులో సీఎం శంకుస్థాపన చేసిన సచివాలయం, వివిధ విభాగాధిపతులకు సంబంధించిన టవర్లు సహా జ్యుడీషియల్ కాంప్లెక్స్ సీడ్ యాక్సెస్ రోడ్లను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అధికారులు చూపిస్తున్నారు. వీరికయ్యే ఖర్చును సీఆర్‌డీఏ వెచ్చిస్తోంది. అయితే రోజుకి 40కి పైగా బస్సులు రాష్ట్ర నలుమూలల నుంచి రాజధాని ప్రాంతానికి నడుపుతున్నారు. అలాగే మరికొన్ని బస్సులు పోలవరం సందర్శనకు వినియోగిస్తున్నారు. దీంతో రోజువారీ సర్వీసుల్లో కోత ఏర్పడి రద్దీ సమయాలైన ఉదయం, సాయంత్రం వేళల్లో పడిగాపులు కాయడమే కాకుండా బస్సుల్లో సీట్ల కోసం యుద్ధాలు చేయాల్సి వస్తోందని ప్రయాణీకులు వాపోతున్నారు. డిసెంబరు 31న గుంటూరులోని పల్నాడు బస్టాండులో నరసరావుపేట, సత్తెనపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం గంటల కొద్దీ సమయాన్ని వెచ్చించాల్సి వచ్చిందని చెబుతున్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి మచిలీపట్నం, గుడివాడ వంటి మార్గాల్లో కొన్ని రోజులుగా పల్లె వెలుగు సర్వీసులు తక్కువగా ఉండడంతో ఇరుక్కుని మరీ ప్రయాణించాల్సి వస్తోందని రోజువారీ తిరిగే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, సీట్ల కోసం జరిగే తోపులాటల్లో మాటామాటా పెరిగి వివాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు 2వేలే!

ప్రస్తుతం పోలవరం, అమరావతి సందర్శన కోసం బస్సులను వినియోగిస్తున్నందున ఆ ప్రభావం సంక్రాంతి పండుగ సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సులపై పడింది. ఈ ఏడాది సంక్రాంతికి 2 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రధాన నగరాలు, పట్టణాలకు వీటిని నడపనున్నారు. పండగ తర్వాత కూడా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. గత ఏడాది సంక్రాంతికి ముందు 4,375 బస్సులు, పండగ తర్వాత 4,500 బస్సులు నడిచాయి. గత దసరా సెలవుల్లో కూడా 3,300 ప్రత్యేక బస్సులను సంస్థ నడిపింది. అయితే ఈ ఏడాది సంస్థ 2 వేల బస్సులను మాత్రమే నడుపుతోంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం, అమరావతి యాత్రలకు బస్సులను సమకూర్చడం వల్ల సంస్థకు ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణీకుల పరంగా వస్తున్న విమర్శలను ఆర్టీసీ అధికారులు ఎదుర్కొనే పరిస్థితి. పండుగ రోజుల్లో ఈ యాత్రలు నిర్వహించకపోవచ్చని, తద్వారా రద్దీకి అనుగుణంగా ఆయా మార్గాల్లో బస్సులను నడిపేందుకు అవకాశం కలుగుతుందన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు చేసిన పనికి బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్‌లు శనివారం ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వేతన, మెటీరియల్ బకాయిలు 1300 కోట్లకు పైగా ఉండటం చాలా దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలకు వారంలోగా చేసిన పనికి డబ్బులు ఇవ్వవలసి ఉన్నప్పటికీ, సకాలంలో చెల్లించక వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్రంలో తీవ్ర కరవు, తుపానులతో పేద ప్రజలు, రైతులు, కౌలుదార్లు, చేతివృత్తులవారు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేవలం ప్రచార ఆర్భాటాలకు పరిమితమైపోతున్న ప్రభుత్వాలకు పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. కరవు ప్రాంతాల్లో కూలీలు పనులు లేక పస్తులుంటూ, ఇతర ప్రాంతాలకు వలసలు పోతుంటే వారికి పనులు కల్పించకపోవడం ప్రభుత్వాల దమనకాండకు పరాకాష్ట అని తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర ప్రభుత్వ అవసరాలకు, రంగాలకు నిధులు మళ్లించడం వలన ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. వలసలు వెళ్లిన వారినందరినీ తమ గ్రామాలకు రప్పించి ఉపాధి హామీ పనులను కల్పించి ఆదుకోవాలన్నారు. జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలీ రూ.500 ఇవ్వాలని వారు డిమాండు చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు పనులు గుర్తించి యంత్రాలతో పని లేకుండా కష్టజీవుల ద్వారానే చేయించి చట్టంలో పేర్కొన్న విధంగా చెల్లింపులు జరపాలని కోరారు.



ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలి: జోషి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మూడు విడుతలలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎలు, కమీషనర్లు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి కోరారు. శనివారం సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నాగిరెడ్డి, డిజిపి మహేందర్ రెడ్డిలతో కలసి పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు అందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎవరైన పోలింగ్ సిబ్బందికి అనుకోని సంఘటన ఎదురైనప్పుడు తక్షణమే స్పందించేలా ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. అధికారి వివరాలను పోలింగ్ సిబ్బందికి తెలపాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్ , సెక్యూరిటీ ప్లాన్ , వాహనాలు, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ , స్టోరేజ్ సెంటర్ల గుర్తింపు , బడ్జెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. గ్రామ పంచాయతీలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలో పోలీస్, రెవెన్యూ పోలింగ్ మెటీరియల్‌ను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రింటింగ్, ఓటరు స్లిప్పుల ప్రింటింగ్, డిస్ట్రిబ్యూషన్, బ్యాలట్ పేపర్ల ప్రింటింగ్, పెపర్ సీల్స్ అవసరమైన వన్నీ సిద్దంగా ఉంచుకొని పంపిణీ చేయాలన్నారు. జిల్లాలలో డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, కలెక్షన్ స్టోరేజ్ సెంటర్ల ఎంపికను పూర్తి చేయాలన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష: కేటీఆర్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్షాపూరిత వైఖరిని కొనసాగిస్తున్నదని టిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత నాలుగున్నర సంవత్సరాలుగా తెలంగాణకి ఎనలేని అన్యాయాన్ని చేస్తూనే ఉన్నదని, తాజాగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందించమని పార్లమెంటులో జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘవాల్ చేసిన ప్రకటనపైన ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరు సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ , మిషన్ కాకతీయ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీతి అయోగ్ అనేకసార్లు ప్రశంసలు తెలపడంతోపాటు ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి రూ.24 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికీ కేంద్రం ఆ ప్రతిపాదనను తిరస్కరించడాన్ని ఆయన తప్పుపట్టారు. కేవలం తెలంగాణలో తమ పార్టీకి ఉనికే లేదనే రాజకీయ దురుద్దేశం, వివక్షాపూరిత వైఖరితోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన నిధులను, ప్రాజెక్టులకు అడ్డుపుల్ల వేస్తున్నదన్నారు. మొన్నటికి మొన్న మహారాష్ట్రలోని తాగునీటి ప్రాజెక్టులో 25 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా కింద సుమారు రూ.3,800 కోట్లను విడుదల చేసిందని, అదేసమయంలో పలు సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి, టిఆర్ఎస్ పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినా రాష్ట్రానికి అదనంగా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. తెలిపారు. పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలోను కేంద్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శించిందని కాళేశ్వరం లాంటి తెలంగాణ వరప్రదాయిని ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వడం సహా అనేక అంశాల్లో కేంద్రం ఎప్పటికప్పుడు వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని, ఇదే తీరుగా వ్యవహరిస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17 స్థానాల్లో డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. వినూత్న అభివృద్ధి కార్యక్రమాలతో అగ్రభాగాన ఉన్న తెలంగాణ లాంటి రాష్ట్రం పైన కేంద్ర వివక్ష చాలా భాదకరమన్నారు. పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తున్న కేంద్రం తెలంగాణలోని కాళేశ్వరానికి జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గజ్వేల్‌లో మిషన్ భగీరథ ప్రోగ్రాంని ప్రారంభించారని, తర్వాత మన్ కీ బాత్ ప్రోగ్రాంలో మాట్లాడుతూ మిషన్ భగీరథపై ప్రశంసలు కురిపించారని, కేవలం అవార్డులు, ప్రశంసలు తప్ప పైసలు మాత్రం ఇవ్వడంలేదన్నారు. బిజెపి పక్షపాత వైఖరిని పార్లమెంట్లో ఎండగడతామని, ప్రజల ముందు పెడతామన్నరు. బిజెపి వివక్షాపూరిత వైఖరి వలన ఇక్కడ ఉన్న కాస్తోకూస్తో ఉనికిని సైతం ఆ పార్టీ కోల్పోతుందన్నారు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం సహకరించాలి : చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జలవనరులశాఖ, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ మరింత సహకారం అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ సమర్థతతో పనిచేసి పోలవరం ప్రాజక్టు నిర్మాణంలో సాధించిన ప్రగతికి గుర్తింపుగా సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి నుంచి స్వీకరించిన అవార్డును రాష్ట్ర జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబుకు చూపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఏపీ పనితనానికి అవార్డు ఇస్తూనే, మరో వైపు నిధుల విడుదలకు అడ్డంకులు, ఆలస్యం చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆక్షేపించారు. రైతుల సంక్షేమం, కరవు రహిత రాష్ట్రంగా ఏపీని నిలిపే లక్ష్యంతో పని చేస్తున్నామని, ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.15,380.97 కోట్లను ఖర్చు చేసిందన్నారు. పెంచిన అంచనా వ్యయాలను కేంద్రం ఆమోదించే విధంగా ప్రయత్నాలు చేయాలని సూచించారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

ట్విట్టర్‌లో మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎదురు తిరిగితే అణచివేస్తా అనే ప్రధాని మోడీ ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిందని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఇటీవల ప్రధాని మోడీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బీజేపీ నేతలు సీఎం చంద్రబాబుపై అసభ్య పదజాలంతో దూషించడంపై మంత్రి లోకేశ్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్రధాని మోడీని నిలదీయడం తప్పా అని మంత్రి ట్విటర్ ద్వారా ప్రశ్నించారు.

కార్మిక హక్కులను హరిస్తున్నారు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించి వేస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబా, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి డి.నారాయణరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టిఆర్‌ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్ ఆరోపించారు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరణకు పూనుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను సవరించి పారిశ్రామిక వేత్తలకు, పరిశ్రమల అధిపతులకు అనుకూలంగా మార్చివేస్తున్నారని ఆరోపించారు. చట్టాల రక్షణకు కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలు సాగించడంలో భాగంగా రెండు రోజుల పాటు జరగనున్న సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ పెట్టుబడి దారులకు, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రత్నాకరరావు ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం టి.వెంకట్రాములు, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాజేష్, రమ, పాలడుగు భాస్కర్, జి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మోడీకి బాబు ఊడిగం

అందుకే కేసుల్లేవ్ : రోజా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వేల కోట్ల అవినీతి జరుగుతున్నా ఒక్క కేసు నమోదు కాలేదని, బీజేపీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లాలూచీ పడటం వల్లే ఆయనపై కేసులు నమోదు కావడం లేదని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యురాలు ఆర్‌కే రోజా ఆరోపించారు. నరేంద్రమోడీకి చంద్రబాబు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసును ఎన్‌ఐఏకు బదలాయిస్తే ఎందుకు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఎన్‌ఐఏకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడానికి కారణమేమిటో చెప్పాలని రోజా డిమాండు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం రోజా విలేకరులతో మాట్లాడారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటన తరువాత డీజీపీ గంట వ్యవధిలోనే ఎలా మాట్లాడారో, టీడీపీ మంత్రులంతా ఎలా వ్యవహరించారో అందరూ చూశారన్నారు. ఎయిర్ పోర్టులో ఘటన జరిగితే వెంటనే కేసు నమోదు చేయించి కేంద్రానికి అప్పగించాలన్నారు. కేంద్రం వెంటనే ఎన్‌ఐఏకు బదలాయించాలన్నారు. చంద్రబాబు రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలోకి సీబీఐ, ఐటి వంటి సంస్థలు రాకూడదని చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. హైకోర్టు తీర్పును ఈ ప్రభుత్వం గౌరవించడం లేదన్నారు. దావూద్ ఇబ్రహీం, విజయ మాల్యా, ఆంధ్ర మాల్యాలను చంద్రబాబు కాపాడుతున్నారని రోజా విమర్శించారు. నియంత హిట్లర్‌లా చంద్రబాబు ప్రవర్తిస్తున్నారన్నారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసింది చంద్రబాబేనని, బీజేపీతో లబ్ధిపొంది.. ఆ తరువాత విమర్శలు చేయడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. నీతిఆయోగ్ సమావేశంలో ప్రధానికి వంగి వంగి దండాలు చేసింది చంద్రబాబేనని రోజా గుర్తుచేశారు. రాజధాని, పోలవరం, పట్టిసీమ, నీరు-మీరు కార్యక్రమాల్లో విరీతమైన అవినీతి జరుగుతున్నా బీజేపీ కాళ్ల దగ్గర ఉండటం వల్లే చంద్రబాబు, ఆయన మిత్రబృందంపై కేసులు పెట్టలేదన్నారు. ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వర రావును మావోయిస్టులు హత్యచేస్తే ఆ కేసును ఎన్‌ఐఏకు అప్పగించడం కుట్ర కాదా అని ప్రశ్నించారు. వైయస్ జగన్ కేసు ఎన్‌ఐఏకు అప్పగిస్తే కుట్ర ఎందుకైందని ప్రశ్నించారు. భవిష్యత్తులో టీడీపీ అధికారంలోకి రాదని భావించే జగన్‌ను భౌతికంగా లేకుండా చేయాలని కుట్ర పన్నారని ఆరోపించారు. కోడికత్తి అంటూ హేళన చేస్తున్న చంద్రబాబుకు భయం పట్టుకుందన్నారు. ఈ భయంతోనే బీజేపీతో జగన్ కలిశారని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. కచ్చితంగా కుట్రదారులు బయటకు వస్తారని, ఎన్‌ఐఏ అందరినీ విచారించాలని రోజా తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులకు 2016 సంవత్సరానికి సంబంధించి చెల్లించవలసిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను ఇచ్చేందుకు సంస్థ అంగీకరించింది. ఈమేరకు సంబంధిత అధికారులకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) ఎ.కోటేశ్వరరావు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 11వ తేదీ లోపు అన్ని రీజియన్లకు సంబంధిత లీవ్ రికార్డులను ఆడిట్ చేసి ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను సమర్పించాలని ఆయన కోరారు. దీని వలన పండగ సమయంలో కార్మికులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుందన్నారు.

అర్హులతో కారుణ్య నియామకాలు

సంస్థకు సేవలందించి ఆకస్మికంగా మరణించి ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం కోసం సంస్థ కారుణ్య నియామకాలను చేపట్టిందని కోటేశ్వరరావు తెలిపారు. బ్రేడ్ విన్నింగ్ స్కీమ్‌లో భాగంగా ఇప్పటి వరకూ 1,065 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కారుణ్య నియామకాలను ఐదు విడతల్లో భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా సర్క్యులర్ నెంబరు డబ్ల్యు 4/140 (01)/2019-పీఓఐ ద్వారా డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ పోస్టులకు అర్హత కలిగిన వారి నియామకం జరుగుతుందన్నారు. అన్ని రీజియన్ల డిపో మేనేజర్లు స్క్రూటినీ నిర్వహించి అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను రీజియన్ల మేనేజర్లకు పంపించాలన్నారు. ధృవపత్రాల పరిశీలన, ఫిజికల్ వెరిఫికేషన్ తర్వాత అర్హుల జాబితాను రీజనల్ మేనేజర్లకు జనవరి 18వ తేదీలోగా సంస్థ చీఫ్ మేనేజర్ పర్సనల్‌కు అందచేయాలని ఆయన తెలిపారు.

ఎంప్లాయీస్ యూనియన్ హర్షం

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు జరిపేందుకు యాజమాన్యం చర్యల చేపట్టడం పట్ల ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఐఏపీటీ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విజయకేతనం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:

కేంద్ర ప్రభుత్వం, హెచ్‌బిసిఎస్‌ఇ ముంబయి, ఐఎపిటి సంయుక్తంగా నిర్వహించిన ఐఎపిటి ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య పాఠశాల నుంచి 144 మంది విద్యార్థులు ఎంపికయ్యారని శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ నుంచి 82, తెలంగాణ నుంచి 59 మంది, బెంగుళూరు నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆమె చెప్పారు. ఈ విద్యార్థులంతా ఫిబ్రవరిలో జరగబోయే ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్‌లలో పాల్గొంటారని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డా.బిఎస్.రావు తెలిపారు. ఇటీవల విడుదలైన కెవిపివై ఒలింపియాడ్‌లో కూడా శ్రీచైతన్య నుండి అత్యధికంగా 171 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ ఫలితాలు ఒలింపియాడ్ పరీక్షలలో శ్రీచైతన్య యొక్క అధిపత్యాన్ని మరోమారు నిరూపించాయన్నారు.

సంపాదకీయం

నోటాయనం

ధనమూలం మిదం జగత్– అన్నారు. ఈ ప్రపంచంలో దబ్బుకున్న విలువదేనికీ లేదనే వాస్తవం మనందరికీ అనుభవమే. 'దబ్బుకి యక్కడా అసాధ్యం లేదు' అని అంటుంది మధురవాణి. 'అర్థస్యపురుషోదాస: దాసస్తర్థోన కస్యచిత్' అంటే ఎప్పుడూ పురుషుడు ధనానికి దాసుడే గాని ధనం యెవరికి దాసి కాదు అని ధర్మరాజుతో భీష్ముడు చెబుతాడు. 'సర్వేగుణా: కాంచన మాశ్రయంతి' అంటే డబ్బున్నవాడికి సర్వగుణాలూ ఉంటాయి అని భర్తృహరి గుర్తించాడు. ఆధునిక కాలంలో ఈ సర్వ గుణాలూ అన్నది ప్రత్యేకంగా పేర్కొనాలి. సర్వ అవ గుణాలూ అలవడుతున్నాయి. లేదంటే కోట్లకుకోట్లు పోగే యడం ఎలా సాధ్యం? డబ్బున్న వారి పెత్తనాన్ని మిగిలిన వారు కూడా కిమ్మనకుండా భరిస్తుంటారు. అందుకే 'కులము గల్గువారు గోత్రంబు కలవారు విద్యచేత విర్రవీగువారు పసిడి కల్గువాని బానిసకొడుకులు' అంటూ ఏనాడో తీర్మానించేశారు మన వేమన కవీంద్రుడు. ఈ మానవ నైజాన్నీ మరోకవి 'పసిడి కల్గువాని పృష్ఠంబు పుండైనా వసుధలోన చాలా వార్తకెక్కు' అంటూ, 'పేదవాని యింట పెండ్లయిన ఎరుగరు' అంటూ వర్ణించాడు. అంతే కాదు ఏ సుగుణాలు లేకపోయినా, ఎన్ని దుర్గుణాలు తిష్ఠవేసినా డబ్బుగలవారిని మిగతావారు సకల సద్గుణ సంపన్నులుగా స్తుతిస్తుంటారు. అయితే ధనాశ మను షులను ఎటువంటి దురాగతాలకైనా ఉసిగొల్పు తుందని చెప్పారు సోమర్ సెట్‌మామ్. 'ధనమెచ్చిన మదమెచ్చును మదమెచ్చిన దుర్గుణంబు మానకహెచ్చున్' అన్నాడు కవీశ్వ రుడు. డబ్బు మనిషిలో స్వార్థాన్ని పెంచుతుంది. అవినీతి, అక్రమార్జనలకు పాల్పడేటట్లు చేస్తుంది. ఈ రుగ్మతల నుంచి మనిషిని బయటపడేసే మార్గం ఏమిటి? ఈ ప్రమాదాన్ని మార్క్స్ ఎప్పుడో గుర్తించి ప్రపంచానికి చాటారు. పాశవిక నగదు సంబంధాలు మనిషిని ఎంత క్రూరుడుగా మారుస్తాయో ఆయన వివరించారు. మన ఎర్రన హరివంశం ఉత్తర భాగంలో 'కూడమ్మికొంద్రు జనములు, బాడబులాగమములమ్మి బ్రదుకుదు.. గాయపడిన కలియు గున గౌరవముఖ్యా' అని పేర్కొన్నారు. మానవసంబంధాల స్థానాన్ని డబ్బు సంబంధాలు ఆక్రమించేశాయి. నగదు సంబంధాలు పెరగడంతో గుప్తధనం గుట్టలుగుట్టలుగా పేరుకుపోయింది. ఈ నల్లడబ్బు మన దేశంలోనూ, విదేశాల్లోనూ తిష్ఠవేసింది. ఈ బ్లాక్‌మనీ పని పట్టాల్సిందే. అందుకు ఎవరూ కాదనరు. కానీ ఆ పేరిట ప్రజల్ని ఇబ్బందుల పాల్జేయడాన్ని ఏ ఒక్కరూ సమర్థించరు. కానీ మన ప్రధాని మోడీ అటువంటి తలతిక్కల పనేజేశారు. అయ్యవారిని చేయమంటే కొయ్యవారిని చేసిన చందంగా నల్లధనాన్ని వెలికితీయమంటే.. ప్రజల్ని నోట్ల కాట్లకు గురిచేశారు. 'నిర్ధనస్య మృతస్యచ' అన్నారు. అంటే డబ్బులేని వాడు చచ్చినవాడితో సమానం అని అర్థం. పెద్దనోట్లను రాత్రికి రాత్రే ఆకస్మికంగా, అనాలోచితంగా రద్దు చేసి అనూహ్య విప్లవం సాధించిన వాడిలా డప్పాలు పోయాడు మోడీ. నిజమే వినాశక దిశగా గొప్ప విప్లవం సాధించాడు. అసలు నల్లధనపతులకు ఏ ఇబ్బందిలేకుండా ముందుగానే పకడ్బందీగా పని చక్కబెట్టారు. పేదలు, మధ్యతరగతి వారికి చిల్లర కూడా లేకుండా చేసి వాళ్ల బతుకుల్ని బజారుకీడ్చారు. 'డబ్బులేని వాడు డుబ్బుకు కొరగాడు' అన్న సామెతను ప్రజలకు రుచి చూపించారు. బతుకుల్ని బాగుచేయడమే కాదు, బతుకుల్ని తలకిందులు చేయడం కూడా ఓ విప్లవమే. అదే మోడీ మార్క్ విప్లవం. మితవాద, మతవాద భావజాలాన్ని నరనరాన రంగరించు కొన్న మోడీ పలాయనవాదం వెంట పరుగులు తీయడంలో ఆశ్చర్యమేముంది. 'ధనముడిగిన మదముడుగును మద ముడిగిన దుర్గుణంబు మానును వేమా' అన్న కవి వాక్కుకు సరికొత్త నిర్వచనం ఇచ్చారాయన. బడా బాబులు, కార్పొరేటు శక్తులు, పెట్టుబడిదారుల లాభం, సౌఖ్యం మాత్రమే చాలనుకునే మోడీజీ పేదల దగ్గర డబ్బు ఉండడం వల్లే ఈ సమస్యంతా తలెత్తుతుందని కనుగొన్నాడు. అందుకే పెద్దనోట్లు రద్దు చేసి ప్రజల కాలూచేయీ ఆడకుండా కట్టేశాడు. ఖర్చులను కట్టడి చేశాడు. జనాల వద్ద చిల్లర లేకుండా చేసి నల్లధనం వారి జేబుల్లోకి చేరకుండా చూశాడు. నిజమే.. ఎంతటి గొప్ప ఘనకార్యం! ప్రజలు పొదుపు బాట పట్టించే సూత్రం కదా! ఉదయానే వాకింగ్‌కు వెళ్లి కాఫీతాగేవాడూ, హడావుడిలో ఇంటి దగ్గర టిఫిన్ చేయకుండా క్యాంటీన్‌లో కట్టించుకునేవాడూ, వారమంతా కష్టించి పనిచేసి వారం తంలో సరదాగా ఓ సినిమాకు వెళ్లేవాడూ.. ఒక్కరేమిటీ చిల్లరజనం చేసే చాలా పనుల్ని బంద్ చేసి పొదుపు దిశగా నడిపించాడు. ఏటీఎమ్‌లను వేళాపాళా లేకుండా వాడేసుకునే వారికి ఓటీఎమ్‌లను చూపిస్తున్నాడు. పూలమ్ముకునే, కాయలమ్ముకునే, రోడ్డు పక్క తినుబండారాలు అమ్ముకునే, చిల్లర వర్తకులందరి పనులకు బొందపెట్టేశాడు. నల్లధనం చలామణికి కళ్లెం వేసేశాడు. ధనం సుఖాలు ప్రసాదించే పనిముట్టు అనేవారు. కానీ ధనం అధికారం ప్రసాదించే ఆయుధంగా మోడీ మార్చేసుకోదలచాడు. పెద్దనోట్ల రద్దుతో విపక్షాల వద్ద ఉన్న బ్లాక్‌మనీ అంతా పనికిరాకుండా చేసి వారి బ్యాంకుబోను విరిగేలా చేశాడు. తన పార్టీ వాళ్లకి, తనను నడిపించే కార్పొరేట్లందరికీ ముందుగానే ఉప్పు అందించి బ్లాక్‌ను వైట్‌గా చేసుకునే అవకాశం కల్పించాడు. దీంతో మిగిలిన పార్టీలన్నీ బీదబిక్కి జనంలా అల్లాడిపోతుంటే, తన పార్టీ వద్ద మాత్రం వైట్‌పూసిన బ్లాక్‌మనీ ఓ మూలన మూలిగేలా చేశాడు. స్వకార్యం, స్వామికార్యం అన్నట్లు తన పనితో పాటు తనకొమ్ము కాస్తున్న కార్పొరేట్ల లాభాలకు రాచమార్గం వేసేలా దేశంలో చిల్లర సమస్య సృష్టి చిల్లరవర్తకానికి చిచ్చు పెట్టాడు. నిజమేగదా.. అంతరిక్షంలో ఇళ్లు కట్టుకునే దశలోనూ ఇంకా సంతలు, చిల్లర కొట్టులేమిటి? ఆధునిక నాగరికతకు అనుగుణంగా మాల్స్‌కెళ్లి కూరగాయాలు, పచారి సరకులు తెచ్చుకోవాలి గానీ. ముగ్గురు దర్జాగా బతికేందుకూ, కోట్లు కూడబెట్టేందుకూ, పదిమంది పస్తులుంటే మాత్రం ఏంటి! పదిమంది నోళ్లుగొట్టి నలుగురికి పెట్టేడమే కదా చాతుర్వర్ణ ధర్మం. హిందూత్వ ప్రతినిధిగా మోడీ తన ధర్మాన్ని చాలా గొప్పగా నిర్వర్తించాడు. అందుకే కార్పొరేట్ మీడియా మోడీమాయను మహా గొప్పగా అభివర్ణిస్తోంది. అవినీతి అంతరించిపోతున్నట్లు, నల్లధనం అంతర్ధానమైపోతున్నట్లు ప్రచారా ర్భాటాలతో మోతెక్కించింది. జనం కష్టాలు దానికి పట్టలేదు. ఆర్థిక వ్యవస్థ అధోముఖం పట్టం దానికి కనిపించడంలేదు. చేతివృత్తులు దెబ్బతిని జనం విలవిల్లాడడం, చిన్నచిన్న వ్యాపారాలు మూతపడడం ఈ నోట్లరద్దు ఫలితమేనన్నీ, రెండేళ్లకు పైబడినా ఇప్పటికీ దాని దుష్ఫలితాన్ని అనుభవించక తప్పని దుస్థితి తలెత్తింది. పెట్టుబడిదారీ నాగరికత విషసర్పం కాటు ఫలితం ఇదన్న ఇంగితం లేకుండా పోయింది. లౌకిక జీవనం కష్టాలు పాలు కాకుండా చూడాల్సిన బాధ్యతను విస్మరించిన సర్కారు.. ప్రజలను ఆర్థికంగా చావుదెబ్బతీసిన వాస్తవాన్ని వారు ఇప్పటికీ అంగీకరించలేని దురహంకారంలోనే ఉన్నారు. అదంతా వారి లాటానుప్రాసమని సరిపెట్టు కోమని ఈ నూతన వత్సరం హితబోధ చేస్తోంది. మోడీజీ నగదుతోపాటు నగమీద పగపట్టారు. నల్లధనం ఏదైనా, ఏ రూపంలో ఉన్నా నల్లధనమేగదా! పేద, మధ్యతరగతి మహిళల మెడలో పుస్తెలు, వారసత్వంగా వచ్చిన నగలను కూడా లెక్కతేల్చాలని నిర్ణయించుకొని వచ్చే ఎన్నికల దృష్ట్యా తాత్కాలికంగా వాయిదా వేశారు. నిజమేగదా.. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ కష్టించేవారికి పసిడితో పనేముంటుంది. అందుకే వారికో లెక్క పెట్టాడు. ఆయనకు తిక్క ఉందనుకొనేవారుండవచ్చు. కానీ దానికో లెక్క ఉంది. బడాబాబులు, కార్పొరేటు శక్తుల వద్ద పసిడి ఉంటే అది లాకర్లలో నిక్షేపంగా ఉంటుంది. అదే మెళ్లో వేసుకొని, చేతికి తగిలించుకుని పనీపాట చేస్తుంటే బంగారం ఏడాదికేడాది కరిగిపోతుందిగదా! అయితే ఈ నోట్ల రద్దు, బంగారం పరిమితి ప్రతిపాదన తదితర చర్యలు మోడీ ఇమేజికి గండిపెట్టిన వాస్తవం ఆయన చెవికెక్కడం లేదు. సామాన్యుడు పగబట్టి ఉన్న చేదునిజం నిన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికలు తేల్చిచెప్పాయి. 'బుభుక్షిత కిన్న కరోతి పాపం' అంటే ఆకలిగా ఉన్నవాడు దేనికైనా ఒడిగడతాడు. వ్యాసుదంతటివాడు ఆకలితో ఆగ్రహించి కాశీని శపించ బోయినట్లు చెబుతారు. నోట్లరద్దుతో నానాకష్టాలు పడుతున్న సామాన్యుడు మోడీ పనిపట్టేందుకు సిద్ధంగానే ఉన్నాడు. నోట్ల రద్దుతో ఏదేదో చేస్తానంటూ చివరకు ఆ ఉచ్చులో సామాన్యుడ్ని బలిపశువును చేసేందుకు చూస్తే ఎవరు మాత్రం సహిస్తారు. మోడీజీ సరికొత్త ఆవిష్కరణకు సామాన్యులు ఆయనకిచ్చే బహుమతి అధికార బహిష్కరణే! నిజానికి మోడీకి చిత్తశుద్ధి ఉంటే విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని రాబట్టేవారు., బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టిన స్వదేశీ దొంగలను పట్టుకొని కటకటాల వెనక్కి పంపేవారు. పరిమితి మించిన సంపదవల్ల లాభాలు కన్నా నష్టాలు, సుఖాలు కన్నా దుఃఖాలు హెచ్చుతాయి. ఇటీవల ప్రపంచంలోని డబ్బంతా కొద్దిమంది చేతిలో పోగుపడ టం వల్ల దారిద్ర్యం గజ్జ కట్టింది. దోపిడీకి, పీడనకు ఆస్కారం లేకుండా సంపదను సమానంగా పంచుకుని జీవించే సోషలిస్టు వ్యవస్థలోనే అసమానతలు వైదొలగు తాయి తప్ప ఇంకే వ్యవస్థలోనూ అది సాధ్యంకాదు. అదనపు డబ్బు అనర్థాలను కొని తెచ్చి, అసలు ఆనందాన్ని దూరం చేస్తుందనేది వాస్తవం. మోడీ అదనపు డబ్బున్న దొంగల పనిపట్టకుండా, కష్టించి కడుపునింపుకొనే సామాన్య, మధ్యతరగతికి కడగండ్లు తెచ్చేలా వ్యవహరించాడు. అందుకు ఆయనకు తగిన ఫలితం, ఫలం దక్కడం ఖాయం.

విశ్లేషణ

పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక సంక్షోభం

భాగం - 1

భారత దేశంలో రైతుల ఆందోళనలు



మర్ల విజయ కుమార్





ఈనాడు పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను నియంత్రిస్తోంది. ఒక శతాబ్దం క్రితం రోజా లగ్జంబర్గ్ వివరించిన ప్రపంచ పెట్టుబడి దారీ వ్యవస్థ దోపిడీ విధానం 21వ శతాబ్దంలో కూడా అదేవిధంగా కొనసాగుతున్నది. పెట్టుబడి కేంద్రాలైన పారిశ్రామిక దేశాలు, ముడిసరుకులను, ప్రకృతి సంపదను వెనుకబడిన దేశాలనుండి విచక్షణా రహితంగా కొల్లగొట్టుకుని, లాభాలను ఆర్జించటం ఈ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రధాన లక్షణం. ఈ క్రమంలో ప్రకృతి సంపదను వినాశనం చేస్తూ, పర్యావరణంలో వినాశకరమైన పరిణామాలకు ఈ దోపిడీ దారితీసింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అటవీసంపద, ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలు చేజిక్కించుకుని, తమ ఇచ్ఛవచ్చిన రీతిలో కొల్లగొడుతున్నాయి. తమకు అడ్డేలేదని, ఎదిరించి నిలబడే సత్తా ఎవరికీ లేదని విర్రవీగిన ఈ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తన అంతర్గత వైరుధ్యాల కారణంగా ఈనాడు తీవ్రమైన గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్నది. వెనుకబడిన దేశాలలోనే కాదు, సంపన్న దేశాలుగా లెక్కవేయబడే యూరోపియన్ దేశాలలో సైతం నేడు ప్రజలు పెద్ద ఎత్తున పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు చేస్తున్నారు. 1905లో "సామ్రాజ్య వాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ," అనే గ్రంథంలో లెనిన్ బహుళజాతి సంస్థలు ఏవిధంగా ప్రపంచ సంపదను, వ్యాపారాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని, ప్రపంచాన్ని శాసిస్తాయో వివరించారు. ఈనాడు ఈ బహుళజాతి సంస్థల ప్రపంచ విస్తరణ ఒక పరిపక్వ దశకు చేరుకున్నది. 'కమ్యూనిస్టు మానిఫెస్టో' గ్రంథంలో మార్క్స్, ఏంగెల్స్ లు "అనునిత్యం విస్తరిస్తూ, లాభాలను ఇనుమడింపజేసుకోనిదే పెట్టుబడిదారీ వ్యవస్థ మనలేదని, ఈ విస్తరణ ఆ వ్యవస్థకు ఆక్సిజన్ వంటిదని. ఎప్పుడైతే విస్తరణకు, లాభాల వృద్ధి ఆగిపోతుందో, అప్పుడు పెట్టుబడిబడిదారీ వ్యవస్థ కుప్పకూలిపోతుందని" వివరించారు. ఇప్పుడు, ఈ వ్యవస్థ ఆ దశ వైపు వేగంగా పరుగులుతీస్తోంది.

పెట్టుబడులకు లాభాలు క్షీణించిపోవటం, పెట్టుబడుల విస్తరణకు ప్రపంచ వ్యాప్తంగా ద్వారాలు మూసుకుపోవటం గత 40 ఏళ్ళలో మనం గమనించాము. ఏవిధంగానైనా లాభాలు పెంచుకునేందుకు, ప్రపంచీకరణను అమలుజరిపి, ప్రపంచాన్ని నయా ఉదారవాద విధానాల పదఘట్టన క్రింద అణగదొక్కి, పెట్టుబడిదారీ వర్గం తమ లాభాలను గత నలభై ఏళ్ళలో కొనసాగించగలిగింది. ఆఫ్ షోరింగ్ ద్వారా పారిశ్రామిక ఉత్పత్తిని పేద దేశాలకు తరలించి, అచ్చట చౌకగా లభించే శ్రమ శక్తిని, ప్రక ృతి వనరులను ఉపయోగించుకుని, వీరు తమ లాభాల వేటను కొనసాగించారు. కాని న్యూటన్ గతి సూత్రాల ప్రకారం, ప్రతీ చర్యకూ ఒక ప్రతి చర్య ఉండనే ఉంటుంది. పెట్టుబడి కేంద్రాలనుండి పరిశ్రమలను పెద్ద ఎత్తున తరలించి, చైనా, మెక్సికో వంటి దేశాలలో వస్తూత్పత్తి చేసి, తిరిగి తమ దేశాలలో వాటిని అమ్ముకుని, అపార లాభాలను ఎల్లకాలం కొనసాగిం చవచ్చునని వీరు భావించారుకాని, తమ దేశాలలోని పరిశ్రమలు మూతపడటంతో, పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. గత 40 ఏళ్ళలో బహుళజాతి సంస్థల లాభాలు అనేక రెట్లు పెరిగినా, ప్రపంచ జనాభాలో అత్యధిక శాతం జీవన స్థితిగతులు రానురాను క్షీణిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాల ఫలితంగా, సంపద పెద్ద ఎత్తున ధనిక దేశాల్లోనూ, ఆయాదేశాలలోని ధనవంతుల వద్ద పేరుకుని పోతోంది. ఈనాడు ప్రపంచంలోని మొత్తం సంపదలో 58 శాతం గుప్పెడు అపర ధనికుల చేతుల్లోకి చేరింది. మన దేశంలోనే, గత సంవత్సరం మొత్తం ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం 1 శాతం అపరధనికుల పరమయితే, 80 శాతం ప్రజలకు 10% మాత్రమే దక్కింది. ప్రతి సంవత్సరమూ, సంపద తారతమ్యాలు పెరుగుతూనే ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ గతిసూత్రాల ప్రకారం పెట్టుబడులు కొద్దిమంది బడాపెట్టుబడిదారుల చేతుల్లోకి చేరి, వారివద్ద అపార సంపద పోగుపడుతుందని మార్క్స్ 150 సంవత్సరాల క్రితమే 'పెట్టుబడి' గ్రంథంలో వివరించారు. లెనిన్ ఈ విధంగా గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ పెరిగి, ప్రపంచాన్నంతా తన గుప్పెట్లో ఏవిధంగా బందీ చేస్తుందో వివరించారు. అయితే, ఈ సంపద దోపిడీకి ఎక్కడో ఒకచోట అంతిమదశ ఉండి తీరాలి. అర్థిక శాస్త్ర మూల సూత్రాల ప్రకారం, ఎప్పుడైతే, పెట్టుబడులు పేరుకుపోతాయో, మరొక పక్కన ఆర్థిక వ్యవస్థలో విస్తృత ప్రజానీకం కొనుగోలు శక్తికూడా క్షీణిస్తుంది. అప్పుడు ఇక పెట్టుబడి నిరర్థకమయ్యే పరిస్థితి దాపురిస్తుంది. ఏదో ఒక విధంగా, తమ వద్ద పేరుకుపోయిన సంపదపై లాభాలు గడించటం కోసం, పెట్టుబడిదారీ వర్గం "ఫైనాన్స్ పెట్టుబడులను" ముందుకుతెచ్చి, ఆర్థిక వ్యవస్థలో భవిష్యత్తులో ఉత్పత్తి అవబోయే సంపదపై నేడే జూదమాడి, తక్షణ లాభాలు గడించటం కోసం అనేక రకాల ఫైనాన్షియల్ ఇన్స్ట్రుమెంట్స్ ను వాడుకలోకి తెస్తారు. మొదటగా, అప్పులు ప్రజలపై రుద్ది, తాత్కాలికంగానైనా ప్రజల కొనుగోలు శక్తిని పెంచి, తద్వారా తమ మార్కెట్ ను నిలబెట్టుకోవటానికి ప్రయత్నిస్తారు.

అయితే, ఆదాయాలు క్షీణిస్తుండటంతో, ప్రజలకు అప్పులపై, అంటే క్రెడిట్ కార్డుల వంటి సాధనాలతో వస్తువుల కొనుగోలుకు పరిమితులు ఉంటాయి. ఎందుకంటే, ఒక నెల తరువాత అయినా, వారు ఆ అప్పులను కార్డుకంపెనీలకు తీర్చవల్సి ఉంటుంది. ఆ కారణం చేత, తప్పనిసరి అయితే కాని సామాన్య కొనుగోలుదారుడు క్రెడిట్ కార్డును ఉపయోగించడు. ఇక అమెరికాలో 10 ఏళ్ళక్రితం, మార్కెట్ మందగించిన దశలో, రియల్ ఎస్టేట్ పై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి, ప్రజలకు ఫైనాన్స్ సంస్థలచే సులభ ఋణాలను ఇప్పించి, పదుల లక్షల గ ృహాలను ప్రజలకు ఈ క్రమంలో అమ్మజూశారు. దీనినే 'హౌసింగ్ బబుల్' గా వ్యవహరిస్తారు. ఉద్యోగావకాశాలు లేక, ఆదాయాలు క్షీణించి, బ్రతికే మార్గంలేక, కొన్నాళ్ళపాటైనా కొత్త ఇంటిలో ఉండవచ్చనే ఆశతో, దిగువ మధ్యతరగతి, కార్మిక వర్గ ప్రజలు అప్పులను తీసుకుని, ఇళ్ళలోకి ప్రవేశించారు. ఇచ్చిన అప్పులు తిరిగి రావని ఫైనాన్స్ సంస్థలకు తెలుసు. కాని వారి వద్ద మూలుగుతున్న పెట్టుబడులను ఏదోఒక విధంగా మారకంలో పెట్టనిదే, ఆ పెట్టుబడుల విలువ పడిపోతుందనే భయంతో, వారు ఈ హౌసింగ్ లోన్స్ మంజూరు చేశారు. కాని తాము ఇచ్చిన అప్పులను కాపాడుకోవటానికి, ఫైనాన్స్ సంస్థలు, తమ ఖాతాలను ఎ,బి, సి,డి గ్రేడ్లుగా విభజించి, కట్టకట్టి, ఇతర ఫైనాన్స్ సంస్థలకు అమ్మివేసి, తమ చేతులు కడుక్కున్నారు. ఎప్పుడైతే, ఇళ్ళు కొనుక్కున్నవారు అప్పులు తీర్చలేక చేతులెత్తేశారో, ఇంటి కొనుగోలుదార్లను బయటకు నెట్టి, ఇళ్ళకు తాళాలు వేయవలసి వచ్చింది. అమెరికాలోని పెద్దపెద్ద ఫైనాన్స్ సంస్థలు మొత్తంగా కుప్పకూలిపోయే పరిస్థితి తలెత్తింది. ఆర్థిక వ్యవస్థను కాపాడాలనే నెపంతో, అమెరికా ప్రభుత్వం లక్షల కోట్ల డాలర్ల ప్రజాధనాన్ని గుమ్మరించి, ఈ ప్రైవేటు సంస్థలను కాపాడినా, నేటికీ, అంటే 10 ఏళ్ళతరువాత కూడా, అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆనాటి ఆర్థిక సంక్షోభం నుండి బయటపడలేదు. ఉత్పత్తికి వినియోగించవలసిన పెట్టుబడులు నిరర్థకమై, ఫైనాన్స్ రంగానికి తరలించబడతాయి. ఫైనాన్స్ పెట్టుబడి మౌలికంగా అప్పుల మంజూరుపై లాభాలు గడిస్తుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలలో కంపెనీల షేర్లపై జూదమాడి, తక్షణ లాభాలు గడించటం ఈ ఫైనాన్స్ పెట్టుబడి మరొక

ఫ్రాన్స్ లో గిలె జౌనెస్ ఉద్యమం

ప్రధాన లక్షణం. షేర్ల విలువ పెంచటం, తద్వారా తక్షణ లాభాలను మూట గట్టుకోవటం కోసం మదుపుదార్ల సెంటిమెంటు పేరున, షేర్ మార్కెట్ ను ప్రభావితంచేసి, పనికిరాని కంపెనీల షేర్లను కూడా మసి పూసి మారేడుకాయ చేసి, ఎక్కువకు అమ్మి, వారు తమ తక్షణ లాభాలను జేబులోవేసుకుంటారు. ఆ కంపెనీ నిజంగా ప్రారంభమయి, ఉత్పత్తిని చేసి, మార్కెట్ లో సరుకులు అమ్మి లాభాలు గడించవచ్చును, లేదా దివాలా తీయవచ్చును. కాని ఫైనాన్స్ పెట్టుబడిదారునికి ఆర్థిక రంగ ఉత్పత్తి క్రమంపై ఏ విధమైన ఆసక్తి ఉండదు. "ఈ రోజుకీరోజు, షేర్ల జూదంలో లాభాలు వస్తే చాలును. రేపు మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలితే, నాకేమిటి?" అని ఫైనాన్స్ పెట్టుబడిదారుడు ఆలోచిస్తాడు. ప్రముఖ మార్క్సిస్టు మేధావి జాన్ బెల్లామి ఫాస్టర్ ఈ ఫైనా న్స్ పెట్టుబడిని, ఆర్థిక వ్యవస్థపై లేచి, దాన్ని పీల్చిపిప్పిచేసే కేన్సరు కురుపుగా అభివర్ణించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో తరచూ సంభవించే ఇటువంటి సంక్షోభాల పర్యవసానంగా, పెనుభారం సామాన్య ప్రజలపై పడుతుంది.

దానితో ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించి, మొత్తంగా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి మరింత లోతులోకి కూరుకుపోతుంది. మార్క్స్ చెప్పినట్లుగా పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు తప్పనిసరి. ఒక సంక్షోభం నుండి మరొక సంక్షోభానికి కుంటుతూ, పడుతూ లేస్తూ, ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతుంటుంది. సంక్షోభం నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు లాగటానికి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు సాధారణంగా కొన్ని పద్ధతులను అనుసరిస్తారు. మొదటగా, చప్పబడిపోయి ఉన్న ఆర్థిక వ్యవస్థను తన కాళ్ళపై తాను నిలబడేట్లుగా చేయగలగాలంటే, ప్రజల కొనుగోలు శక్తిని పునరుద్ధరించవలసి ఉంటుంది. అందుకు వారికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటగా ప్రభుత్వం జోక్యం చేసుకుని, ప్రభుత్వ రంగంలో ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం తదితరాలను చేపట్టి, ప్రజలకు ఉద్యోగావకాశాలను కల్పించి, తద్వారా వారి కొనుగోలు శక్తిని పెంచటం. ఈ విధానాన్ని ప్రముఖ ఆర్థిక వేత్త జాన్ మయనార్డ్ కీయెన్స్ ప్రతిపాదించాడు. కాని ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలంటే, మళ్ళీ పెట్టుబడి దారుల నుండి బాండ్ల రూపంలో అప్పులు తీసుకోవాలి. కల్తీలేని పెట్టుబడిదారీ విధానాలైన నయా ఉదార వాద పద్ధతులలో, ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గాల పెట్టుబడులను కాపాడటం కోసం, ప్రపంచ వ్యాప్తంగా దుర్మార్గపు యుద్ధాలను ప్రేరేపించి, తమ ఆయుధాల అమ్మకాలద్వారా, తమ లాభాలను కాపాడుకుంటారు. ఇది సంక్షోభాలనుండి బయట పడటానికి రెండవ పద్ధతి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అనునిత్యం పెట్టుబడిదారుడు తన స్వభావరీత్యా లాభాలను పెంచుకోవటం కోసం అనేక మార్గాలను వెదుకుతుంటాడు. కార్మికుల జీతాలను అదుపులో ఉంచి, వారి ఉత్పాదకతను పెంచటం ఒక ముఖ్యమైన పద్ధతి. నయాఉదార విధానాల కారణంగా, కార్మిక ట్రేడ్ యూనియన్లను ఒక క్రమ పద్ధతిలో విచ్ఛిన్నం చేయటం మనం గత 30 ఏళ్ళలో చూస్తున్నాము. కొత్త కార్మికులను పర్మనెంటు కార్మికులుగా కాకుండా, కాంట్రాక్టు కార్మికులుగానే ఉంచి, వారి చేత ఎక్కువ పనిగంటలు పని చేయించుకుని, జీతాలు తక్కువ ఇచ్చి, కార్మిక సంక్షేమ చర్యలకు ఎగనామం పెట్టి, తద్వారా యజమాని తన లాభాలను కాపాడుకుంటాడు. ఇవన్నీ గాక, కార్మికుల ఉత్పాదకతను పెంచటం కోసం, యంత్రాల వాడకాన్ని పెంచి, తద్వారా, తక్కువమంది కార్మికులతో, ఎక్కువ ఉత్పత్తి చేయగలుగుతాడు. ఈ యాంత్రీకరణ కారణంగా, పరిశ్రమలలో కార్మికుల సంఖ్య గణనీయంగా పడిపోయి, నిరుద్యోగం ప్రబలుతుంది. దానితో, ప్రజల కొనుగోలు శక్తి మరింత క్షీణిస్తుంది. కొత్త టెక్నాలజీలను ప్రవేశ పెట్టటం ద్వారా, పరిశ్రమలలో లాభాలను పెంచుకోవటమే కాకుండా, కొత్త పెట్టుబడులకు అవకాశాలుకూడా ఏర్పడతాయి. ఉదాహరణకు, గత 30 ఏళ్ళలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ రంగాలలో బ్రహ్మాండమైన సాంకేతిక ప్రగతి కారణంగా, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి పెరిగి, కొత్త పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. సర్వీసు రంగంలోకూడా, ఈ కొత్త వస్తువుల అమ్మకాలద్వారా, కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి. జోసెఫ్ షుంపెటర్ అనే ఆర్థిక వేత్త 30వ దశకంలో, "సృజనాత్మక వినాశనం" పేరున ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చాడు. కొత్త టెక్నాలజీ ప్రవేశంతో, కొత్త పరిశ్రమలు పుట్టుకొస్తాయి. పాత టెక్నాలజీతో నడిచే పరిశ్రమలు మూతపడతాయి. పాత పరిశ్రమల నుండి పెట్టుబడులు, కార్మికులు, కొత్త రంగాలలో ప్రవేశిస్తారు. ఈ ప్రతిపాదన 20వ శతాబ్దం అంతం వరకూ ఉపయోగకరంగా కనిపించినా, ఇప్పుడు పరిస్థితిలో మౌలికమైన మార్పు గోచరిస్తోంది. కొత్త టెక్నాలజీతో నిర్మించే నూతన పరిశ్రమలో పెద్ద ఎత్తున ఆటోమేటిక్ యంత్రాల వాడకం అవసరం కావటంతో, ఉద్యో గావకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. వచ్చే రెండు దశాబ్దాలలో ప్రపంచంలోని 80 కోట్ల మంది కార్మికులకు ఉద్యోగాలు పోతాయని, వారి బదులు ఆటోమేటిక్ రోబోలు ఉపయోగించ బడతాయని ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ ఆర్థిక సంస్థలు చెపుతున్నాయి. అంటే, ప్రపంచ జనాభాలో 40 శాతం ప్రజలు ఆర్థిక వ్యవస్థ నుండి బయటకు నెట్టివేయడతారు. దానితో, మార్కెట్ క్షీణించి, నూతన పెట్టుబడులకు అవకాశాలు మందగించి, మరొక కొత్త సంక్షోభానికి తెరలేస్తుందని చెప్పవచ్చును. ఈ విధంగా పెట్టుబడిదారుడు లాభాల వేటలో చేపట్టే ప్రతిచర్యా, అవ్యవస్థ అస్థిరతకు దారితీసి, ఆర్థిక వ్యవస్థ ఒక సంక్షోభం నుండి మరొక సంక్షోభానికి పయనిస్తుంటుంది. ఆర్థిక సంక్షోభాలు పెట్టుబడిదారీవ్యవస్థ అంతర్గత లక్షణంగా మనం చెప్పుకోవచ్చును. సంక్షోభాలు లేకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండజాలదు. రానురాను సంక్షోభాలు తీవ్రతరమై, వాటికి విరుగుడులేక, మొత్తం ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలకు ఈ సంక్షోభం విస్తరించి, సార్వత్రిక సంక్షోభానికి దారితీస్తుంది.

(2వ భాగం వచ్చే ఆదివారం)

వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, సెల్ : 09848933545

కుట్రను బహిర్గతంచేసిన హేతువాదుల హత్యల దర్యాప్తు

కె యన్ ఆదిత్య భరద్వాజ్

2013 నుండి 2017 వరకు సాగిన నాలుగు సంవత్సరాలలో నరేంద్ర దబోల్కర్ 2013లోను, గోవింద్ పన్సారే, కల్బుర్గి 2015 లోను, గౌరి లంకేష్ 2017లోనూ హత్య చేయబడ్డారు. 2018 సంవత్సర ఆరంభం నాటికి దర్యాప్తులో ఎలాంటిప్రగతి కనపడనందున అసలు ఈ హత్యలకు సంబంధించిన నేరస్తులు శిక్షించబడ తారా లేదా అనే అనుమానం జనంలో బల పడసాగింది.

కానీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గత ఫిబ్రవరిలో కే టి నవీన్ కుమార్ ను మద్దూరులో అరెస్టు చేయటంతో పరిస్థితి మారింది. సిట్ కు కీలక సమాచారం లభించింది. నవీన్ కుమార్ గౌరి లంకేష్ కేసులో ప్రధాన ముద్దాయికాక పోయినా అరెస్టయ్యేనాటికి హేతువాది, మైసూరు నివాసి ఆయిన భగవాన్‌ను హత్యకు ప్రయ్నిస్తున్నాడు. నవీన్ కుమార్ కార్యకలాపాలకు సూత్రధారి ఆయి న ప్రవీణ్ పత్రికావార్తలతో ప్రమాదాన్ని గుర్తించి పోలీసుల కంటపడకుండా రహస్య జీవితం గడప సాగాడు. దీనితో సిట్ దర్యాప్తుకు షాకు తగిలింది.

ఆ తరువాత ప్రవీణ్ కుమారును అరెస్టుచేసేందుకు సిట్ దర్యాప్తులో అమోల్ కలే, అమిత్ దేగ్వేకర్ మనోహార్ ఆడావేలను దావనగిరిలో అరెస్టుచేశారు. వీరిలో అమోల్ కలే ,అమిత్ దేగ్వే కర్లను ప్రధాన కుట్రదారులుగా (కింగుపిన్సుగా) గుర్తించారు. వారినుండి స్వాధీనం చేసుకున్న డైరీలలోని సమాచారం తో తరువాత అనేకమందిని అరెస్టుచేశారు.

సిట్ దర్యాప్తు సమాచారంతోనే మహా రాష్ట్రలో కూడా అనేకమందిని అరెస్టు చేశారు. పూనాలో జరుగనున్న ఒక సంగీత సభలో బాంబు వేసేందుకు సిద్ధంచేసుకున్న కుట్రను భగ్నంచేశారు. దబోల్కర్, గోవింద్ పన్సారే ల హత్యలకు సంబం ధించిన వేరు వేరు సమాచారాలను పొందుపరచి ఒక దర్యాప్తు నివేదికను తయారు చేసేందు కవసరమైన సమాచారాన్ని సేకరించారు. సీబీఐ, మహారాష్ట్ర సిట్ సంయుక్తంగా కలె,దేగ్వేకర్. రాజేష్ బంగ్వేరాలను గౌరి లంకేశ్ హత్యకేసులో ప్రధాన నిందితులుగా పేర్కొని ఆరెస్టుచేశారు.

దర్యాప్తు వెలువరించిన హిందుత్వ వాదుల కుట్ర

2011లో కొందరు వ్యక్తులు పూనాలోని ఈ యన్ టీ డాక్టరు వీరేంద్ర తవాడే నాయకత్వంలో దుర్జను లను హత్య చేసేందుకు (హిందూత్వానికి తలవం చని వారు) సిండికేటుగా తయారయ్యారు. దా.దబోల్కరు, గోవింద్ పన్సారే, కల్బుర్గి హత్యలు డా. వీరేంద్ర తవాడే నాయకత్వంలోనే జరిగాయి. కలే అనే వ్యక్తి తవాడేకు ప్రధమ అనుచరుడు. 2006లో తవాడే అరెస్టయిన తరువాత కలే సిండికేటుకు నాయకుడయ్యాడు, గౌరీలంకేశ్ హత్యకు కలేదే నాయకత్వం. ఆ తరువాత కలే అరెస్టు అయ్యేనాటికి ప్రొ॥ భగవానును హత్య చేసే ప్రయత్నంలో ఉన్నాడు.

సనాతన సంస్థ చెందిన పత్రిక సనాతన ప్రభాత్ మాజీ ఎడిటరు సిండికేటుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చాడు. ఆ మాజీ ఎడిటరుకు, సిండికేటుకు మధ్య అమీరు దేవగౌడ సంధానకర్తగా వ్యవహరిచాడు.

యమ్. కల్బుర్గి కుటుంబ సభ్యులు డిసెంబరు మొదట్లో వేసిన పిటీషనును విచారిస్తున్న సుప్రీం కోర్టు ఈ నాలుగు హత్యలకు సంబంధించిన దర్యాప్తులన్నీ ఒకేకుట్ర ఫలితమని చెప్పుతున్నందున ఒకే కేంద్రసంస్థ ఎందుకు దర్యాప్తు చేయరాదో చెప్పవలసిందిగా నోటీసు జారీ చేసింది. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభం కావచ్చు.

గౌరి లంకేశ్, సోదరి కవితా లంకేశ్, కల్బుర్గి కుటుంబసభ్యులు దర్యాప్తును ఒకే కేంద్రసంస్థకు అప్పగించవద్దన్నారు.

(డి హిందు సౌజన్యంతో)

అనువాదం, పీఆర్. ప్రకాశరావు

పోరాట దిశగా జాతీయ బ్యాంకుల పెన్షనర్లు

గోపాలుని రాధాకృష్ణ

దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై జాతీయ బ్యాంకుల విశాంత్ర ఉద్యోగులు ఆందోళనా దిశగా వెళుతున్నారు. దీనిలో భాగంగానే ఈనెల 7వ తేదీన విజయ వాడలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను సీబీపీఆర్‌ఓ (కోఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్లు అండ్ రిటైరీస్ ఆర్గనైజేషన్), ఏఐబిఆర్‌ఎఫ్ (ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. జాతీయ బ్యాంకుల పెన్షన విధానం ఇతర రాష్ట్ర కేంద్రప్రభు త్వోదుగులు, ఉపాధ్యాయులతో పోలిస్తే లోపభూ యిష్టంగా చాలా తక్కువగా అంటే వారికొచ్చే పెన్షన్‌లో సగం కూడా రావట్లేదని అంటున్నారు. సభ్యుల మరుణానంతరం కుటుంబసభ్యులకు అందించే పెన్షన్ ఇంకా అధ్వాన్నంగా తయారైందని చెప్పవచ్చు. ఈ పెన్షన్ కుటుంబపోషణకు సరిపడక పోగా వైద్య ఖర్చులకు అత్యధిక వడ్డీలకు అప్పులు తేవాల్సి వస్తోందని వాపోతున్నారు. పెన్షన్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకునే నాథుడేలేడు.

2015, మే15వ తేదీన ఇండియన్ బ్యాంకు అసోసియేషన్, ఒకే గొడుగు కింద ఏర్పడిన బ్యాంకు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ప్రతినిధుల మధ్య పెన్షనర్ల విషయమై ఒక ఒప్పందం మీద సంతకాలు చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కుగానే పరిగణించాలని, దయతో కానీ, డోనేషన్‌గా కానీ ఇచ్చేది కాదని పేర్కొన్నారు. అది ఒక రకమైన వేతనం మాత్రమేనని తెలిపింది. అలాగే కుటుంబ పెన్షన్ విధానంలో డి.ఎ.ను 100 శాతంగా పరిగణించాలని తెలిపింది. మానవతా దృక్పధంతో వారి సమస్యలను పరిష్కరించాలని కూడా ఈ నోటులో పేర్కొన్నారు. ఇప్పటికి మూడున్నర సంవత్సరాలు గడిచినా ఆ ఒప్పందం కార్యరూపం దాల్చకపోవటం శోచనీయమని పెన్షనర్ల సంఘాలు అంటున్నాయి. దీనిపై ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ వివరణ ఇస్తూ బ్యాంకులు నష్టాలను ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్య ఇప్పట్లో పరిష్కారం చేయలేమని తరువాత పరిశీలిస్తామని అంటుంది. 35,40 సంవత్సరాలు బ్యాంకులకు సేవ లందించి, వాటిని అత్యున్నత స్థానంలో నిలిపిన తమకు ప్రభుత్వం ఇచ్చే బహుమానం ఇదేనా అని పెన్షనర్లు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకుల నష్టాలకు తాము బాధ్యులంకాదని ప్రభుత్వ విధానాలు, రాజకీయ నాయకుల జోక్యమే ప్రధాన కారణంగా పెన్షనర్ల సంఘాల నాయకులు అంటున్నారు. న్యాయస్థానాల తీర్పులు ప్రకారం ఉద్యోగి స్వచ్ఛంద పదవీ విరమణ చేసినా లేక సాధారణంగా జరిగే పదవీవిరమణ అయి నా వారికిచ్చే, ప్రయోజనాలు ఒకేలా ఉండాలని పేర్కొన్నాయి. ఈ విషయంలో వ్యత్యాసం ఉండకూ దదని పేర్కొంది. దీనిపై న్యాయపోరాటం చేసి విజయం సాధించిన ఇరువురు ఆంధ్రా బాంక్ ఉద్యో గుల్లో ఒకరు ఫలితాలు అనుభవించకుండానే మరణిం చడం దురదృష్టకరమని సంఘాల నాయకులు తెలిపారు. దీనికి ఎవరు బాధ్యులని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లుగా ఉన్న తమకు వయస్సు పైబడిన కారణంగా, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వైద్య ఖర్చులు తడిసి మోపెడవు తున్నాయని పెన్షనర్లు ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పదవీ విరమణ అనంతరం అనేక వైద్య సదుపాయాలు కల్పించారని వాటిని తమకు కూడా వర్తింపచేయాలని కోరారు. ఈ విషయంలో బాంకులు తమపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నాయన్నారు. మెడి క్లెయిమ్ పాలసీలు చాలా భారంగా మారాయని, ప్రీమియం రేటు అత్యధికంగా ఉందని అంతేకాక జీ.ఎస్.టీ 18 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 1995 చాప్టర్ ××× ప్రకారం ఆయా బ్యాంకులు పెన్షన్ ఫండ్ ట్రస్టలను ఏర్పాటు చేసుకోవాలని కోరింది. 1995 లో పెనర్లు పరిమిత సంఖ్యలో ఉండటం వల్ల వారిని సభ్యులుగా చేర్చుకోలేదని, కానీ ఇప్పుడు పెన్షనర్ల సంఖ్య మూడు లక్షలకు పైగా ఉంటారని బోర్డులో తమను సభ్యులుగా చేర్చుకోవాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 2018, మార్చి 31 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల పెన్షన్ నిధి 149 లక్షల కోట్లకు చేరుకున్నా తమ న్యాయమైన సమ్యలను పరిష్కరించడం లేదని వాపోయారు. 2002కి ముందు రిటైరైన ఉద్యోగులకు వంద శాతం డి.ఎ.తో పాటుగా ఏప్రిల్ 2010 తర్వాత చేరిన ఉద్యోగులందరికీ పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని సంఘాలు కోరుతున్నాయి.

–సీనియర్ జర్నలిస్ట్

విశాలాంధ్ర
బతుకు
The Life
ఆదివారం
06 జనవరి
2019

అక్షరరూపం దాల్చిన ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళ కదలిక అనే మాటకు ప్రతీక ఆయన.. నిరంతర సాహిత్య పిపాసి.. అనుక్షణం అక్షరాలతో దోబూచులాడే వారిని వెన్నుతట్టి ప్రోత్సహించే సాహితీ కృషీవలుడు. ఆయన ఒక అన్వేషి, ఒక స్నేహశీలి.. అన్నింటికీ మించి మానవత్వం మూర్తీభవించిన ఒక చైతన్య దీప్తి. ఆయనే కొల్లూరి.. అక్షర వల్లరి.


కర్ణాటక మంత్రి తిమ్మప్ప నుండి నేషనల్ అవార్డు అందుకుంటూ



పుట్టింది కోనసీమలో, చదివింది అమలాపురంలో. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి రెండు పోస్టుగ్రాడ్యుయేట్‌లు పొందారు. పదిహేడేళ్ళ ప్రాయంలోనే ఎక్స్‌రే అనే కవితా సంపుటి ప్రచురించారు. 20 ఏళ్ళ వయస్సులో నలుగురు కవులతో నాలుగు దిక్కులు కవితా సంకలనం వెలువరించారు. ప్రతి మనిషిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. సాధారణంగా ఎదుటివారు గుర్తించిన తరువాతనే తమ ప్రతిభను తాము తెలుసుకుంటారు. కొల్లూరి మాత్రం ఆ కోవకు చెందిన వ్యక్తి కాదు. కవిత్వాన్ని ఆదరించేవారు ఎక్కడ? ఎందుకీ వృధాశ్రమ? వంటి నిరుత్సాహపు మాటలను పాతర వేసి తన అభీష్టం మేర అతి చిన్న వయస్సులోనే తన లక్ష్యం వైపు దౌడు తీసిన వ్యక్తి.

విశ్వనాథం, శేషావతీరత్నం కొల్లూరి జననీ జనకులు. తమ్ముడు ప్రకాష్ వ్యాపారం చేసుకుంటున్నారు. ఆరుగురు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. ఇంతటి పెద్ద కుటుంబం నుంచి వచ్చిన ఆయన తన స్వశక్తితో హుందాతనాన్ని ఎక్కడా బీరుపోకుండా సామాజిక చైతన్యానికి తన వంతు కృషిచేస్తున్నారు.

జీవన గమనంలో.. మొదట్లో ఆంధ్రాబ్యాంక్ ఆఫీసరుగా, తరువాత ప్రభుత్వ మహిళా కళాశాలలో అధ్యాపకునిగా సేవలు అందించారు. ఆ తర్వాత ధనలక్ష్మీ బ్యాంకు మేనేజరుగా విధులలో చేరారు. దృష్టి సాహిత్యం వైపు లాగుతూ ఉంటే ఈ ఉద్యోగాలు అతనిని ఆకర్షించ లేకపోయాయి. అందుకే మెగాస్టార్ చిరంజీవి పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించి ఆ తరువాత సినీరంగంలో అడుగుపెట్టి అసోసియేట్ డైరెక్టర్‌గా, రైటర్‌గా పనిచేశారు. ఇతరుల ఇచ్చకు లోబడి లభించే స్వేచ్ఛ అతనికి తృప్తినివ్వలేదు. అందుకే తనే స్వతంత్రంగా అంజలి మాసపత్రిక, ఎక్స్‌రే పత్రిక ప్రారంభించారు. ఎక్స్‌రే పత్రికను 38 ఏళ్ళుగా ప్రచురిస్తూ సంపాదకుడిగా కవితా ప్రపంచంలో ఒక చెరగని ముద్ర వేసుకున్నారు.

కొల్లూరి... అక్షర వల్లరి


ముఖాముఖి కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు - పద్మభూషణ్ డా॥సి. నారాయణరెడ్డితో


ఎక్స్‌రే సభలో ప్రముఖ గాయకుడు డా॥ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంతో కొల్లూరి దంపతులు

తెలిసిన భాషలు - సరదాలు

ఎంతో బిజీ జీవితంలో నిత్య విద్యార్థిగా అధ్యయనం సాగిస్తూ తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషలపై మంచి పట్టు సాధించడమేగాక హిందీలో విశారద పట్టా పొందారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో టైపు హయ్యర్ గ్రేడ్ పరీక్షలో కృతార్థుడయ్యారు.

1987 నవంబరు 14న సరసం అనే సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవం సందర్భంగా కొల్లూరి రాసిన సుదీర్ఘ వచన కావ్యం స్త్రీ ఆవిష్కరించారు. అంటే అతని శ్వాస, ధ్యాస కవిత్వంగా మారింది. రచయితగా కలం కదిలించడమే గాక కొత్తగా కలాలు పుచ్చుకున్నవారికి అండగా నిలుస్తున్నారు. ప్రసిద్ధి చెందిన కవులతో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఏర్పాటు చేసి సాహిత్యస్ఫూర్తిని రగిలించడానికి ప్రయత్నిస్తున్నారు. కవితా రంగంలో అప్పుడప్పుడే పాకుతూ, బుల్లిబుల్లి అడుగులు వేస్తున్న ఎందరో వర్ధమాన కవులకు కవిత్వ మెళకువలను అందిస్తున్న ఒక సారథిగా నేడు దర్శనమిస్తాడు కొల్లూరి.

గత 38 ఏళ్ళుగా నిరాఘటంగా ఎక్స్‌రే మాసపత్రికను ప్రచురించడమేగాక ఎక్స్‌రే పబ్లికేషన్స్ పేరిట 20 పుస్తకాలు కవిత్వానికి సంబంధించినవి ముద్రించిన ఘనుడు ఇతను.

పదిహేడేళ్ళ ప్రాయంలో అంటే 1975లో మినీ కవితా విప్లవం అనే 500 పేజీల పుస్తకం ఎంతో శ్రమకు ఓర్చి ప్రచురించాడు. ఇందులో 200 మంది కవుల కవితలు ఉన్నాయి. ఆ వయసులోనే మహాకవి శ్రీశ్రీ రాసిన కవితలు కడా ఈ పుస్తకంలో చేర్చారు. ఇది ఆయనకు కవులపై ఉన్న గౌరవం, వారిని ఆమోదించే లక్షణానికి నిదర్శనం. ఈ పుస్తకం ప్రచురించే సమయంలో కొల్లూరి ....నేను ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న అమలాపురంలలోని యస్.కె.బి.ఆర్ కళాశాల విద్యార్థిగా ఉండేవాడు.

అలసట ఎరగని బాటసారిలా కవుల ప్రపంచంలో విహరిస్తూ కొత్తదానికి స్వాగతం పలుకుతూ, ఆలోచనల పరవళ్ళను అక్షరాల రూపంలో ఒక కొత్త ఒరవడిలో ఒదిగిస్తూ రాసిన ప్రతి పదంలో శబ్ద సౌందర్యం, భావుకత ఉట్టిపడేటట్లు, అక్షరాల వాడుకలో పొదుపు పాటిస్తూ అంతులేని భావాలను హృదయాలకు తాకేటట్టు, మృదుమధురంగా వాటి చేత నాట్యం చేయిస్తూ పాఠకుల మదిలో తాము కూడా కలం పట్టగలమనే ధీమాను కల్గించుచున్న అక్షర కార్మికుడు కొల్లూరి.

1970వ దశకంలో దేశం నిరుద్యోగ సమస్యతో అల్లాడిపోతుంటే ఆ చిన్న వయసులోనే కొల్లూరి దేశాన్ని బళ్ళో వెయ్యాలి అనే మినీ కవితల పుస్తకం ప్రచురించడం అతని సామాజిక దృక్పథానికి ఒక నిలువెత్తు సాక్ష్యం.

ఈ లోకం నల్లబోర్డు మీద
విప్లవం డస్టర్‌తో
ఓనమాల ఆనవాళ్ళు చెరిపేసి
కొత్త ఊపిరిపోసి అక్షరాలను సృష్టించాలి
మళ్ళీ ఈ దేశాన్ని బళ్ళో వేయాలి
ఇదీ అతడి కవితా ధోరణిలోని సౌందర్యం.


తమిళనాడు గవర్నర్ డా॥ భీష్మనారాయణసింగ్ నుండి భారతజ్యోతి అవార్డు అందుకుంటూ

వ్యక్తిగతం

- కొల్లూరికి కోపం తెలియదు, చేదుగా సంభాషించడం చేతకాదు. మర్యాదను ఇంటిపేరుగా చేసుకుని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా, అభిమానంగా పలకరించడం నైజంగా చేసుకున్న నిరంతర అక్షర కార్మికుడు.
- తాను ఎంత ఎత్తుకు ఎదిగినా తనకు చదువు చెప్పిన గురువులకు ఇప్పటికీ శిష్యుడిగా ఉంటూ సందర్భం వచ్చినప్పుడు వారిని ఆహ్వానించి గౌరవించుకుంటూ మాట్లాడే ప్రతిమాట అర్థవంతంగా మాట్లాడుతూ ఎంత అవసరమో అంతే మాట్లాడడం ఇతడికి చేతనైన విద్య.
- తాను కవిత్వం రాయడమేకాక సమకాలీన కవులను ఆహ్వానించి వారిని సమాజానికి పరిచయం చేస్తున్న గొప్ప విశాల హృదయుడు.
- కొల్లూరి సతీమణి శ్రీమతి కె.కనకవల్లి తిరుపతిలో ఫిజిక్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేసేవారు. వివాహానంతరం కొల్లూరి కార్యక్రమాలకు బాసటగా నిలిచి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తూ ఉత్తమ గృహిణి పాత్రలో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నడవరా, నడవరా పడకమాని నడవరా మానవుడా
నడకలోని లాభమెంతో తెలుసుకోరా సోదరుడా
ప్రతిరోజు ఒక గంట చకచక నడిస్తే
ఏ రోగం నీ దరికి ఎన్నటికీ చేరలేదు

అంటూ వాకర్స్‌క్లబ్‌కు జిల్లా గవర్నర్‌గా 2017లో ఉండి అంతర్జాతీయ ఉత్తమ వాకర్స్ క్లబ్ గవర్నర్‌గా అవార్డు పొందాడు ఈ వాకర్ కొల్లూరి. ప్రస్తుతం వాకర్స్‌కు రీజినల్ కౌన్సిలర్‌గా సేవలు అందిస్తున్నాడు.

సామాజిక సేవలు

- ▲ లయన్స్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థల ద్వారా సేవలు
- ▲ బాలల ప్రతిభను తట్టిలేపి వారిలో సృజనాత్మకత పెంపొందించేందుకు బాల ప్రతిభా పురస్కారాల ప్రదానం
- ▲ శతసేవా కార్యక్రమాలు - 100 రోజులు నిర్విరామంగా 100 రకాల సేవలు. నేత్ర, దంత వైద్యశిబిరాలు, పేదలకు చీరలు, దుప్పట్లు, దుస్తులు, వంట సామాగ్రి వంటివి పంపిణీ, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాల ఉచిత సరఫరా, కుట్టు మిషన్లు, గ్రైండర్లు పంపిణీ వంటివి
- ▲ సబ్‌జైళ్ళల్లో ఉన్న ఖైదీల మానసిక పరివర్తనకు సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణ
- ▲ స్వయంగా 38 సార్లు రక్తదానం చేసిన రక్తదాత. ముఖ్యమంత్రి ప్రశంస


ఎక్స్‌రే అంతర్జాతీయ సదస్సులో కొల్లూరి వేదికపై అంతర్జాతీయ వాకర్స్ నాయకులు, గౌ॥ మండలి బుద్ధప్రసాద్ తదితరులు


ఎక్స్‌రే అవార్డుల ప్రదానోత్సవ సభలో ప్రముఖ దిగంబర కవి జ్వాలాముఖితో

అవార్డులు

- 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి జన్మభూమి పురస్కారం
- ఆంధ్రప్రభ దినపత్రిక నుంచి జర్నలిస్టుల పురస్కారం
- 2000 సంవత్సరంలో మచిలీపట్నం నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు
- 2001లో కర్నాటక గవర్నర్ నుంచి (బెంగళూరులో) పొట్టి శ్రీరాములు పురస్కారం
- 2001లో భారత జ్యోతి అవార్డును బెంగళూరులో అందుకున్నారు
- 2002లో జన్మభూమి పురస్కారం
- 2003లో కర్నాటక మంత్రి తిమ్మప్ప నుంచి రాజీవ్‌గాంధీ ప్రతిభా అవార్డు
- 2004లో ఎన్‌టీఆర్ స్ఫూర్తి అవార్డు
- 2018లో నేపాల్ మంత్రి జగత్‌బాబు విష్ణుశర్మ నుంచి డా. అంబేద్కర్ నేషనల్ అవార్డు (న్యూఢిల్లీ)

ఈ అవార్డులతోపాటు పలు పదవులు చేపట్టారు.

కొన్ని విశేషాలు!

- 1998 సెప్టెంబరు 30న ఎక్స్‌రే కళాత్మక లోగిలి, సాహిత్యం పరిఢవిల్లే వేదిక ఆవిర్భావం.
- 2000 సంవత్సరం నుంచి క్రమం తప్పకుడా నెలనెలా వెన్నెల కార్యక్రమం. ప్రతి నెల మొదటి ఆదివారం వర్ధమాన కవులకు వేదిక ఇది.
- 2004 నవంబరు 13, 14 తేదీలలో విజయవాడలో ప్రపంచంలో ఏ భాషలో జరగని విధంగా తెలుగులో మొట్టమొదటిసారిగా 24 గంటల కవితాధారణ. 500 మంది కవులు పాల్గొన్న సన్నివేశం.
- 38 ఏళ్ళుగా ప్రతి ఏడాది డిసెంబరు 25న కవిత్వంలో ఎక్స్‌రే అవార్డుల బహూకరణ. ప్రధాన అవార్డు 10 వేల రూపాయలు. 10 మందికి రెండు వేల రూపాయల చొప్పన ఉత్తమ కవుల అవార్డు ప్రదానం చేస్తున్న ఎక్స్‌రే వ్యవస్థాపకుడు కొల్లూరి
- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మహాకవి శ్రీశ్రీ కాంస్య విగ్రహం 30-4-2010న శతజయంతి సందర్భంగా ప్రతిష్టాపన. ఆ పైన శ్రీశ్రీ జయంతి, వర్ధంతుల నిర్వహణ, శ్రీశ్రీ అవార్డు బహూకరణ.


24 గంటల కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కొల్లూరి


ఎక్స్‌రే సభలో ప్రసంగిస్తున్న కొల్లూరి, ప్రముఖ సాహితీ విమర్శకులు చేకూరి రామారావు (చేరా) పైడిపాల తదితరులు

- సి.వి.సర్వేశ్వరశర్మ
కోనసీమ సైన్స్ పరిషత్ ప్రెసిడెంట్
అమలాపురం

నేను - సుడిగుండం

(నవల) 7

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి



ప్రియమైన మావయ్యకి.

నమస్కారం. నాలుగు రోజులు ఆగి మీకు రాయాలనుకున్నాను. ఇక్కడికి వచ్చాక రెండు మూడు రోజులు నాకు నిద్ర పట్టలేదు. అమ్మా - మీరు - అత్తయ్య - వెన్నెల - అర్చనా గుర్తిస్తూనే వున్నారు. ఇంటర్ చదువుతున్నప్పుడు ఇలాంటిది లేదు. ఎప్పుడన్నా ఒకటి రెండు రోజులు తప్ప రోజూ ఇంటికి వచ్చేవాడిని. ఇప్పుడు మాత్రం నాకు చాలా దూరంగా వున్నారనిపిస్తోంది.

మీకు చాలాసార్లు చెప్పాలనుకున్న విషయాలు ఇప్పుడు రాస్తున్నాను. ఈ చదువు మీది. మీ కోసం చదువుతున్నాను. నాన్న జబ్బు పడ్డప్పటి నుంచి మీరు మాకు అండగా వున్నారు. అవన్నీ దగ్గరగా చూసాను. అమ్మ చెబుతుంటుంది.

ఎప్పటికప్పుడు మీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలనిపించేది. మీ కళ్లల్లోకి చూడాలంటే భయం. మాటలు పెగలవు.

నాది చిన్న ప్రపంచం. అప్పట్లో అమ్మా - మీ నలుగురూ. ఇప్పుడు నన్ను ఓ పెద్ద ప్రపంచంలో వదిలి వెళ్లారు. అయినా మీరు నా వెనకాల వున్నారనే భావం నాకు కొండంత ధైర్యాన్ని ఇస్తోంది.

మీకు శ్రమ ఇస్తున్నాను. అది మీరు ఒప్పుకోకపోయినా నిజం. ఇప్పటికయినా మీరు వెన్నెల మీదా, అర్చన మీదా దృష్టి పెట్టండి. వారిని మీరు పట్టించుకోవటం లేదని కాదు. వ్యవసాయంతో పాటు మన ఊర్లో ఎన్నో పనులు చేస్తున్నారు. వెన్నెలనీ, అర్చననీ మీరు నన్ను ప్రేరేపించినట్లు చేయాలనేదే నా ఆలోచన. నా చదువు పూర్తి అయ్యాక వారి బాధ్యతలు తీసుకుంటాను.

మీరు నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అలాంటి ఆశలే నాకు వెన్నెల మీదా. అర్చన మీదా వున్నాయి.

నేను ముందు ముందు ఏమవుతావో తెలియదు. నా మావయ్య పిల్లలుగా వాళ్లు ఎంతో ఎత్తుకు ఎదగాలి. అందుకు నేను చేయగలిగింది చేస్తాను. ఈ మాటలు రాయాలన్నా నాకు బెరుకుగానే వుంది. అత్తయ్యకి నమస్కారాలు.

మీ
-రాము

అమ్మా,

నేను ఇక్కడ బాగానే వున్నాను. అలవాటు పడుతున్నాను. రెండు మూడు రోజులు భోజనానికి యిబ్బంది పడ్డాను. నేను వచ్చేముందు నువ్వు మాట్లాడిన ప్రతి మాటా నాకు గుర్తుంది. నా గురించి నువ్వు ఆందోళన పడొద్దు. నాకు మీ అందరినీ చూడాలని వుంది. అయినా కూడా ఇప్పట్లో నేను రాను. ఆరు నెలల తర్వాత వస్తాను.

కొన్ని కొన్ని పనులు చేయాలంటే అయినవారికి దూరంగా వుండాలని, అన్ని బంధాలని, ప్రేమని అదుపులో వుంచుకోవాలని తెలుసుకుంటున్నాను. ఇంక ఉంటాను.

ప్రేమతో నీ
- రాము

పోస్ట్ చేసేముందు ఇంకోసారి చదువుకున్నాను. ఎందుకో నా భాషలో పెద్దరికాన్ని ఆపాదించు కున్నానా అనిపించింది. మావయ్య ఏమనుకుంటాడో అనుకున్నా ఉత్తరం పంపించాను.

నేను మా ఊర్లో దొరికిన కొన్ని పుస్తకాలు చదివాను. తర్వాత జూనియర్ కాలేజీలోని గ్రంథాలయంలో మరికొన్ని చదివాను. వాటి ప్రభావం నామీద పడుతున్నట్లనుకున్నాను.

మావయ్య తప్పకుండా ఉత్తరం రాస్తాడు. అది ఎప్పుడు అందుకుంటానా అనే ఉత్కంఠ మొదలయింది.

****

నేను సైన్స్ లో గ్రాడ్యుయేషన్ చేస్తున్నాను.

ఆర్ట్స్ గ్రూపు వాళ్ల పద్ధతులు వేరే వుంటాయి. మాకు ఫిజిక్స్ - కెమిస్ట్రీ జువాలజీ లాంటివి వుంటాయి. ఇవన్నీ లోతుగా తెలుసుకుంటే ఎన్నోన్నో ప్రకృతి రహస్యాలు అర్థం అవుతాయి.

మానవ శాస్త్రం వేరు. శరీర నిర్మాణం, అందులోని అనేక ప్రక్రియలు, జీవశాస్త్రంలోని వైవిధ్యం. అలాగే వృక్షాలకు చెందినవి అంత ఆసక్తికరంగా వుండవు.

అలాగే మానవ పరిణామక్రమం, విభిన్న వ్యవస్థల ఆవిర్భావం, మనస్థత్వాలు, చరిత్రలూ, తారీఖులూ ఇవి కూడా!

అయితే తెలుసుకోవాలనుకున్న వారికి, సీరియస్ నేచర్ వున్నవారికి ఎలాంటి విషయమైనా ఆసక్తికరంగానే వుంటుంది. అందుకే నేను నా పాఠాలకే పరిమితం కాదలుచుకోలేదు.

"నువ్వు ఇతరుల కంటే భిన్నంగా వుండాలని నేను కోరుకుంటున్నా' అన్న మావయ్య మాటలు నాకు ఎప్పుడూ గుర్తిస్తాయి.

నా మేనమామలు అమ్మ పెళ్లప్పుడు "ఇద్దరు వ్యక్తులు కలిసి బతకటానికి ప్రేమా, నమ్మకం" వుండాలన్నారు. అమ్మను వదిలించుకోవటానికి ఆ మాటలు చెప్పినా అందులోనూ వాస్తవం వుంది.

మనుషులు తాము చేసే పనులకి తగ్గ రీజన్ని సృష్టించుకుంటారు. రంగులు అద్దుతారు. అవన్నీ ఇప్పుడు మరింతగా అర్థం అవుతున్నాయి.

****

జయదేవ్ మా కెమిస్ట్రీ లెక్చరర్

అద్భుతంగా ప్రతి చిన్న అంశాన్నీ విడమరిచి చెబుతారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య కెమిస్ట్రీ ఎలా మొదలవుతుంది అనే అంశం మీద సరదాగానే కాదు. సాధికారంగా చెప్పేవారు.

మధ్య మధ్యలో నేను కొన్ని ప్రశ్నలు అడిగేవాడిని. అలా అడిగేటప్పుడు నన్ను ప్రత్యేకంగా చూసేవారు. అప్పుడు కొందరు ఆడపిల్లలు కూడా నన్ను చూడటం గమనించాను. ఇంకొందరు మునిముసిగా నవ్వుకోవటం కూడా!

"నీ పేరు?" అడిగారాయన

"రాము" అన్నాను.

ఆయన తలూపారు. నాలుగు రోజుల తర్వాత 'రాము' అని పిలిస్తే నిలబడ్డాను.

"ఈ మధ్య నువ్వు ప్రశ్నలు అడగటం లేదేంటి?" అడిగారాయన

నేను మాట్లాడలేకపోయాను.

"ఎవరో ఏదో అంటారని సందేహాలను దాచుకోకూడదు. అడగనంత మాత్రాన ప్రశ్నలు ఆగవు. వాటిని సప్రెస్ చేసుకుంటూపోతే జిజ్ఞాస ఆగిపోతుంది. ప్రశ్నలు అడగని వారంతా జీనియస్‌లు కాదు"

ఒక్కసారిగా క్లాస్ రూమ్ నిశ్శబ్దంగా మారిపోయింది.

"అయితే మీనింగ్ ఫుల్ క్వశ్చన్స్ అడగాలి. మన సినిమాలు కామెడీ కోసం రోత ప్రశ్నల్ని స్టూడెంట్స్‌తో అడిగిస్తుంటాయి"

చిన్నగా నవ్వులు

"నీకు ఎలాంటి అనుమానాలున్నా ఇక్కడ బిడియంగా అనిపిస్తే తీరిక సమయాల్లో నన్ను కలవొచ్చు. ఇది రాముకే కాదు. మీ అందరికీ చెబుతున్నాను" అని పాఠంలోకి వెళ్లిపోయారు.

అలా మా ఇద్దరి మధ్య ఓ అనుబంధం మొదలయింది.

ఆయన్ని నేను కలుసుకున్నాను.

"నీ గురించి, నీ కుటుంబం గురించి తెలుసుకోవాలనుంది. అది నీకు ఇష్టమైతేనే చెప్పు" అన్నారు జయదేవ్.

నేను కాస్త తటపటాయించాను.

"కెమిస్ట్రీకి కుటుంబానికి సంబంధం వుంది. మనకు ఈ ప్రపంచంలో మార్గదర్శకులుగా చాలా మందున్నారు. అది సైన్స్ పరంగా కావచ్చు. ఆధ్యాత్మిక పరంగా కావచ్చు. సంస్కరణవాదులు, విప్లవకారులు, రాజకీయ నాయకులు, కన్సర్వేటివ్స్ ఎవరయినా సరే అప్పటి కాలంలో తమవైన ఆవిష్కరణలు చేసారు. బట్ కొంతమంది తర్వాత పరస్పర విరుద్ధ భావాలకు లోనయ్యారు. అందుకు కారణాలు వెతకాలంటే వారి బాల్యం, కుటుంబం, పరిసరాలు, ముఖ్యంగా వారి ఆర్థిక పరిస్థితి ఇవన్నీ పరిశీలించాలి. అందుకు అడుగుతున్నాను"

అప్పుడు క్లుప్తంగా నా గురించి చెప్పాను.

నేను ఇంతకముందు చదివిన పుస్తకాల గురించి కూడా తెలుసుకున్నారు.

"ప్రేమ పట్ల నీ అభిప్రాయం ఏమిటి?" అన్నారు.

ప్రేమ' లాంటి విషయాల మీద, అందులోనూ టీనేజ్ లవ్ మీద నాకింకా స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడలేదన్నాను. సామాజిక అంశాల మీద కూడా నాకు అవగాహన లేదని చెప్పాను.

ఆయన తలూపారు. తర్వాత చెప్పారు.

"ఈ ప్రపంచం భౌతికమైనది అంటే వాస్తవమైనది. ఇదంతా భ్రమ. కేవలం భావం అనే వారున్నారు. అలాంటి వారందరూ చనిపోయే వరకు ఈ వాస్తవ ప్రపంచంలోనే వున్నారు" అని చిన్నగా నవ్వారు. నాకూ నవ్వు వచ్చింది.

"కొందరు ప్రకృతిలో అర్థంకాని విషయాలన్నీ భావపరంగానే తీసుకుంటారు. ఇదంతా భ్రమ అనుకుంటారు. అలా అనుకోవటంలో వారికో తృప్తి కలుగుతుంది. ఈ లోకంలో మనం నిమిత్త మాత్రులం అంటారు. అది నిజం కాదు. ఇది ఇలానే జరగాలి అని ముందు రాసుంటే మన ప్రయత్నం వుండదు. దేన్నీ మార్చనవసరం లేదు. మార్పు లేని దాన్ని మనం అంగీకరించగలమా?" అన్నారాయన

"అన్నీ మారుతున్నాయి సర్" అన్నాను.

(ఇంకా ఉంది)

శబరిమల గుడిలోకి ఇద్దరు మహిళల ప్రవేశం.. కేరళలో ఉద్రిక్తత



శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి 50 ఏళ్ల వయసులోపు మహిళలు ఇద్దరు ప్రవేశించి చరిత్ర సృష్టించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య శబరిమల ఆలయం తలుపులను డిసెంబర్ 30వ తేదీ సాయంత్రం తెరిచారు. ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున 3.38 గంటల సమయంలో కేరళ రాష్ట్రానికి చెందిన కనకదుర్గ (44), బిందు (42) పోలీసుల సాయంతో ఆలయంలోకి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఈ ఘటన అనంతరం పూజారులు గర్భగుడి తలుపులను మూసివేసి, గంటపాటు ఆలయ శుద్ధి నిర్వహించారు. స్త్రీ, పురుష సమానత్వానికి మద్దతుగా ప్రభుత్వం అండతో కేరళలో ఈనెల ఒకటో తేదీన 620 కిలోమీటర్ల పొడవున దాదాపు 35 లక్షల మంది మహిళలతో మానవ గోడను నిర్మించిన మరుసటిరోజే అయ్యప్ప ఆలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా హిందూ సంస్థలు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. రాష్ట్ర సచివాలయం వద్ద సీపీఎం, బీజేపీ వర్గాల మధ్య ఐదు గంటలపాటు పరస్పరం దాడులు జరిగాయి. దీంతో పోలీసులు జల ఫిరంగులు, భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. కనకదుర్గ, బిందు డిసెంబర్ 24న ఆలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆలయంలోకి మహిళల ప్రవేశానికి నిరసనగా హిందూత్వ సంస్థల పిలుపు మేరకు రాష్ట్రంలో ఈనెల 3న నిర్వహించిన బంద్ హింసాత్మకంగా మారింది. పలుచోట్ల జరిగిన హింసాత్మక ఘటనల్లో ఒకరు మరణించగా, వందమందికి పైగా గాయపడ్డారు. బంద్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. ఈనెల 4వ తేదీన కూడా హింసాత్మక ఘటనలు కొనసాగాయి. వీటికి సంబంధించి ఇప్పటివరకు 801 కేసులు నమోదయ్యాయి. మొత్తం 1,369 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో 717 మందిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ రాత్రి శ్రీలంకకు చెందిన శశికళ శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి, స్వామిని దర్శించుకున్నారు.

చంద్రుడి అవతలివైపు దిగిన చైనా వ్యోమనౌక

అంతరిక్ష పరిశోధనల్లో చైనా అద్భుత విజయాన్ని సాధించింది. ప్రపంచంలోనే మొట్ట మొదటిసారిగా చంద్రుడి అవతలి భాగంలో వ్యోమనౌకను దించింది. చాంగ్-4 అనే ఈ రోబోటిక్ యంత్రం.. ఇప్పటివరకు పెద్దగా శోధించని ఆ ప్రదేశానికి సంబంధించిన ఫొటోలను చాలా దగ్గర నుంచి అందించింది. ఈ విజయంతో ప్రబల అంతరిక్ష శక్తిగా ఎదగాలన్న తన కలను సాకారం చేసుకునే దిశగా చైనా పెద్ద ముందడుగు వేసింది. తాజా ఘటనపై అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) అధిపతి జిమ్ బ్రైండ్ స్టైన్, రష్యా శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు.

బంగ్లాదేశ్ ఎన్నికల్లో అధికార కూటమికే మళ్లీ పట్టం

అంతర్జాతీయ వార్తలు

బంగ్లాదేశ్ ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా మరోసారి ఘనవిజయం సాధించారు. 300 స్థానాలున్న పార్లమెంట్‌కు డిసెంబర్ 30న జరిగిన 11వ సాధారణ ఎన్నికల్లో హసీనా నాయకత్వంలోని అధికార అవామీలీగ్ పార్టీ కూటమి అత్యధికంగా 288 స్థానాలు గెలుచుకుంది. మొత్తం పోలైన ఓట్లలో అవామీలీగ్ కూటమికి 82 శాతం దక్కాయి. దీంతో హసీనా రికార్డు స్థాయిలో మూడోసారి ప్రధాని పదవిని చేపట్టనున్నారు. ఎన్నికల సందర్భంగా దేశవ్యాప్తంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో 17 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువమంది అధికార పార్టీ సభ్యులే.



ఈజిప్టులో 40 మంది ఉగ్రవాదుల హతం

ఈజిప్టులో డిసెంబరు 29వ తేదీన పోలీసులు భారీఎత్తున దాడులు నిర్వహించి, 40 మంది ఉగ్రవాదులను హతమార్చారు. గిజా పిరమిడ్లకు సమీపంలో ఉగ్రవాదులు ఓ పర్యాటక బస్సును పేల్చివేసిన మరుసటిరోజే ఈజిప్టు పోలీసులు ఈ దాడులు జరిపారు. గిజా గవర్నేట్ పరిధిలో 30 మందిని, ఉత్తర సినాయి రాజధాని ఎల్-అరిష్‌లో మరో పదిమంది ఉగ్రవాదులను హతమార్చినట్లు ఈజిప్టు అంతర్గత మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.



దేశవ్యాప్తంగా చలి తీవ్రత


దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ప్రత్యేకించి ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో చలిగాలుల తీవ్రత పెరిగిపోయింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఈ సీజన్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్యేకించి డిసెంబరు ఆఖరులో చలిగాలుల తీవ్రతకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఢిల్లీ, జమ్మూ-కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, పంజాబ్-హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, సిక్కిం తదితర రాష్ట్రాల్లో తీవ్ర చలిగాలులు వీస్తున్నాయి. పొగమంచు కారణంగా వాహనాలు కంటికి కనిపించక, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. జమ్మూ-కాశ్మీర్‌లో ఈ సీజన్‌లో తాగునీరు గడ్డకట్టడం సహజం. ఇదే పరిస్థితి పంజాబ్, హరియాణాల్లో కనిపించింది. వాతావరణంలో తేమశాతం బాగా పెరిగిపోవడంతో చలిగాలుల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. దేశవ్యాప్తంగా సీజన్ సగటు కంటే తక్కువ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి.

3 వేల మంది పర్యాటకులను కాపాడిన సైన్యం

భారీగా కురుస్తున్న హిమపాతం కారణంగా భారత్-చైనా సరిహద్దులో వాహనాల్లో చిక్కుకు పోయిన 3000 మందికి పైగా పర్యాటకులను సైన్యం కాపాడింది. వీరికి చెక్‌పోస్ట్ పోలీసులు, స్థానికులు సహకరించారు. చైనాకు సరిహద్దున తూర్పు సిక్కింలో సముద్ర మట్టానికి 14 వేల అడుగుల ఎత్తున నాథూలాపాస్, 12 వేల అడుగుల ఎత్తున చాంగు సరస్సులు ఉన్నాయి. వీటిని పర్యాటకులు సందర్శించి తిరిగి వస్తుండగా, భారీగా మంచు కురవడంతో జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు వెంబడి మంచు పేరుకుపోయింది. ఎక్కడికక్కడ సుమారు 500 వాహనాలు నిలిచిపోవడంతో డిసెంబర్ 28 సాయంత్రం నుంచి పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీరిలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు కూడా ఉన్నారు. విషయం తెలిసిన సైన్యం వీరందరినీ సిక్కింలోని 17వ మైల్ ప్రాంతంలోని తమ స్థావరానికి తరలించింది. చలికి అస్వస్థతకు గురైన 90 మందిని అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించింది. పర్యాటకులకు అవసరమైన మందులు, ఆహారం, వస్త్రాలను సైనిక దళాలు సమకూర్చాయి.

ఈ ఏడాది 32 అంతరిక్ష ప్రయోగాలు

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్



సంక్లిష్టమైన చంద్రయాన్-2 సహా ఈ ఏడాది 32 అంతరిక్ష ప్రయోగాలు చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. మొట్టమొదటిసారిగా చేపట్టే మానవ సహిత రోదసీయాత్ర 'గగన్‌యాన్'కు ఈ ఏడాదిలో పూర్తిస్థాయి సన్నాహాలు మొదలుపెట్టనున్నట్లు తెలిపింది. "ఈ ఏడాది 32 ప్రయోగాలు చేయబోతున్నాం. చంద్రుడిపై వ్యోమనౌకను దించేందుకు ఉద్దేశించిన అత్యంత సంక్లిష్టమైన చంద్రయాన్-2 ప్రయోగం, చిన్నపాటి ఉపగ్రహ ప్రయోగ వాహక నౌక (ఎస్ఎస్ఎల్‌వీ) ప్రయోగాలు ఉంటాయి" అని ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు.

'హోదా' ఉద్యమకారులపై ఢిల్లీలో లాఠీచార్జి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలంటూ సీపీఐ, సీపీఎం, జనసేన, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన ఢిల్లీలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నవారిపై పోలీసులు లాఠీచార్జి జరిపారు. హోదా కోరుతూ జంతర్‌మంతర్ వద్ద రెండురోజుల దీక్షలు ప్రారంభించారు. నేతల ప్రసంగాల అనంతరం పార్లమెంట్ ముట్టడికి బయలుదేరారు. దీంతో పోలీసులు పార్లమెంట్‌కు వెళ్లే మార్గాను మూసివేసి, ఆందోళనకారులపై లాఠీచార్జి జరిపారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, మధు తదితర నేతలను పోలీసులు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కనిష్టానికి ఇంధన ధరలు

పెట్రోలు డీజిల్ ధరలు డిసెంబరు ఆఖరులో గణనీయంగా తగ్గాయి. లీటరు పెట్రోలుపై డిసెంబర్ 30న 22 పైసలు తగ్గి, 2018లోనే కనిష్ట ధరకు చేరుకుంది. డీజిల్ ధర లీటరుకు 23 పైసలు తగ్గి, గత తొమ్మిది నెలల్లో అతి తక్కువ ధరగా నమోదైంది. పెట్రోలు ధరలు అక్టోబరు 18 నుంచి ఒక్కరోజు మినహా దాదాపు ప్రతిరోజూ తగ్గుతూనే ఉన్నాయి.

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా సుధీర్ భార్గవ

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ)గా సుధీర్ భార్గవను కేంద్రప్రభుత్వం నియమించింది. ఈనెల ఒకటో తేదీన రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సుధీర్‌తో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణం చేశారు. నాలుగేళ్లపాటు సుధీర్ ఈ పదవిలో కొనసాగుతారు.

సీఐసీలో కొత్తగా నలుగురు సమాచార కమిషనర్లు కూడా నియమితులయ్యారు. వీరిలో మాజీ ఉన్నతాధికారులు యశ్వర్ధన్ కుమార్ సిన్హా, వనజ ఎన్ సర్నా, నీరజ్ కుమార్ గుప్తా, సురేశ్ చంద్రల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. వీరు కూడా ఈనెల ఒకటో తేదీన రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణం చేశారు. సీఐసీలో ప్రధాన కమిషనర్‌తో కలిపి 11 కమిషనర్లు ఉండవచ్చు. తాజా నియామకాలతో వారి సంఖ్య ఏడుకు చేరుకుంది.

రైల్వేబోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్

భారత రైల్వేబోర్డు చైర్మన్‌గా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) వినోద్‌కుమార్ యాదవ్ ఎంపికయ్యారు. కేంద్రప్రభుత్వ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శిగా, ఐఆర్ఎస్ఈఈ చైర్మన్‌గా కూడా ఆయన కొనసాగుతారు. ఈయన నియామకాన్ని కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ ఆమోదించింది. ప్రస్తుత చైర్మన్ అశ్వనీ లోహానీ పదవీ కాలం తరువాత వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారు.

రమాకాంత్ అచ్రేకర్ కన్నుమూత

క్రీడావార్తలు

సచిన్ టెండూల్కర్‌ను విఖ్యాత క్రికెటర్‌గా తీర్చిదిద్దిన ప్రముఖ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ (87) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల రెండో తేదీన కన్నుమూశారు. మహారాష్ట్రలో 1932 జనవరి 2న ఆయన జన్మించారు. 2013లో గుండెపోటు రావడంతో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ముంబయిలోని శివాజీ పార్కులో క్రికెట్ క్లబ్‌ను స్థాపించి, వర్ధమాన ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చారు. అచ్రేకర్ 1999లో ద్రోణాచార్య, 2010లో పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నారు. ఈనెల 3వ తేదీన అచ్రేకర్ అంత్యక్రియలు జరిగాయి.

మూడో టెస్టులో భారత్ ఘన విజయం

ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 137 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యత సంపాదించింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 447 పరుగులకు డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఎనిమిది వికెట్లు కోల్పోయి 106 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 151. రెండో ఇన్నింగ్స్‌లో 261 పరుగులు చేసింది. 1986 తరువాత దక్షిణాఫ్రికా, న్యూజీలాండ్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో.. ఏ ఒక్క దేశంలోనైనా భారత్ రెండు టెస్టులు గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. ఆస్ట్రేలియాలో ఒకటి కంటే ఎక్కువ టెస్టుల్లో గెలవడం టీమ్ ఇండియాకు ఇది రెండో సారి. 1977-78 పర్యటనలో రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. అయితే సిరీస్‌ను 2-3 తో కోల్పోయింది. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు కోల్పోయి 677 పరుగులకు డిక్లేర్ చేసింది. పుజారా 193 పరుగులు, రిషబ్ పంత్ 159 పరుగులు చేశారు. ఈనెల 4న ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది.

కొలువుదీరిన కొత్త హైకోర్టు

రాష్ట్ర వార్తలు

ఆంధ్రప్రదేశ్ నూతన హైకోర్టు ఈనెల 1వ తేదీన ఏర్పాటైంది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ సహా 14 మంది న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నర్ నరసింహన్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు, అధికారులు, భారీ సంఖ్యలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, ఇతరులు తరలివచ్చారు. హైకోర్టు ఏర్పాటుకు సంబంధించి రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ) సిహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ చదివి వినిపించారు. అనంతరం న్యాయమూర్తులతో గవర్నర్ ప్రమాణం చేయించారు. విజయవాడలో హైకోర్టు తాత్కాలిక భవనాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ ప్రారంభించారు. కోర్టు గదులను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభిం చారు. రాష్ట్రంలో హైకోర్టు ఏర్పాటు గర్వకారణమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ శుభాకాంక్షల సందేశం పంపించారు. హైకోర్టులో మొదటిరోజు నాలుగు ధర్మాసనాలు కేసులను విచారించాయి. నాలుగు ధర్మాసనాల్లో ఎనిమిది మంది న్యాయమూర్తులు పనిచేశారు. మిగిలిన న్యాయమూర్తులు ఒక్కొక్కరుగా కేసులను విచారించారు.



ఉద్యోగాల భర్తీకి ఒకేరోజు 7 నోటిఫికేషన్లు

గ్రూప్-1లో 169 పోస్టులు, గ్రూప్-2లో 446 పోస్టులు మరికొన్ని కలిపి ఏడు ప్రకటనలను డిసెంబర్ 31న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. దీంతో గత నవంబరు 29 నుంచి ఇప్పటివరకు మొత్తం 3,255 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 21 నోటిఫికేషన్లను జారీచేసినట్లయింది.

రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

రాష్ట్రంలో డిసెంబరు ఆఖరులో చలి తీవ్రత బాగా పెరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోస్తా, రాయలసీమల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణం కన్నా రెండు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఉపరితల ఆవర్తనం క్షీణించడంతో ఉత్తర, ఈశాన్యం నుంచి శీతల గాలులు అధికంగా వీస్తున్నాయి. ప్రత్యేకించి కోస్తాపై చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ మన్యం పరిధిలోకి వచ్చే చింతపల్లిలో డిసెంబర్ 31న 1.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పదేళ్ల (2009) తరువాత ఇదే కనిష్ట రికార్డు. ఇతర ప్రాంతాల్లో చలిగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 5 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంటున్నాయి. ఈనెల ఒకటో తేదీన కోస్తా జిల్లాల్లో సాధారణం కన్నా 3 నుంచి 6 డిగ్రీలు, రాయలసీమలో 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర కోస్తాను తీవ్రంగా వణికించిన చలిగాలులు ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రభావాన్ని చూపాయి. ఆరోజు రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు ఇంకా పడిపోయాయి.

తెలంగాణ హైకోర్టు ఆవిర్భావం

తెలంగాణ వార్తలు


తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఈనెల ఒకటో తేదీన ఏర్పాటైంది. తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎస్ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ రాధాకృష్ణన్ మిగిలిన 12 మంది జడ్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కళ... తప్పింది

Sunday Special



(విశాలాంధ్ర స్పెషల్ డెస్క్)
తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగ సంక్రాంతి. ప్రతి ఇంట్లోను సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణ మొదలు కొత్త అల్లుళ్ల కోసం వంటకాలు సిద్ధం చేస్తారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల ముందు నుంచే అరిసెలు, బూరెలు, కజ్జికాయలు, చక్రాలు, జంతికలు, చెక్కలు తదితర పిండి వంటల తయారీతో సందడిగా మారేది. ఇప్పుడు కాలం మారింది. ఆ వంటలు వండుకుందా మన్నా పట్టణ వాతావరణంలో సాధ్యం కాని పని. 50శాతం మందికి ఎలా వండాలో కూడా తెలియదు. దీనిని గుర్తించిన వ్యాపారులు దశాబ్దకాలంగా అన్ని సంప్రదాయ వంటకాలను పండుగ సందర్భంగా మార్కెట్లో ఉంచుతున్నారు. ప్రాంతాన్ని బట్టి, నాణ్యతను బట్టి వీటి ధరలు ఉంటున్నాయి. ముఖ్యంగా సంక్రాంతికి చిహ్నంగా భావించే అరిసెలు కిలో రూ.400 నుంచి అందుబాటులో ఉన్నాయి. ఒక కిలోకు 15 నుంచి 18 అరిసెలు వస్తున్నాయి. ముఖ్యంగా నెయ్యి, నువ్వులుతో చేసిన అరిసెలు ఈ ధరలు ఉంటే మధ్య, దిగువ మధ్య తరగతికి అందుబాటులో ఉండేవిధంగా కొన్ని చోట్ల రూ.300 విక్రయిస్తున్నారు. ఇవికాక బొబ్బట్లు రూ.350, పాలతాలికలు రూ.400, కజ్జికాయలు రూ.860, చెక్కలు, చక్రాలు, జంతికలు రూ.850 వరకు మార్కెట్లో అందుబాటులో ఉంచారు. గత ఏడాది కన్నా కేవలం రూ.20 మాత్రమే ఈ ఏడాది ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



క్యాటరింగ్ తరహాలో..

ఇంట్లో వండుకోలేక బయట కొనుగోలు చేసే వాటిపై నమ్మకం లేని వారికి మార్కెట్లో ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి.





నగరంలోని అనేక ప్రాంతాల్లో వంటకు కావాల్సిన ముడి పదార్థాలు బెల్లం, ఆయిల్, వరి పిండి, నెయ్యి వంటి వాటిని మీరు వారి వద్దకు తీసుకెళితే మీ ముందే వాటితో వండి కిలోకి రూ.100 చొప్పున తీసుకుంటున్నారు. దీంతో నాణ్యతపై నమ్మకంతో ఎక్కువ మంది వీరిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా ఇటువంటి కేంద్రాల వద్ద 24 గంటలు వంటలు వండుతున్నారు. ఒక రోజు ముందు సంప్రదిస్తే సమయం చెబుతున్నారు. దానిని బట్టి అరిసెల పిండి తయారు చేసుకుని వెళితే వెంటనే వండి ఇస్తున్నారు. దీనికి మధ్య తరగతి కుటుంబాల ఆదరణ ఉంది.

నెయ్యిపై డిస్కౌంట్లు

సంక్రాంతి సందర్భంగా నెయ్యిపై అనేక బ్రాండ్లు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. సంగం డెయిరీ కిలోకి రూ.25 తగ్గింపు ఆఫర్లు ప్రకటించింది. ఇవికాక లోకల్ బ్రాండ్లు కూడా ప్రత్యేక ఆఫర్లతో సంక్రాంతికి నెయ్యిని అందు బాటులో తెచ్చింది.

అందుబాటులో బుట్ట బెల్లం

బెల్లం అమ్మకాలు సాధారణ నెలల్లో కన్నా పది రెట్లకు పైగా ఉంటాయి. ఈ బెల్లం తాడేపల్లిగూడెం, యర్రవరం, అనకాపల్లి నుంచి జిల్లాకు దిగుమతి అవుతుంది. సుమారు 25 లారీల బుట్ట బెల్లం సంక్రాంతికి మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. కిలో రూ.50 నుంచి 55 మధ్యలో దీని ధర ప్రస్తుతం ఉంది. గత ఏడాది కూడా ఇంతే ఉంది. మామూలు రోజుల్లో వచ్చే బాక్సు బెల్లంకు బదులుగా సంక్రాంతి సందర్భంగా మార్కెట్లో బుట్ట బెల్లాన్ని అందుబాటులో ఉంచుతారు.



అరిసెల పాకంకు బుట్ట బెల్లమే అనుకూలంగా ఉండడం వల్ల వినియోగదారులు దీనినే తీసుకుంటారని అందువల్ల దానినే అందు బాటులో ఉంచినట్లు వ్యాపారులు తెలిపారు.

నిర్మాణం పూర్తయిన గృహాలకే గిరాకీ



న్యూఢిల్లీ:
రెరా, జీఎస్టీ అమల్లోకి వచ్చాక నిర్మాణం పూర్తయిన గృహాలకు గిరాకీ పెరిగింది. కారణం.. వీటికి జీఎస్టీ లేకపోవటమే! ఆదాయ పన్ను ప్రయోజనాలు కూడా ఉండటంతో మదుపర్లు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ధర కాస్త ఎక్కువైనా సరే నిర్మాణం పూర్తయిన (ఇన్వెంటరీ) గృహాలను కొనేందుకే ఎగబడుతున్నారు. నిర్మాణం పూర్తయి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చిన గృహాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వర్తించదు. అదే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 12 శాతం జీఎస్టీ ఉంది. ఉదాహరణకు ఫ్లాట్ ఖరీదు రూ.60 లక్షలు అనుకుందాం. ఇది నిర్మాణంలో ఉంటే గనక 12 శాతం జీఎస్టీ అంటే రూ.7.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అదే నిర్మాణం పూర్తయిందనుకోండి జీఎస్టీ కట్టక్కర్లేదు. అంతేకాకుండా గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న గృహాలకు సెక్షన్ 80సీ ప్రకారం రూ.1.5 లక్షల వరకు ఆదాయ పన్ను ప్రయోజనాలు కూడా ఉంటాయి. కానీ, నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులతో పోలిస్తే నిర్మాణం పూర్తయిన వాటిల్లో ధర కాస్త ఎక్కువగా ఉంటుంది మరి. హైదరాబాద్‌తోపాటూ దేశంలోని ప్రధాన నగరాల్లో గత రెండేళ్లుగా నిర్మాణం పూర్తయిన గృహాలకే డిమాండ్ ఉంది. పనిచేసే ప్రాంతాలకు దగ్గరగా, తమకు అన్ని విధాలా అనుకూలంగా ఉన్న ప్రాంతంలోనే గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల కొనుగోళ్లకే కొనుగోలుదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రముఖ రియల్టీ కన్సల్టెన్సీ నివేదిక ప్రకారం.. 2018-19 తొలి త్రైమాసికం నాటికి దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 9,45,964 గృహాలు అమ్ముడుపోకుండా (ఇన్వెంటరీ) ఉన్నాయి. ఈ గృహాలు విక్రయమవ్వడానికి ఎంతలేదన్నా 41 నెలల సమయం పడుతుంది. అంటే లెక్కలేనన్ని గృహాలు నిర్మాణం పూర్తయి కొనుగోలుదారులను అందుబాటులో ఉన్నాయన్నమాట.

చైనాకు పొగాకు ఎగుమతుల
పునరుద్ధరణ చర్యలు



గుంటూరు:
భారతదేశం నుంచి చైనాకు పొగాకు ఎగుమతుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు బోర్డు ఇన్‌చార్జి చైర్మన్ కె.సునీత తెలిపారు. గుంటూరులో శుక్రవారం పొగాకు బోర్డు 43వ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి వర్గం ఈ నెల 21న చైనా వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం భారతదేశం నుంచి 113 దేశాలకు పొగాకును ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతుల్లో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా ఉపయోగించడం వలన వ్యవసాయోత్పత్తులు విషతుల్యాలుగా మారి ఎగుమతులపై ప్రభావం చూపుతున్నట్లు ఎన్ఐపీహెచ్ఎం డైరక్టర్ జనరల్ జి జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, బోర్డు అధికారులు, ఉద్యోగులను ప్రశంసాపత్రాలు, అవార్డులతో సత్కరించారు.

విజ్ఞానం

ఆటిజం పిల్లలకు డిజిటల్ మెడిసిన్!

వీడియో గేమ్ ఆధారిత 'డిజిటల్ మెడిసిన్'తో ఆటిజం పిల్లలకు చికిత్స అందించి వ్యాధి లక్షణాలను తగ్గించవచ్చని శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఈవీవోగా పిలిచే ఈ డిజిటల్ మెడిసిన్ పరికరంతో.. వీడియో అనుభూతి ద్వారా ఇంద్రియాలను ఉత్తేజితం చేయవచ్చు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏడీఎం)తో బాధపడే చిన్నారుల్లో 50 శాతం మందికి అటెన్షన్/డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) లక్షణాలు కూడా ఉంటాయి. ఈ రెండు లక్షణాలు కలిగిన వారిలో ఆలోచనా శక్తి తక్కువగా ఉంటుంది. మెదడు కూడా చురుకుగా పనిచేయదు. దేనిపైనా ఎక్కువ దృష్టిపెట్టలేరు. వారు పాఠశాల వయసుకి వచ్చేసరికి ఇవన్నీ మరింత సంక్లిష్టంగా తయారవుతాయి. అయితే వారికి ప్రాజెక్టు: ఈవీవో ద్వారా చికిత్స అందిస్తే ఈ లక్షణాలు తగ్గుముఖం పడతాయని అమెరికాలోని చిల్డ్రన్స్ హాస్పటల్ ఆఫ్ ఫిలడెల్ఫియాకు చెందిన సైకాలజిస్టు బెంజమిన్ యెరిస్ తెలిపారు. 'ఆటిజం పిల్లలకు ప్రాజెక్టు: ఈవీవో ద్వారా నిర్దిష్ట సమయంపాటు చికిత్స అందించాం. ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ చికిత్స పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు' అని యెరిస్ తెలిపారు.

డిప్రెషన్‌కు దారితీస్తున్న వినికిడి లోపం...!



వృద్ధులలో వినికిడిలోపం డిప్రెషన్‌కు దారితీస్తుందని తెలుస్తోంది. వయసుతోపాటు వచ్చే విని కిడిలోపాన్ని మనం కాస్త అజాగ్రత వహించడమ పరిపాటే... కానీ సరై చికిత్స చేయించుకోవడంతో ఈ సమస్యనుండి బైటపడవచ్చు... 70ఏళ్లు దాటిన వారికి వినికిడి చికత్స చేయంచు కోవడం మంచిదేనని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ అధ్యయన వేత్తలు వెల్లడించారు. అతి తక్కువ మంది మాత్రమే చికిత్సకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. వినికిడి లోపాన్ని గుర్తించడం, చికిత్సచేయంచుకోవడం అంత సాధారణమైన విషయమేమీ కాదు. కానీ దీనికి తగిన చికిత్స మాత్రం అత్యవసరం. దీనితో డిప్రెషన్ సమస్యలనుండి బైటపడవచ్చు. పెద్ద వారిలో క్రానికి డిసీజ్ హియరింగ్ లాస్. వినికిడి లోపం నాలుగురెట్లు అధికంగా ఉన్నవారిలో డిప్రెషన్ లక్షణాలు ఉన్నట్లు తేలిన విషయం.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఇన్‌ఫ్రాటెల్	285.05	4.95
ఎస్-బ్యాంక్	189.65	3.01
టాటామోటార్స్	170.95	2.95
భారతీ ఎయిర్‌టెల్	324.70	2.85
వేదాంత	194.45	2.63

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌సీఎల్ టెక్	932.35	-1.69
టెక్‌మహీంద్ర	681.10	-1.47
టీసీఎస్	1,876.85	-1.22
ఇన్ఫోసిస్	673.90	-1.21
హీరోమోటార్‌కార్ప్	3,045.00	-0.89

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.19	69.72
యూరో	79.63	79.47
పౌండ్	88.16	88.26
ఆస్ట్రేలియా డాలర్	48.89	49.12
సింగపూర్ డాలర్	51.38	51.22

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,480	32,598
చెన్నై	30,480	32,598
బెంగళూరు	29,950	32,032
ముంబై	31,280	33,454
విజయవాడ	30,040	33,000
విశాఖపట్నం	30,530	31,950
ప్రొద్దుటూరు	30,520	32,050
ముడి చమురు		47.09

అప్ప ఎగ్గొట్టాను.. అదీ ఓ తప్పేనా?

నీరవ్ మోడీ వితండ వాదన



లండన్:
డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీ బ్యాంకులకు టోకరా వేసి 13 వేల కోట్లు ఎగ్గొట్టి దేశం వదిలి పారిపోయాడు. కానీ ఇలా చేయడం తప్పు కాదంటున్నారు. అవన్నీ పౌర లావా దేవీలట. పైగా గోరంతలు కొండంతలు చేస్తున్నారట. ఇదంతా ఆయన కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పరారీరో ఉన్న ఆర్థికనేరస్థుడుగా ప్రకటించే విషయమై జరుగుతున్న విచారణ సందర్భంగా ప్రత్యేక కోర్టుకు మోడీ తరఫున ఆయన న్యాయవాది ఆ అఫిడవిట్‌ను సమర్పించారు. మోదీ తన మామ మెహుల్ చోక్సీతో కలిసి బ్యాంకులకు టోపీ పెట్టారని ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో మోడీ లండన్‌కు, మెహుల్ చోక్సీ కరీబియన్ దేశమైన యాంటిగువా-బార్బుడోస్‌కు పారిపోయారు. రెండు దేశాలకు భారత్ అప్పగింత విజ్ఞాపనలను పంపింది. కొత్తగా తెచ్చిన ఆర్థికనేరాల చట్టం కింద మద్యం వ్యాపారి విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడుగా ప్రకటించిన కేంద్రసంస్థలు ఇప్పుడు మోడీపై దృష్టి నిలిపాయి. కానీ తనను పరారీలో ఉన్న ఆర్థికనేరస్థుడుగా ప్రకటించరాదని మోదీ తన అఫిడవిట్‌లో విజ్ఞప్తి చేశారు.

జీఎస్టీ అమలులో ఉన్నా..
ఆగని జీరో వ్యాపార దందా!

హైదరాబాద్:
రాష్ట్రంలో జీరో వ్యాపార దందాను నిలువరించేందుకు వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త విధానానికి నాంది పలకనుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి సరకు రవాణా వాహనాలపై నిఘా పెంచనుంది. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చినప్పటికీ రాష్ట్రంలో జీరో వ్యాపార దందా యథేచ్ఛగా సాగుతోంది. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమల్లోకి వచ్చినప్పటికీ కొందరు వ్యాపారులు పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గుర్తించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాల సరిహద్దుల్లోని తనిఖీ కేంద్రాలను పూర్తిగా ఎత్తేశారు. అంతర్రాష్ట్ర వాహన రాకపోకలపై నిఘా కరవైంది. వాహనాల కదలికలపై నియంత్రణ లేకుండా పోయింది. వస్తువుల వినియోగం జరిగిన చోటనే జీఎస్టీ చెల్లింపులు చేయాల్సి ఉన్నా.. కొందరు వ్యాపారులు స్వార్థంతో సరకులు బయటకు పంపకుండానే పంపినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. సరకు అక్కడే అమ్ముకుని పన్ను ఎగవేతకు పాల్పడి జీరో వ్యాపారానికి తెర తీస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ఇప్పటికే ఆర్ఎఫ్ఐడీ విధానం అమలు చేసి మంచి ఫలితాలు రాబట్టింది. ఈ తరహా విధానాన్ని రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టేందుకు వాణిజ్య శాఖ నిర్ణయానికి వచ్చింది. ఆర్ఎఫ్ఐడీ విధానం పూర్తి స్థాయిలో అమలు కావడానికి క్షేత్రస్థాయిలో అక్కడక్కడా యాంటినాలు ఏర్పాటు చేయాల్సి ఉండడంతో కింది స్థాయి అధికారులు నివేదికలు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారి అనిల్‌కుమార్ ఆదేశించారు.

పెద్ద కార్లు మరింత ప్రియం!



న్యూఢిల్లీ:
దేశీయంగా బడా కార్లు మరింత ప్రియం కానున్నాయి. రూ.10 లక్షల కంటే అధిక విలువ చేసే కార్లపై అదనపు పన్ను చెల్లించాల్సి రానుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ విడుదల చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. ఇకపై పెద్ద కార్ల విలువపైన కాకుండా.. కారు ఇన్వాయిస్ విలువకు టీసీఎస (మూలం వద్ద పన్ను వసూలు)ను కలిపితే వచ్చే మొత్తంపైన జీఎసటీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే, ఇకపై పెద్ద కార్ల కొనుగోలు సమయంలో చెల్లించే టీసీఎసపైనా కేంద్రం జీఎసటీ వసూలు చేయనుందన్నమాట. ప్రస్తుతం రూ.10 లక్షల కంటే అధిక విలువ చేసే కార్లపై 1 శాతం టీసీఎస్ వర్తిస్తుంది.



కేర్ అండ్ షేర్ అంబాసిడర్‌గా కబీర్ బేడి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
సమకాలీన వ్యవస్థకు దూరమైన పిల్లలకు 'స్ట్రీట్2స్కూల్' కార్యక్రమంతో మద్దతిస్తున్న ఇటలీకి చెందిన ఎన్‌జీఓ కేర్ అండ్ షేర్ ఇటాలియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు కబీర్ బేడీని నియమించినట్లు ఆ సంస్థ ప్రెసిడెంట్ టోమసా కారరో తెలిపారు. బడికి దూరమైన పేద పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మురికివాడలు, దళిత, గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు సాయం అందిస్తుందన్నారు. ప్రస్తుతం తాము 1500 మంది పిల్లలకు స్పాన్సర్ చేస్తున్నామన్నారు. విజయవాడ కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్నామన్నారు. సమావేశంలో కబీర్ బేడి సహా ఆ సంస్థ ప్రతినిధులు స్వాతి మొహంతి, కళామణి పాల్గొన్నారు.

కాల్‌డ్రాప్‌ల నియంత్రణకు
చర్యలు తీసుకుంటున్నాం

మంత్రి మనోజ్ సిన్హా

న్యూఢిల్లీ: దేశంలో కాల్‌డ్రాప్‌లను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే కొన్ని టెలికాం సంస్థలపై రూ.58 లక్షల పెనాల్టీ వేశామని టెలికాం మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. రాజ్య సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడిం చారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌పై ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి గానూ జూన్ నెలలో రూ.4 లక్షలు, అదే సమ యంలో ఐడియాకు రూ.12 లక్షల చొప్పున పెనాల్టీ విధించామని వెల్లడించారు. కాల్ డ్రాప్ రేటు విషయంలో నిర్దేశిత మార్కును చేరుకున్న సర్వీస్ ప్రొవైడర్లపై ట్రాయ్ ఆర్థిక పరమైన ఆంక్షలను విధించిందని వివరించారు. గత మార్చి నెలలో బీఎస్ఎన్ఎల్‌పై రూ.3 లక్షలు, ఐడియాపై రూ.10.5 లక్షలు, టాటా సంస్థపై 22.5 లక్షలు, టెలినార్‌పై రూ.6 లక్షల పెనాల్టీ విధించినట్లు పేర్కొన్నారు. టెలీ కమ్యూనికేషన్ విభాగంలో మౌలిక సదుపాయాల వృద్ధి, బేస్ ట్రాన్స్ రిసీవర్ స్టేషన్ (బీటీఎస్)ల సంఖ్య 20 లక్షలకు చేరడంతో ఇప్పుడు పరిస్థితి మెరుగుపడిందని వివరించారు. 2014లో బీటీ ఎస్‌ల సంఖ్య ఎనిమిది లక్షలు మాత్రమే అని గుర్తు చేశారు. కాల్ డ్రాప్‌ల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉందని చెప్పారు. కాల్‌డ్రాప్ సమస్యను పారదోలేందుకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా నేరుగా వినియోగదారుల నుంచే అభిప్రాయాలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు.

బ్రాండ్ విలువ పెంపు దిశగా ప్రొటినెక్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
దేశంలోని ప్రముఖ న్యూట్రిషినల్ సప్లిమెంట్ బ్రాండ్ ప్రొటినెక్స్ తాజాగా మేక్ ఇట్ ఏ హాబిట్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. దీనిని ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సమకూరుతుందని ప్రొటినెక్స్ పేర్కొంది. నూతన సంవత్సరంలో తీసుకునే నిర్ణయాలలో ప్రొటినెక్స్‌ను భాగస్వామ్యం చేసుకోవాలని సూచించింది. ప్రొటినెక్స్ హెల్త్, హెల్ బీయింగ్‌కు దోహదపడుతుందని సంస్థ తెలిపింది. దేశంలోని ప్రజలు ఆరోగ్యం విషయంలో అంతగా శ్రద్ధ చూపడం లేదని ఇటీవలి వైద్య పరిశోధనల్లో వెల్లడైంది.

181.39 ▲	55.10 ▲	10 ▲	బంగారం (విశాఖపట్నం) 30,530	0 ◀◀	వెండి (విశాఖపట్నం) 41,450	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు 30,520	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు 41,365	69.72
35,695.10	10,272.35	30,040 22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	40,000 కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కీలక విషయాల మీద

అవగాహన ఉండాలి

బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది వీటిలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం చిన్న బ్యాంకులు ఈ డిపాజిట్లపై 8.5%-9% వరకూ వార్షిక వడ్డీ రేటును అందిస్తున్నాయి. చాలావరకు బ్యాంకులు 7.5శాతం వరకూ వడ్డీ ఇస్తున్నాయి. ఏ ఇతర పెట్టుబడి పథకాలతో పోల్చి చూసినా.. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లను అర్థం చేసుకోవడం సులభం. అయినప్పటికీ.. ఇందులో కొన్ని కీలక విషయాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

రూ.లక్ష వరకూ ఎలాంటి ఇబ్బందీ ఉండదు

బ్యాంకులో చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) ఎంత వరకూ సురక్షితం అనేది చాలామందికి వచ్చే అనుమానం. 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ)' ద్వారా బ్యాంకులో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ.లక్ష వరకూ హామీ ఉంటుంది. బ్యాంకు దివాలా తీసినా ఈ మొత్తం వరకూ ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నమాట. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు ఖాతా మొత్తం, రికరింగ్ డిపాజిట్, కరెంటు ఖాతాలకు ఇది వర్తిస్తుంది. అన్ని వాణిజ్య బ్యాంకులు అంటే.. ప్రభుత్వ, ప్రైవేటు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు (ప్రాథమిక సహకార బ్యాంకులు మినహా) తదితరాలన్నీ డీఐసీజీసీ పరిధిలోకి వస్తాయి. కాబట్టి, పెద్ద బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలనే ఆలోచన అనవసరం. రూ.లక్ష లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకున్నప్పుడు అధిక వడ్డీ ఇస్తున్న చిన్న బ్యాంకులనూ పరిశీలించవచ్చు. నష్టభయం ఉండకూడదు అనుకుంటే.. మీ దగ్గర ఉన్న డబ్బును విడగొట్టి.. రూ.లక్ష చొప్పున వేర్వేరు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడమూ ఒక మార్గం. ఎందుకంటే..ఈ పథకం ప్రతి బ్యాంకులోని రూ.లక్ష లోపు డిపాజిట్లకు వర్తిస్తుంది.

వ్యవధి తీరకుండానే..

ఒకసారి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన తర్వాత వ్యవధి తీరేంత వరకూ కొనసాగించాలి. ఒకవేళ మధ్యలోనే తీసుకుంటే.. బ్యాంకులు 1.5శాతం వరకూ అపరాధ రుసుము విధించే అవకాశం ఉంటుంది. మీకు చెల్లించే వడ్డీరేటు నుంచి ఈ శాతాన్ని తగ్గిస్తారన్నమాట. మీరు ఎఫ్‌డీని ప్రారంభించినప్పుడు ఇస్తామని హామీ ఇచ్చిన వడ్డీ రేటుకు బదులు 1.5శాతం తగ్గించి, ఆ రేటు ప్రకారం మీకు వడ్డీ చెల్లిస్తుంది. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలంటే.. ఎఫ్‌డీ చేసేప్పుడే స్వల్పకాలిక అవసరాలేమైనా ఉన్నాయా అని ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి. ఆ అవసరాల్ని బట్టి, వ్యవధిని నిర్ణయించుకోవాలి.

పరిమితిని మించితే..

ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ మొత్తం రూ. 10వేలు దాటితే..బ్యాంకులు మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధిస్తాయి. పాన్ వివరాలు ఇవ్వకపోతే.. 20శాతం మేరకు కోత ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు వచ్చే వడ్డీ రూ.50వేలు దాటితే పన్ను కోత విధిస్తుంది బ్యాంకు. అయితే, ఈ టీడీఎస్‌తోనే అంతా ముగియదు. సీనియర్ సిటిజన్లకు సెక్షన్ 80టీటీబీ ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.50వేల వరకూ పన్ను వర్తించదు. ఈ పరిమితి మించినప్పుడు.. ఉన్న ఆదాయానికి ఈ వడ్డీని కూడా కలిపి మొత్తం ఆదాయం గణించాలి. అప్పుడు మీకు వర్తించే శ్లాబులను బట్టి, వడ్డీ ఆదాయానికి పన్ను మారుతుంది. టీడీఎస్ ద్వారా చెల్లించిన మొత్తాన్ని రిటర్నులు సమర్పించేప్పుడు సర్దుబాటు చేసుకోవచ్చు. కాబట్టి, మీ డిపాజిట్ల ద్వారా వచ్చే నికర వడ్డీ ఎంతన్నది తెలుసుకునేందుకు పన్ను మొత్తాన్ని తీసేయాలి. అప్పుడే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, హైబ్రీడ్, డెట్ పథకాల్లాంటి ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల నుంచి వచ్చే రాబడులను పోల్చుకోవడానికి సులభం అవుతుంది.

- కొంతమంది ఫిక్స్‌డ్ డిపాజిట్లను జీవిత భాగస్వామి లేదా పిల్లల పేర్లమీద చేస్తుంటారు. వచ్చే వడ్డీకి పన్ను చెల్లించనవసరం లేకుండా ఈ ఏర్పాటు అని భావిస్తారు. వాస్తవంలో ఇది నిజం కాదు. మీ జీవిత భాగస్వామి పేరుమీద మీరు ఎఫ్‌డీ చేసినా.. మైనర్ పిల్లల పేరుమీద ఎఫ్‌డీ చేసినా.. ఆ వచ్చే ఆదాయాన్ని మీ ఆదాయంగానే పరిగణిస్తారు. అప్పుడు మీకు వర్తించే శ్లాబులను బట్టే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పిల్లల పేరుమీద ఉన్న ఎఫ్‌డీపై వచ్చే ఆదాయంలో రూ.1,500 వరకే మినహాయింపు ఉంటుంది.



పన్ను ఆదా ఎఫ్‌డీలకూ..

ఆదాయపు పన్ను సెక్షన్ 80సీ ప్రకారం రూ.1,50,000 వరకూ వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేయడం ద్వారా మినహాయింపు పొందవచ్చు. ఇందులో ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా ఒకటి. వీటి వ్యవధి 5 ఏళ్లు. వీటిపై వచ్చే వడ్డీని కూడలి ఆదాయంలో కలిపి చూపించాల్సి ఉంటుంది. అధిక పన్ను శ్లాబులో ఉన్న వారికి వీటిపై వచ్చే వడ్డీ పెద్దగా గిట్టుబాటేమీ కాదు. ఇలాంటి సందర్భాల్లో మూడేళ్ల వ్యవధి ఉన్న ఈఎల్ఎస్ఎస్‌లు మెరుగైనవిగా చెప్పొచ్చు. వీటి నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభం రూ.లక్ష దాటినప్పుడు దీర్ఘకాలిక మూలధన లాభంపై పన్ను 10శాతం చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, పన్ను ఆదా కోసం ఎంచుకునేప్పుడు ఈ రెండింటిని పోల్చి చూసుకొని, సరైన పథకాన్ని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ష్యూరిటీ సంతకం..

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఈరోజుల్లో మనం అప్పు తీసుకోవాలి అంటే ప్రతి ఒకరు ష్యూరిటీ అడుగుతారు. ఆఖరికి మన ప్రభుత్వ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ష్యూరిటీ లేకుండా లోన్లు అసలు ఇవ్వరు. ఇలా చాలామందికి ష్యూరిటీ ఇచ్చి వారు ఒకవేళ కట్టకపోతే ష్యూరిటీ ఇచ్చిన వారు కట్టాలి. ఇలా ఇబ్బంది పడుతున్నవారికోసం, ష్యూరిటీ ఇవ్వాలి అని అనుకుంటున్నవారి కోసం నిపుణులు ఇస్తున్న కొన్ని సలహాలు.



హోమ్ లోన్

బ్యాంకులు హోమ్ లోన్ ఇచ్చేప్పుడు డాక్యుమెంట్లపై కో-సైన్ తీసుకుంటూ ఉంటాయి. హోమ్ లోన్ అనే కాదు చాలావరకు లోన్స్ సమయంలో ష్యూరిటీ సంతకం తప్పనిసరి. అయితే లోన్ తీసుకున్న వ్యక్తి సకాలంలో మొత్తం రుణం చెల్లిస్తే ఏ సమస్యా ఉండదు. కానీ లోన్ చెల్లించకపోతే. ష్యూరిటీ సంతకం పెట్టినవాళ్లు ఇబ్బందులు పడాల్సిందే. అందుకే మీరు ష్యూరిటీ సంతకం పెట్టే కొంచెం ఆలోచించండి.

ష్యూరిటీ

ఒకవేళ లోన్ తీసుకున్న వ్యక్తి రుణం చెల్లించలేకపోతే నిబంధనల ప్రకారం వాయిదాలు కట్టాల్సిన బాధ్యత ష్యూరిటీ ఇచ్చిన వ్యక్తిపై ఉంటుంది. ఒకవేళ ఇద్దరూ లోన్ తిరిగి చెల్లించకపోతే చట్టపంమైన చర్యలు, రికవరీ పద్ధతులు ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రెడిట్ రేటింగ్ కూడా పడిపోతుంది. అందుకే స్నేహితులకో, బంధువులకో కో-సైనర్‌గా సంతకం చేసే ముందు నియమనిబంధనలన్నీ చదువుకోవాలి.

సెక్యూరిటీ కోసం

లోన్ సెక్యూరిటీ కోసం బ్యాంకులు, అప్పులు ఇచ్చే సంస్థలు కొన్ని రుణాలపై కో-సైన్, ష్యూరిటీ సంతకాన్ని తప్పనిసరి చేశాయి. భారీ మొత్తంలో లోన్‌కు దరఖాస్తు చేసిన వ్యక్తికి సరైన క్రెడిట్ హిస్టరీ లేకపోయినా బ్యాంకులు ష్యూరిటీ సంతకం అడుగుతుంటాయి. కో-సైన్ పెట్టేవాళ్ల క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ లాంటివి ఖచ్చితంగా పరిశీలిస్తాయి బ్యాంకులు.

మీరే

హోమ్ లోన్స్, కార్ లోన్స్, ప్రాపర్టీ లోన్స్ లాంటివాటికి అస్సలు కో-సైన్ చేయకూడదు. వాటి వాయిదాలు, టెన్యూర్, వడ్డీ చాలా ఎక్కువ. ఎడ్యుకేషన్, బిజినెస్ లోన్ల విషయంలోనూ ష్యూరిటీ సంతకం పెట్టకపోవడమే మంచిది. ఈ రుణాలు తీసుకునేవాళ్లు మంచి ఉద్యోగంలో చేరిన తర్వాతో, వ్యాపారం పుంజుకున్నప్పుడో రుణాలు తిరిగి చెల్లించగలరు. లేకపోతే మీరే చెల్లించాల్సి వస్తుంది.

క్రెడిట్ స్కోర్

మీ ఆదాయం అస్థిరంగా ఉన్నా, ఆర్థికపరమైన బాధ్యతలు ఎక్కువగా ఉన్నా, మీ క్రెడిట్ స్కోర్ సరిగ్గా లేకపోయినా కో-సైన్ చేయకూడటమే ఉత్తమం. ఇలాంటి పరిస్థితుల్లో ష్యూరిటీ సంతకం పెడితే మీరు మరింత అప్పుల పాలయ్యే అవకాశముంది.

వాయిదాలు

ఇప్పటికే ష్యూరిటీ సంతకం పెట్టినట్లైతే కాస్త అప్రమత్తంగా ఉండాలి. అప్పు తీసుకున్న వ్యక్తిని అప్పుడప్పుడూ కలుస్తూ ఉండండి. లోన్ రీపేమెంట్ ఎంతవరకు వచ్చిందో ఆరా తీయండి. వాయిదాలు చెల్లించనట్లైతే. మీరు ఒత్తిడి తీసుకురండి.

12 నెలలు

అప్పు తీసుకున్న వ్యక్తి తన విశ్వసనీయతను తెలిపేందుకు, క్రెడిట్ స్కోర్ పెంచుకునేందుకు 12 నెలలు చాలు. ఆ తర్వాత కో-సైన్ లేకుండా ఉన్న లోన్‌నే రీఫైనాన్స్ చేయించొచ్చు. లోన్ ఒప్పందం నుంచి కో-సైనర్‌గా తప్పించాలని బ్యాంకును కోరవచ్చు.

తమన్నా ఆ సీన్ చేయనని చెప్పిందా?



బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన క్వీన్ సినిమా పలు దక్షిణాది భాషల్లోకి రీమేక్ అవుతోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా త్వరలో విడుదల కాబోతోంది. తెలుగులో దటీజ్ మహాలక్ష్మి పేరుతో, తమిళంలో ప్యారిస్ ప్యారిస్ పేరుతో రీమేక్ అవుతోంది. తెలుగులో తమన్నా, తమిళంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాల టీజర్లు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అయితే తెలుగు టీజర్ కంటే తమిళ సినిమా టీజర్ మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. దానికి కారణం ఆ టీజర్‌లో కాజల్ నటించిన ఓ సన్నివేశం. కాజల్ నటించిన ఆ సీన్ అసభ్యకరంగా ఉందని విమర్శలు వస్తున్నా సోషల్ మీడియాలో మాత్రం ఆ టీజర్ భారీ వ్యూస్ దక్కించుకుంటోంది. తెలుగు సినిమాలో ఈ సీన్ లేదని తెలుస్తోంది. ఆ సీన్ చేయడానికి తెలుగు సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న తమన్నా ఇష్టపడలేదట. దర్శకుడు ఆ సీన్ పెడదామనుకున్నా తమన్నా అభ్యంతరం వ్యక్తం చేసిందట. ఆ సీన్ వల్గర్‌గా ఉందని, అనవసర వివాదాలు తలెత్తుతాయని చెప్పిందట. దీంతో డైరెక్టర్ ఆ సీన్ షూట్ చేయలేదట.

అవునా.. నాకు పెళ్లా ? : శృతీ హాసన్



విశ్వనటుడు కమల్ హాసన్ వారసురాలిగా సినీ రంగ ప్రవేశం చేసిన శృతీహాసన్ ఆ తర్వాత సొంత గుర్తింపు సంపాదించుకుంది. దక్షిణాదిన టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగు, తమిళ సినీ పరిశ్రమలకు చెందిన చాలా మంది టాప్ హీరోలతో నటించింది. అయితే ఇటీవలి కాలంలో శృతి సినిమాలకు దూరమైంది. కాటమరాయుడు తర్వాత శృతి ఇప్పటివరకు మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. లండన్‌కు చెందిన మైకేల్ కోర్సలేతో శృతి ప్రేమాయణం సాగిస్తోంది. వీరిద్దరూ బహిరంగంగానే కలిసి తిరుగుతున్నారు. మైకేల్‌తో సన్నిహితంగా ఉన్న ఫోటోలను శృతి తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేస్తోంది. అయినప్పటికీ తమ బంధం గురించి శృతి మాట్లాడడం లేదు. ఇటీవల మైకేల్‌తో కలిసి లండన్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలను శృతి లండన్‌లో జరుపుకుంది. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరి పెళ్లి గురించి వార్తలు మళ్లీ మొదలయ్యాయి. ఈ ఏడాదిలోనే వీరి పెళ్లి అంటూ ఓ పత్రిక వార్త రాసింది. ఆ వార్తను రీ ట్వీట్ చేసిన శృతి అవునా.. నాకు పెళ్లా.. నిజంగా ఇది నాకు వార్తే అంటూ కామెంట్ చేసింది.

సాఫ్ట్ టైటిల్‌తో మాస్ హీరో..!

బిగ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. వరుసగా భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్న ఈ యువ కథానాయకుడు భారీ హిట్ మాత్రం అందుకోలేకపోతున్నాడు. బోయపాటి దర్శకత్వంలో తెరకెక్కిన జయ జానకి నాయకకు మంచి టాక్ వచ్చిన హిట్ లిస్ట్‌లో చేరలేకపోయింది. తరువాత చేసిన సాక్ష్యం, కవచం సినిమాలు కూడా ఆశించిన స్థాయిలో అలరించలేకపోయాయి. దీంతో ప్రస్తుతం చేస్తున్న సినిమాకు రూట్ మార్చాడు ఈ యంగ్ హీరో. తేజ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతున్న సినిమాకు సాఫ్ట్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టుగా తెలుస్తోంది. చాలా రోజులుగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు సీత అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను మార్చిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



విశాలాంధ్ర సినిమా

మరోసారి విలన్‌గా భారతిరాజా



హీరో కావాలని ఎన్నో ఆశలతో చెన్నైకి వచ్చిన తాను చివరకు గొప్ప దర్శకుడిగా మారానని అలనాటి దర్శకుడు భారతిరాజా అప్పుడప్పుడూ పత్రికలకు ఇచ్చే ఇంటర్వ్యూలో చెబుతూ ఉంటారు. 2004లో మణిరత్నం దర్శకత్వంలో సూర్య హీరోగా నటించిన 'ఆయుధ ఎళుత్తు' అనే తమిళ చిత్రంలో భారతిరాజా విలన్ పాత్రలో నటించి దర్శకుడిగానేగాక నటుడిగానూ ఏమాత్రం తీసిపోనని రుజువు చేశారు. ఇప్పుడు, దాదాపు పదిహేనేళ్ల తర్వాత 'రాఖీ' అనే కొత్త చిత్రంలో భారతిరాజా మరోసారి విలన్ రోల్ చేస్తున్నారు. ఇందులోనూ ఆయన తనదైన శైలిలో విలనీజం పండించబోతున్నారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. 'తరమణి' సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన వసంత్ రవి ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఆర్‌ఏ స్టూడియో బ్యానర్‌పైన మాదేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి శివ సంగీతం సమకూరుస్తున్నారు.

మహేష్‌కు జోడిగా కత్రినా!



టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్ బాబు తరువాతి చిత్రంలో బాలీవుడ్ స్టార్ కత్రినా కైఫ్‌ను తీసుకునే ఆలోచనలో ఉన్నారట. మహేష్ ప్రస్తుతం మహర్షి సినిమాతో బిజీగా ఉన్నాడు. ఇటీవలె హాలిడే ట్రిప్‌ను ముగించుకున్న మహేష్ త్వరలోనే ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ కానున్నాడు. మహర్షి తరువాత సుకుమార్ డైరెక్షన్‌లో మహేష్ ఓ మూవీ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మైత్రి మూవీస్ నిర్మించనుంది. ఈ మూవీలో మహేష్ సరసన కత్రినాను నటింపజేయాలని మేకర్స్ ఆలోచించి.. కత్రినాను సంప్రాదించారట. కత్రినా కూడా దాదాపు ఓకే చెప్పేసినట్టు సమాచారం. ఇదే గనుక నిజమైతే.. ఈ చిత్రం బాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించినట్టే. సినిమా బిజినెస్ పరంగా కూడా కలిసి వస్తుందని నిర్మాతలు కత్రినాకే ఓటేసినట్టు తెలుస్తోంది. అయితే మహేష్ ఇప్పటికే బిపాస బసు, అమృతరావు, ప్రీతిజింతా లాంటి బాలీవుడ్ భామలతో ఆడిపాడారు. సుకుమార్-మహేష్ కాంబోలో రాబోతోన్న ఈ మూవీలో కత్రినా నటించనుందనే వార్తలు వినిపిస్తున్నా..వీటిపై చిత్రయూనిట్ మాత్రం స్పందించడం లేదు.



'ఆర్‌ఆర్‌ఆర్' పీరియడ్ డ్రామానే..!



బాహుబలి లాంటి భారీ చిత్రం తరువాత దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా ఆర్‌ఆర్‌ఆర్ (వర్కింగ్ టైటిల్). టాలీవుడ్ టాప్ హీరోలు రామ్ చరణ్, ఎన్టీఆర్‌లు కలిసి నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రాజమౌళితో పాటు ఇతర చిత్రయూనిట్ అంతా సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్స్ బైటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే ఈ సినిమా ఎనౌన్స్ అయిన దగ్గర నుంచి మూవీ పీరియాడిక్ డ్రామా అన్న టాక్ వినిపిస్తోంది. ఈ విషయంపై చిత్రయూనిట్ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే తాజాగా యన్.టి.ఆర్ ప్రమోషన్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సంగీత దర్శకుడు కీరవాణి, ఆర్‌ఆర్‌ఆర్ స్టోరిపై హింట్ ఇచ్చారు. ఈ సినిమా పని తాను మార్చిలో ప్రారంభిస్తానన్న కీరవాణి, ఈ సినిమాలో తన మ్యూజిక్ పీరియడిక్, ట్రెండీల ఫ్యూజన్‌ల ఉండబోతుందన్నారు. దీంతో సినిమా కూడా పీరియాడిక్ జానర్‌లోనే తెరకెక్కుతుందన్న టాక్‌కు మరింత బలం చేకూరినట్టైంది. మరి ఇప్పటికైన చిత్రయూనిట్ స్పందిస్తారేమో చూడాలి.

జపాన్‌లోనూ విశ్వాసం

తమిళ స్టార్ హీరోల్లో అజిత్ కూడా ఒకరు. రజనీకాంత్‌లా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు అజిత్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వాసం'. అజిత్ కెరీర్‌లో 58వ చిత్రంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శివ దర్శకత్వంలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. నయనతార కథానాయిక. జగపతి బాబు స్టైలిష్ విలన్ పాత్రలో నటించారు. ఈ సినిమా సంక్రాంతికి విడుదల కానుంది. అంతే కాదు.. ఈ చిత్రాన్ని జపాన్‌లో కూడా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జపాన్‌కు చెందిన స్పేస్‌పార్క్ అనే సంస్థ ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చే స్తోంది. కాగా, రజనీకాంత్ 'పేట' సినిమా కూడా చైనా, జపాన్ వంటి దేశాల్లోనూ ఈ సంక్రాంతికి విడుదలవుతుండటం విశేషం.

అర్జున్ రెడ్డి దర్శకుడితో ఎన్టీఆర్..!

ఒక్క సినిమాతోనే క్రేజీ డైరెక్టర్‌గా మారిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. తొలి సినిమా అర్జున్ రెడ్డితోనే సందీప్ అందరి దృష్టిని ఆకర్షించాడు. విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన అర్జున్ రెడ్డి సంచలన విజయం సాధించటంతో పాటు సినీ ప్రముఖులు స్టార్ హీరోల ప్రశంసలు సాధించింది. దీంతో సందీప్‌తో సినిమాలు చేసేందుకు హీరోలు దర్శకులు క్యూ కట్టారు. ప్రస్తుతం అర్జున్ రెడ్డి సినిమాను కబీర్ ఖాన్ పేరుతో బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్న సందీప్, ఇంత వరకు తెలుగు సినిమాను ప్రకటించలేదు. కొద్ది రోజులుగా మహేష్ బాబు హీరోగా సందీప్ సినిమా ఉంటుదన్న టాక్ గట్టిగా వినిపించింది. అయితే తాజా సమాచారం ప్రకారం సందీప్.. ఎన్టీఆర్ హీరోగా ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నాడట. ఇప్పటికే ఎన్టీఆర్‌కు కథ కూడా వినిపించాడన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎన్టీఆర్.. రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆర్‌ఆర్‌ఆర్ (వర్కింగ్ టైటిల్)లో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయిన తరువాత సందీప్ సినిమా ఉండే చాన్స్ ఉంది.





ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం

కేంద్రంపై అహ్మద్‌పటేల్ ఫైర్



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)లను కొద్దిమంది ప్రైవేటు వ్యక్తులపరం చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్‌పటేల్, మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ (హెచ్ఏఎల్) ఉద్యోగులకు జీతాలు సైతం ఇవ్వలేని స్థితిలో రూ.1000 కోట్ల అప్పుతీసుకుందన్నారు. ఈ విషయాన్ని మీడియా నివేదిక తెలిపిందని ఆయన ట్వీట్ చేశారు. ఇవే కాకుండా, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్లను (ఎల్ఐసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్లు కూడా స్నేహితులకు కట్టబెట్టేందుకు మోడీ సిద్ధంగా ఉన్నారని పటేల్ విమర్శించారు. హాల్‌కు రాఫెల్ యుద్ధవిమానాల తయారీని అప్పగించకుండా అనిల్ అంబానీకి అప్పగించడంపై కాంగ్రెస్ ఇప్పటికే అనేక విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.

మాజీ సీఎం షీలా దీక్షిత్‌కు కీలక పదవి..!



న్యూఢిల్లీ : ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ ఆ పార్టీ సీనియర్ నేత అజయ్ మాకెన్ అనూహ్య నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మాకెన్ స్థానంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ పార్టీ పగ్గాలను చేపట్టనున్నట్లు తెలిసింది. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న వారిలో ఆమె ముందున్నట్లు తెలిసింది. పార్టీ తనకు అప్పగించిన ఎలాంటి బాధ్యతనైనా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. ఢిల్లీలో 2015లో ఆప్ ప్రభుత్వం ఏర్పడటానికి ముందు వరుసగా మూడు పర్యాయాలు ఆమె నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆమె వయసు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఒకరిద్దరిని తాత్కాలిక అధ్యక్షులను నియమించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఏఐసీసీ సెక్రటరీ దేవేంద్ర యాదవ్, హరూన్ యాదవ్, రాజ్‌కుమార్ చౌహాన్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. అధ్యక్ష పదవిపై కొద్దిరోజుల్లో ప్రకటన వెలువడనుందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి.



నా ప్రశ్నలకు
బదులేది?

మోడీ, మంత్రులను నిలదీయాలని రాహుల్ పిలుపు

న్యూఢిల్లీ : రాఫెల్ కుంభకోణానికి సంబంధించి మోడీ ప్రభుత్వంపై తన విమర్శల దాడిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ముమ్మరం చేశారు. ఫ్రాన్స్‌తో యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై పార్లమెంటులో మోడీ ప్రభుత్వాన్ని తాను నిలదీశానని, అనేక ప్రశ్నలు సంధించానని, ఇవే ప్రశ్నలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆయన మంత్రులను నిలదీయాలని దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. 'రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో రెండు గంటలు మాట్లాడారు. కానీ నేను అడిగిన అతి సాధారణ ప్రశ్నలు రెండింటికి ఆమె సమాధానం చెప్పలేదు' అని రాహుల్ శనివారం ట్విట్టర్ వేదికగా విమర్శించారు. పార్లమెంటులో రక్షణమంత్రికి తాను సంధించిన రెండు ప్రశ్నల వీడియోను రాహుల్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అనిల్ అంబానీకి రాఫెల్ ఒప్పందంలో భాగస్వామిగా ఎవరు నియమించారు? ఈ ఒప్పందానికి సంబంధించి ప్రధాని అనుసరిస్తున్న విధానంపై రక్షణమంత్రిత్వశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తంచేశారా? లేదా? అని రాహుల్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇవే ప్రశ్నలను నిర్మలా సీతారామన్‌ను అడుగుతున్నానని, దీనికి సమాధానం అవును లేదా కాదు అని చెబితే చాలని అన్నారు. ఈ ప్రశ్నలను ప్రధాని, రక్షణమంత్రిని ప్రతి భారతీయుడూ అడగాలి' అని రాహుల్ ట్వీట్ చేశారు. రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని నిర్మలా సీతారామన్ నిన్న ఎదురుదాడి చేశారు. బోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ పతనానికి దారితీస్తే రాఫెల్ ఒప్పందం మోడీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి దోహదపడుతుందని విశ్వాసంతో చెప్పారు.

పొత్తు పొడిచింది

- యూపీలో ఎస్పీ, బీఎస్పీ కూటమి
- అఖిలేష్, మాయావతి మధ్య చర్చలు సఫలం
- నెలాఖరులోగా వెలువడనున్న అధికారిక ప్రకటన
- ఆర్‌జేడీ, ఇతర పార్టీలను చేర్చుకోవాలని నిర్ణయం



లక్నో (ఉత్తరప్రదేశ్) : లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలోనే అత్యధిక పార్లమెంట్ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో విపక్షాల మధ్య పొత్తు పొడిచింది. ఉత్తరప్రదేశ్ కేంద్రంగా ఏర్పాటైన సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూటమిగా ఏర్పడ్డాయి. గతేడాది జరిగిన మూడు పార్లమెంట్ స్థానాల ఉప ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా బీజేపీయేతర పక్షాలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయి. అదేరీతిలో రానున్న ఎన్నికల్లోనూ బీజేపీని గద్దె దించేందుకు ఇద్దరు మాజీ ముఖ్యమంత్రుల నేతృత్వంలోని ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు కుదిరింది.
ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు రెండు పార్టీల అధినేతలు అఖిలేష్ యాదవ్, మాయావతి సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఈ నెలాఖరున వెలువడే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి న్యూఢిల్లీలో సమావేశమై పొత్తులపై చర్చించారు. రాష్ట్రంలో మొత్తం 80 పార్లమెంట్ స్థానాలుండగా, రెండింటిలో మినహా మిగిలిన అన్ని స్థానాల్లో కూటమి పోటీ చేయాలనే నిర్ణయానికి వారిద్దరూ వచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కూటమిలో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ)తోపాటు ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలిగిన ఇతర చిన్న పార్టీలను చేర్చుకోవాలని నిర్ణయించారు. ఇతర బీజేపీయేతర పక్షాలతోనూ చర్చించి నెలాఖరున కూటమిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఎస్పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి శనివారం వెల్లడించారు. అఖిలేష్ యాదవ్, మాయావతి న్యూఢిల్లీలో శుక్రవారం సమావేశమై కూటమి ఏర్పాటు, పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చించారన్నారు. కూటమి ఏర్పాటు విషయంలో వారిద్దరి మధ్య సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందన్నారు. కూటమిలో చేరనున్న ఆర్ఎల్‌డీకి పశ్చిమ యూపీలో బలం ఉన్నట్లు చెప్పారు. గతేడాది కైరానా లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లో ఆర్ఎల్‌డీ అభ్యర్థి తబస్సుం హసన్ ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ మద్దతులో విజయం సాధించినట్లు తెలిపారు. అలాగే గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ ఉప ఎన్నికల్లోనూ విపక్ష అభ్యర్థులే విజయం సాధించినట్లు చెప్పారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ 71, ఎస్పీ ఐదు, అప్నాదళ్ రెండు, కాంగ్రెస్ రెండుస్థానాల్లో గెలుపొందిందన్నారు. అయితే ఉప ఎన్నికల్లో బీజేపీకి చెందిన మూడు స్థానాలను విపక్షాలను కైవసం చేసుకున్నాయన్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో బీజేపీయేతర పార్టీలతో రాష్ట్రంలో కూటమి ఏర్పాటు చేసేందుకు అఖిలేష్ యాదవ్, మాయావతి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కూటమిలో కాంగ్రెస్ చేరికపై ఎస్పీ, బీఎస్పీ నేతలే నిర్ణయం తీసుకుంటారన్నారు. కాగా, రాష్ట్రంలోని 80 స్థానాల్లో అమేథి, రాయ్‌బరేలి స్థానాలను మినహాయించి మిగిలిన సీట్లకు కూటమి పోటీ చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

రాజ్యసభలో మానవ అక్రమ రవాణా బిల్లు

బాధితుల వేడుకోలు



న్యూఢిల్లీ : ప్రస్తుత సమావేశాల్లోనే మానవ అక్రమ రవాణా బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టాలని బాధితులు ప్రధాని మోడీకి లేఖ రాశారు. లోక్‌సభలో ఇప్పటికే ఈ బిల్లు పాస్ కావడంతో శీతాకాల సమావేశాల్లోనే రాజ్యసభలో దీన్ని పాస్ చేయాలని వారు కోరుతున్నారు. చీకటి జీవితాల్లో వెలుగుల కోసం నిరీక్షిస్తున్నామని నివేదించారు. బలవంతపు వెట్టిచాకిరి, వ్యభిచార కూపాలు, భిక్షాటన నుంచి గౌరవప్రదమైన ఉద్యోగాలలోకి మారాలనుకుంటున్నామని, ఈ విష వలయం నుంచి బయటపడాలని ఎందరో ఎదురుచూస్తున్నారని పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్ , ఉత్తరప్రదేశ్, హర్యానా బాధితులు మోడీని కోరారు. మానవ అక్రమ రవాణాను నిరోధించి, దేశపౌరులుగా జీవించడానికి అవకాశం ఇవ్వాలని మానవ అక్రమరవాణా నిరోధక స్వచ్ఛందసేవల ఆధ్వర్యంలో వారు ప్రధానికి విజ్ఞప్తి చేశారు. 'ట్రాఫికింగ్ ఆఫ్ పర్సన్స్ (అక్రమరవాణా నిరోధక, రక్షణ, పునరావాస) బిల్లు 2018' ద్వారా ఫాస్టు ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి,ఏడాదిలో విదేశీయుల కేసులను కూడా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. నేపాల్, శ్రీలంక నుంచి కూడా బాలికల, మహిళా అక్రమ రవాణా జరుగుతోంది. నేషనల్ యాంటీ ట్రాఫికింగ్ బ్యూరో (ఎన్ఏటీబీ) ఏర్పాటు ద్వారా అంతర్జాతీయ సంస్థలతో కలసి విదేశీ, సరిహద్దుల్లో జరిగే అక్రమరవాణా సాక్ష్యా ధారాలు సేకరించి, త్వరితగతిని కేసులు పరిష్కరించేందుకు వీలవుతుంది. అక్రమ రవాణా బాధితులు గతనెల్లో కొంతమంది ఎంపీలతో కలసివెళ్లి ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడును కలసి శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును పాస్ చేయాల్సిందిగా కోరారు. జాతీయ నేర నమోదు గణాంకాల (ఎన్‌సీఆర్బీ) ప్రకారం 2016లో 15,379 మంది బాధితులు నమోదు అయి ఉండగా, వారిలో 60 శాతం మంది మైనర్లు. లక్షమంది పైగా బాలికలు అక్రమరవాణాకు గురయ్యారని నివేదిక అంచనా వేసింది. అదే ఏడాది 55,625 గల్లంతైన వారి ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాకపోవడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

చాపర్ కేసులో ఫిబ్రవరి 27వరకు
మైఖేల్‌కు జ్యుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ చాపర్ కేసులో మధ్యవర్తిత్వం నెరపిన క్రిస్టియన్ మైఖేల్‌ను శనివారం ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ఆయనపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసి ప్రత్యేక జడ్జి అరవిందకుమార్ వద్ద ప్రవేశపెట్టి, జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరింది. దీంతో ఫిబ్రవరి 26 వరకు సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీ ఉండగా, ఫిబ్రవరి 27 వరకు ఆ కస్టడీని పొడిగించింది. డిసెంబరు 22న దుబాయ్‌లో ఆయనను ఈడీ అధికారులు అరెస్టు చేసి భారత్‌కు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో కోర్టు 7 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సీబీఐ కేసులో ఆయనను తీహార్ జైలుకు తరలించారు. దర్యాప్తు పురోగతి సాధిస్తోందని ఈడీ, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీసింగ్ , ఎన్‌కే మట్టా కోర్టుకు తెలిపారు. అనేక బ్యాంకుల్లోని నగదు హవాలా ద్వారా విదేశాలకు చేరాయన్నారు. ఇతర రక్షణ ఒప్పందాలను కూడా పరిశీలించి, ఇటలీకోర్టులో దాఖలు చేసేందుకు పత్రాలను సేకరించామని అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో ఆయన మిసెస్ గాంధీ పేరు, దేశానికి కాబోయే ప్రధానిగా పేరున్న ఆమె కుమారుడి పేరుకూడా వెల్లడించారన్నారు. వారి సంభాషణల్లో ఆర్‌గా పేర్కొన్న పెద్దమనిషి పేరు రాబట్టాలని చూస్తున్నామని దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది. మైఖేల్‌కు వైద్య పరీక్షలు జరుగుతుండగా అతని లాయర్లు అల్‌జో కే జోసెఫ్‌కు ఈడీ నోటీసులు అందించిందన్నారు. మిసెస్ గాంధీకి సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని, అందువల్ల జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని వారు కోర్టును కోరారు. ఆయనతోపాటు గైడో హాస్చ్, కార్లో జెరోసాలపై కూడా సీబీఐ కేసులు నమోదు చేసింది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కొనుగోలులో మైఖేల్ మధ్యవర్తిగా ఉండి అవినీతికి పాల్పడ్డారని సీబీఐ పేర్కొంది.

ఎంపీ స్పీకర్ ఎన్నికపై ఉత్కంఠ

- ఆచితూచి వ్యవహరిస్తున్న కమల్‌నాథ్ సర్కార్
- అభ్యర్థిత్వంపై నిర్ణయించని ప్రతిపక్ష బీజేపీ



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో తొలిసారిగా జరగనున్న విధానసభ సమావేశాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అదే సమయంలో స్పీకర్ ఎన్నిక కూడా కీలకంగా మారింది. ఈనెల 7 నుంచి సభ ప్రారంభం కానుంది. కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారాలతో పాటు స్పీకర్ ఎన్నికకు కమల్‌నాథ్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే, స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వడం మధ్యప్రదేశ్ విధానసభ ఆనవాయితీ. ఈసారి ఎన్నికలు జరిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలావుండగా, ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీ ఇప్పటివరకు స్పీకర్ అభ్యర్థిత్వంపై ఏ నిర్ణయం తీసుకోలేదు. తమ అభ్యర్థిని పోటీలో నిలబెట్టాలని బీజేపీ నిర్ణయిస్తే గనుక ఎన్నికలు తప్పవు. ఆపై జరిగే పరిణామాలు బలపరీక్షకు దారితీయవచ్చు. ఓడిపోతే తమ ప్రభుత్వమే కూలిపోయే ప్రమాదం ఉండటంతో స్పీకర్ ఎన్నిక విషయంలో కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. 230 మంది సభ్యులున్న విధానసభలో కాంగ్రెస్‌కు 114 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీ కోసం మరో 116 మంది మద్దతు కాంగ్రెస్‌కు అవసరం. ముగ్గురు స్వతంత్రులు సహా ఇద్దరు బీఎస్పీ, ఓ ఎస్పీ శాసనసభ్యుల మద్దతు కూడా కాంగ్రెస్‌కు ఉంది. అయితే, వారు తమ మద్దతును ఉపసంహరించుకోకుండా కాంగ్రెస్ చూసుకోవాలి. విధానసభ తొలిసమావేశం బీజేపీకీ కీలకమైనదే. ఈ క్రమంలో సభలో బీజేపీకి నేతృత్వం వహించేది ఎవరన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా ఉంది. సభలో ప్రతిపక్ష నాయకుడి పదవికి పార్టీ అధిష్ఠానం చాలా ప్రాధాన్యతనిస్తోంది. ఈ క్రమంలో అర్హుడైన వ్యక్తిని ఎంపిక చేసే బాధ్యతను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కట్టబెట్టింది. మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా ఈ పోటీ ఉండగా, మరో ముఖ్య అభ్యర్థిగా మాజీ మంత్రి నరోత్తమ్ మిశ్రా ఉన్నారు. రెండ్రోజుల కింద ఢిల్లీ వెళ్లిన చౌహాన్ పార్టీ ముఖ్యనేతలను కలిశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా నాడిని తెలుసుకునేందుకు ప్రయత్నించారని మీడియాలో వార్తలొచ్చాయి. అయితే, ఢిల్లీ నుంచి తిరిగివచ్చిన చౌహాన్ తాను శాసనసభ నాయకుడి రేసులో లేనని స్పష్టంచేశారు. తన పేరును ప్రస్తావించమని కోరలేదని చెప్పారు. 13ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఇకపై సామాన్య కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని, ఎలాంటి పదవులను ఆశించబోనని చౌహాన్ తెలిపారు. ఏదిఏమైనా మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ ఎవర్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మహిళా రీసెర్చర్లు పెరగాలి..



నారాయణమూర్తి

బెంగళూరు : శాస్త్రీయ రంగంలో మహిళా పరిశోధకుల ప్రాతినిధ్యం పెరిగితే పరిశోధనల్లో నాణ్యత మరింత పెరుగుతుందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి అభిప్రాయపడ్డారు. క్లారివేట్ అనాలటిక్స్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం ప్రపంచంలోనే 4వేల మంది అత్యున్నత పరిశోధకుల (హెచ్ఆర్‌సీ)లో 10 మంది భారతీయులు ఉండగా, వారిలో ఒకేఒక్క మహిళ ఉన్నారు. అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. మహిళల ప్రాతినిధ్యం పెరిగితే భారతీయ పరిశోధనల్లో నాణ్యత పెరుగుతుందా అన్న ప్రశ్నకు 'కచ్చితంగా... ఇందులో ఎలాంటి సందేహం లేదు' అంటూ మూర్తి సమాధానమిచ్చారు. మూర్తి పీటీఐతో మాట్లాడుతూ ఏదేని యూనివర్సిటీ లేదా ఐఐటీల్లో స్నాతకోత్సవాలకు వెళ్లినప్పుడు స్వర్ణపతకాలు సాధించే వారిలో విద్యార్థినులే అధికంగా ఉండటాన్ని తాను గమనించినట్టు తెలిపారు. వివాహం, పిల్లలు కలిగిన తర్వాత కూడా మహిళా పరిశోధకులు తమ వృత్తిని కొనసాగించేందుకు అనువైన వాతావరణం అవసరమని, ఇందుకోసం సమాజంలో మార్పు రావాలని మూర్తి అన్నారు. 'అర్హులైన, ప్రతిభా వంతులైన మహిళా పరిశోధ కులను ప్రోత్సహించాలి. దేశజనాభాలో సగభాగమైన మహిళలలో ప్రతిభకు కొదవలేదు. అండర్‌గ్రాడ్యుయేట్, మాస్టర్స్ స్థాయిలో పురుషులతో ఏ మాత్రం తీసిపోకుండా మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారు' అని ఆయనన్నారు. బెంగళూరులో ఇన్ఫోసిస్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా మూర్తి మీడియాతో మాట్లాడారు. ప్రతిఏటా ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ద్వారా ప్రతిభగల శాస్త్రవేత్తలు, పరిశోధ కులు, ఇంజినీర్లు, సామాజిక శాస్త్రవేత్తలను ఈ అవార్డుతో సన్మానిస్తారు. అవార్డు రూపేణ స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం, లక్ష డాలర్ల నగదు పురస్కారాన్ని వారికి అందజేస్తారు.

స్వయం సహాయ బృందాలకు వడ్డీలేని రుణాలు

పూరి : స్వయం సహాయక మహిళా బృందాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తామని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ శనివారం వెల్లడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 50 వేల మంది మహిళలు పాల్గొన్న మిషన్ శక్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. దీంతో రాష్ట్రంలోని 70 లక్షల మంది మహిళలు ప్రయోజనం పొందుతారన్నారు.మహిళాసాధికారతలో భాగంగా 6లక్షల స్వయం సహాయక బృందాల్లోని ఒక్కొక్కరికీ రూ.3వేలను పంపిణీ చేశారు. లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు అందిస్తానని గతేడాది నవంబరులో మేక్ ఇన్ ఒడిశా సభలో పట్నాయక్ వెల్లడించిన విషయం తెలిసిందే.

ఇసుక అక్రమ తవ్వకాలపై తనిఖీలు

న్యూఢిల్లీ : ఇసుక అక్రమ తవ్వకాలపై ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని 12 ప్రాంతాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తనిఖీలు నిర్వహించింది. ఇందులో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారి బి.చంద్రకళ ఇంటిలో కూడా తనిఖీలు నిర్వ హించారు. అవినీతిపై ప్రచారం ద్వారా ఆమె సోషల్ మీడియాలో గుర్తింపు పొందారు.అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు జలౌన్, హమీర్‌పూర్, లక్నో, ఢిల్లీల్లో సీబీఐ ఈ తనిఖీలు నిర్వహించింది.

లోయలో పడిన బస్సు

డ్రైవర్‌తోసహా, ఆరుగురు విద్యార్థులు దుర్మరణం



సిమ్లా : హిమాచల్‌ప్రదేశ్‌లో స్కూలు బస్సు లోయలో పడిన దుర్ఘటనలో డ్రైవర్‌తో సహా ఆరుగురు విద్యార్థులు దుర్మరణం చెందారు. సిర్‌మావు జిల్లాలో ఈ ఘటన జరిగిందని, మరో 12 మంది విద్యార్థులకు గాయాలయ్యాయని ఎస్పీ రోహిత్ మాల్పని వెల్లడించారు. మృతి చెందినవారిని సమీర్ (5), ఆదర్శ్ (7), కార్తీక్ (14), డ్రైవర్ రాంస్వరూప్ (40)లుగా గుర్తించారు. అభిషేక్, అతని సోదరి సంజన, నైతిక్ చౌహాన్‌లు నహాన్ మెడికల్ కాలేజీలో చికిత్సపొందుతూ మృతి చెందారన్నారు. గాయాలైన వారిలో సంధ్య, రక్షిత, అంజలి, రాజీవ్, అయుష్, వైష్ణవి, ధృవ్, మన్నత్, ఆరుషి, సుందర్‌సింగ్ ఉన్నారని పోలీసులు వెల్లడించారు. దీనిపై 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్ రాజేష్ సిరిమావు డిప్యూటీ కమిషనర్ లలిత్ జైన్‌ను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.20 వేలు, గాయపడినవారికి రూ.10 వేలు అందించాలని కూడా కోరారు.

పారికర్‌కు రక్షణ పెంచండి

రాష్ట్రపతికి పీసీసీ లేఖ

పనాజీ : గోవా సీఎం మనోహర్ పారికర్‌కు భద్రతను మరింత పెంచాలని గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కోరింది. ఈ మేరకు రాష్ట్రపతికి పీసీసీ అధ్యక్షుడు గిరీష్ చోదంకర్ శనివారం లేఖ రాశారు. రాఫెల్ ఒప్పందం వివరాలు బయటకు వస్తే అందులో అవినీతి జరిగిందని ప్రజలకు తెలుస్తుందన్నారు. వివరాలు బయటకు రాకూడదని కోరుకునే వాళ్లే పారికర్‌కు హాని తలపెట్టే ప్రమాదం ఉందని, తక్షణమే సీఎంకు రక్షణ కల్పించాలని ఆయన లేఖలో పేర్కొన్నారు. రాఫెల్ ఒప్పందపత్రాలు తన పడక గదిలో ఉన్నాయని పారికర్ చెప్పారన్న మంత్రి విశ్వజిత్ రాణె ఆడియో టేప్‌ను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా అదంతా కల్పిత ఆడియో టేప్ అని పారికర్ ఖండించారు. ఈ విషయంపై బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య దుమారం రేగింది. ఈ నేపథ్యంలో గోవా పీసీసీ అధ్యక్షుడు రాష్ట్రపతికి రాసిన లేఖ సారాంశం చర్చనీయాంశమైంది.

కర్ణాటకలో విషాదం

ఒకే కుటుంబంలో ఆరుగురు ఆత్మహత్య

కొప్పాల్ : ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన కర్ణాటకలోని కొప్పాల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. భర్త, భార్య, వారి నలుగురు కూతుళ్లు తమ ఇంట్లో చనిపోయి కనిపించారు. కుటుంబమంతా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని స్థానిక పోలీసులు వెల్లడించారు. మృతులు శేఖరయ్య బీద్నల్ (42), జయమ్మ (39), బసమ్మ (23), గౌరమ్మ (20), సావిత్రి (18), పార్వతి (16)గా గుర్తించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలైనట్లు పోలీసులు తెలిపారు. శేఖరయ్య ముందుగా తన భార్య, నలుగురు కుమార్తెలకు విషం ఇచ్చి తర్వాత అతడు ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పంటలు పండకపోవడం వల్ల బ్యాంకు రుణాలతో ఈ కుటుంబం ఇబ్బందులు పడుతోందని ఇరుగు పొరుగు వారు పోలీసులకు తెలిపారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణమాఫీ పేరుతో మోసం

రైతులను తప్పుదారి పట్టిస్తున్నారు
మోడీ ఎదురుదాడి



దాల్టన్‌గంజ్(జార్ఖండ్) : రుణమాఫీ పేరుతో కొంతమంది దేశంలోని రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని, మోసగిస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ ఆరోపించారు. రుణాలు తీసుకోవాలని గతంలో రైతులను రెచ్చగొట్టారని, ఇప్పుడు దానిపై రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ మిత్రపక్షాలను పరోక్షంగా తప్పుబట్టారు. గతంలో అధికారం వెలగబెట్టిన నాయకులు నార్త్ కోయల్ ప్రాజెక్టును నిర్మించి ఉంటే ఈ ప్రాంత రైతులు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితే ఉండేది కాదని ఆరోపించారు. జార్ఖండ్‌లోని పాలమూ జిల్లాలో మండల్ డ్యామ్ ప్రాజెక్టుగా పిలిచే నార్త్ కోయల్ రిజర్వాయరుకు మోడీ శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పాలమూలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపై విరుచుకుపడ్డారు. రుణమాఫీ పేరుతో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి రావడం, మహారాష్ట్రలో దానిని ఫడ్నవిస్ ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలియనట్టు మోడీ ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోశారు. నార్త్‌కోయల్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఉంటూ ఈ ప్రాంత రైతులు రుణాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండేది కాదని, దారిద్ర్యంలోకి నెట్టబడే వారు కాదని సూక్తులు వల్లించారు. నార్త్ కోయల్ వంటి నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయకుండా గత పాలకులు రైతులకు అన్యాయం చేశారని నిందించారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రైతు ప్రయోజనాలు, పటిష్ఠత కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోడీ చెప్పుకొచ్చారు. తాము చేపట్టిన చాలా ప్రాజెక్టులు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. దేశంలో పలు ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 90 వేల కోట్లు లేదా లక్ష కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం ఖర్చు చేస్తోందని చెప్పారు. దీనిని రాజకీయం చేయాలనుకుంటే ఈ డబ్బంతా రైతులకే ఇచ్చినట్టు తాను చెప్పుకోవాలని అన్నారు. అయితే అది తన ఉద్దేశం కాదని, రైతుల కోసం నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, రైతులకు లబ్ధి చేకూరడమే తన ఆకాంక్ష అని మొసలికన్నీరు కార్చారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన ద్వారా 2022 నాటికి దేశంలోని 1.25 కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకున్నదని గుర్తు చేశారు. పాలమూ జిల్లాలోని 25 వేలమంది పేదలకు పీఎం ఆవాజ్ యోజన ఇళ్లు పంపిణీ చేశామన్నారు. ఇలాంటి సంక్షేమ ప్రాజెక్టులకు గతంలో దళారులు ఉండేవారని, అయితే, ఆ వ్యవస్థను పూర్తిగా తొలగించి...లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు అందేలా చర్యలు తీసుకున్నామని ప్రధాని చెప్పారు. గతంలో ఇంటి నిర్మాణానికి 18 నెలల సమయం పట్టేదని, ఇప్పుడు 12 మాసాలకే ఇంటి నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గృహనిర్మాణం ప్రాజెక్టు సత్వరమే పూర్తికావడానికి బీహారు, జార్ఖండ్ ముఖ్యమంత్రులు నితీష్‌కుమార్, రఘువర్ దాస్ ఐక్యంగా కృషి చేశారని అంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఇరిగేషన్ డ్యామ్ ద్వారా దేశంలో దేశ ఫెడరలిజాన్ని ఈ రెండు ప్రభుత్వాలు పటిష్టమంతం చేశాయని మోడీ అన్నారు. నార్త్ కోయల్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల జార్ఖండ్‌లోని పాలమూ, గర్వా జిల్లాలు, బీహారులోని ఔరంగాబాద్, గయ జిల్లాల రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన ఫైలను 1972లో తయారు చేశారని, అప్పుడు రూ.30 కోట్లతో డ్యామ్ పూర్తయ్యేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు వ్యయం రూ.2,400 కోట్లకు పెరిగిందని అన్నారు. ఈ భారమంతా దేశ ప్రజలపై పడిందన్నారు.

ఒడిశాపై మోడీ కన్ను

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని నరేంద్రమోడీకి ఒడిశాపై కన్ను పడింది. రూ.4,500 కోట్ల విలువైన పలు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల పేరుతో 15 రోజుల్లోనే మోడీ రెండుసార్లు ఒడిశాకు వచ్చారు. డిసెంబరు 24న భువనేశ్వర్‌లో కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించిన మోడీ...ఖుర్దా పట్టణంలో జరిగిన బీజేపీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టులను ఒడిశా ప్రజలకు నూతన సంవత్సర కానుకగా మోడీ అభివర్ణించారు. 2019 ఆ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళుతుందని అన్నారు. జాతీయ రహదారులు, రవాణా, పెట్రోలియం, ఖనిజవాయువు, రైల్వే, సంస్కృతి, పర్యాటకం, పాస్‌పోర్టు సర్వీసులకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రధాని ప్రారంభించారు.

తగ్గిన కర్నూలు సోనా దిగుబడి



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో కర్నూలు సోనా బియ్యానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వీటిని కర్నూలు జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారు కూడా ఇష్టంగా కొనుగోలు చేస్తారు. ఈ బియ్యంతో వండిన అన్నం రుచితోపాటు, చూసేందుకు ఆకర్షణగా ఉంటుంది. చాలా మంది కర్నూలుకు వచ్చినపుడు కర్నూలు సోనాను కొనుగోలు చేసి తీసుకుపోవడం ఆనవాయితీ. ఇటువంటి కర్నూలు సోనా నేడు కనుమరుగైన పరిస్థితి ఏర్పడింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో సోనా మసూరీ బియ్యం దిగుబడి తగ్గిపోయింది. కర్నూలు సోనాను 5204 బీపీటీ అని కూడా అంటారు. కర్నూలు సోనాను నంద్యాల, బండిఆత్మకూరు, నంది కొట్కూరు, ఆళ్ళగడ్డ,వెలుగోడు ప్రాంతాలలో కర్నూలు- కడప కెనాల్ కింద లక్షా 70వేల ఎకరాలు విస్తారంగా పండిస్తారు. ఏడాదికి ఏడాదికి వర్షాభావ పరిస్థిలు పెరగడం కేసీకి నీటి రావడం తగ్గడంతో సోనామసూరీని పండించడం సగానికి పైగా తగ్గిపోయింది. జిల్లాలో 60వేల ఎకరాలు మాత్రమే సోనా పండిస్తున్నారు. 10 ఏళ్ల వరకు కర్నూలు సోనా విస్తారంగా పండించడంతో పెద్దఎత్తున ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేసేవారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కెనాల్‌లకు సకాలంలో నీరు రాకపోవడంతో సోనా మసూరా బియ్యం దిగుబడి తగ్గుముఖం పట్టింది. సకాలంలో నీరు అందక, తెగుళ్ళ కారణంగా 2.54 మెట్రిక్ టన్నుల నుంచి1.54 మెట్రిక్ టన్నులకు దిగుబడి పడిపోయింది. వ్యవసాయ అధికారులు సరైన చర్యలు తీసుకోకుంటే రాబోయే రోజుల్లో కర్నూలు సోనాను జ్ఞాపకాలుగా చెప్పుకోవలసి వస్తుంది.

రేపు ఆలయాల కేశఖండన కార్మికుల ధర్నా



విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో కేశఖండన విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఈనెల 7న ధర్నా నిర్వహించనున్నారు. వారిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలను ఇవ్వాలని డిమాండు చేస్తూ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ నాయీబ్రాహ్మణ కేశఖండన కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యాన ఈ ధర్నా నిర్వహించనున్నారు. జేఏసీ గౌరవాధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య, అధ్యక్షులు గుంటుపల్లి రామదాసు, నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్నాపురం కనకారావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆలయాలలో పని చేస్తున్న కేశఖండన కార్మికులు పాల్గొంటారని పేర్కొన్నారు. గతేడాది తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని ఆందోళన చేశామని, నాడు సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిపారు. అయితే, ఏడు నెలలు గడిచినా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడంతో ధర్నాకు పిలుపునిచ్చినట్లు జేఏసీ వివరించింది.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్

నీటి కోసం 7న కలెక్టరేట్ ముట్టడి

విశాలాంధ్ర - అనంతపురము అర్బన్ : అదనపు నీటిని జిల్లాకు వచ్చేటట్లు తుంగభద్ర బోర్డుతో జిల్లా కలెక్టర్ చర్చలు జరపాలని, లేకుంటే జనవరి 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ హెచ్చరించారు. పీఏబీఆర్ కుడి కాలువకు 0.8 టీఎంసీల నీటిని విడుదుల చేస్తే ఆ నీరు కాలువలో ప్రవహించడానికే సరిపోతుందని రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, అదనపు జలాలను తీసుకుచ్చి కుడి కాలువకు నీరు విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జగదీష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఏబిఆర్ కుడి కాలువకు జనవరి 10 నుంచి 600 క్యూసెక్కుల ప్రకారం 20 రోజులు పాటు 0.8 టీఎంసీల నీరు వదులుతామని హెచ్‌ఎల్సీ ఎస్‌ఈ ప్రకటించడం విడ్డురంగా ఉందన్నారు. కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులు, 50 చెక్‌డ్యామ్‌లు నిండాలంటే కనీసం 3 టీఎంసీల నీరు అవసరం కాగా కేవలం 0.8 టీఎంసీలు వదులుతామని నీటి పారుదలశాఖ అధికారులు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రస్తుతం పీఏబీఆర్ జలాశయంలో 3.3 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇందులో 2టీఎంసీల నీరు వేసవిలో తాగునీటి అవసరాలకు ఉంచుకుని 1.3 టీఎంసీలు హంద్రీనీవా నుంచి జీడిపల్లి ద్వారా అర్థ టీఎంసీల నీరు మళ్లించి మొత్తం 1.8 టీఎంసీల నీటిని పీఏబిఆర్ కుడి కాలువకు నీరు ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికి ఆ ప్రయత్నాలు ఏమి చేయకుండా జిల్లా అధికారులు రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పైగా తాగునీటి అవసరాలకు తుంగభద్ర జలాశయంలో ఇంకా మన కోటా 2 టీఎంసీలు ఉందన్నారు. దానిని రాబట్టడానికి జిల్లా మంత్రులు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. పీఏబిఆర్ కుడి కాలువ 0.8 టీఎంసీల నీటితో రైతులు మధ్య ఘర్షణలు తలెత్తుతాయని, జిల్లా కలెక్టర్ అదనపు నీటిని జిల్లాకు వచ్చేటట్లు తుంగభద్ర బోర్డు వారితో చర్చలు జరపాలని డిమాండు చేశారు. లేకుంటే జనవరి 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నారాయణ స్వామి, సి.లింగమయ్య, నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, బీకేఎస్ మండల కార్యదర్శి కెవై ప్రసాద్, రైతు సంఘం నాయకులు బండి రామకృష్ణ, సీపీఐ నాయకులు హరికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం మళ్లీ సీఎంను చేయండి

గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖామంత్రి నారాలోకేష్



విశాలాంధ్ర - రామాపురం : ముఖ్యమంత్రి చంద్ర బాబును మరోసారి సీఎంను చేస్తే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ , ఐటీ మంత్రి నారాలోకేష్ అన్నారు. కడప జిల్లా రామాపురం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శని వారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ముందు కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలో రూ.88 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. సమీపంలోని రూ.11లక్షలతో నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించి వానపాములను తొట్లలో వదిలారు. సుద్దమళ్ల పంచాయతీలోని తొట్టివాండ్లపల్లె సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన 33/11కెవి సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళలతో ముఖాముఖిలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు 68 సంవత్సరాల వయస్సులో కూడా రాష్ట్రాభివృద్ధి కోసం 24 ఏళ్ల యువకుడిలా రోజూ మూడు జిల్లాల్లో పర్యటనలతో పాటు అధికారులతో సమీక్షిస్తున్నారని,ఆంధ్ర రాష్ట్రాల ప్రజల బాగోగుల కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆయనను 2019 ఎన్నికల్లో మరో సారి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం లోటు బడ్జెట్ వున్నా 50 లక్షల మందికి వెయ్యి రూపాయలు పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎంకే దక్కిందన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నా రాష్ట్ర నిధులతోనే కడపజిల్లాకు ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, పసుపు-కుంకుమ, 24గంటల కరెంటు, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో సీసీరోడ్లు పూర్తి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం కస్తూరిబాపాఠశాల, ఆదర్శ పాఠశాలలకు ప్రహరీగోడ, సీకోడ్డు నుంచి చెరువు ముందరపల్లెకు బీటీ, సీసీరోడ్లను ప్రారంభించారు.

మంత్రికి వినతిపత్రాలు వెల్లువ

మంత్రిలోకేష్ బాబు పర్యటనలో మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మండల వాసులు ఫిర్యాదులు అందించారు. రామాపురం మండలం కరువు ప్రాంతం కావడంతో ఉపాధిహామీలో పనిదినాలు పెంచాలని, వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా చెరువులకు నీరందించాలని, మండల టీడీపీ నాయకులు కె.ఈశ్వర్‌రెడ్డి మంత్రికి వినతిపత్రం అందించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా గ్రూపు రుణాలు ఇవ్వలేదని సూర్యనారాయణ పురానికి చెందిన మహిళలు మంత్రి దృష్టికి తేగా, సమస్యను పరిష్కరించాలని ఆయన కలెక్టర్‌ను ఆదేశించారు. అదే గ్రామానికి చెందిన ఆవులకుంట సుబ్బలక్ష్మమ్మ తన కుమార్తె వివాహానికి చంద్రన్న పెళ్లికానుక రాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు

అడపలమాలపల్లె నుంచి నీలకంఠ్రావుపేటకు రోడ్డు కావాలని మహిళలు కోరారు. ఆయన వెంట కలెక్టర్ హరికిరణ్ , రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ , జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి , కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్, సాయి లోకేష్, రాయచోటి టీడీపీ ఇన్‌ఛార్జ్ రమేష్ కుమార్‌రెడ్డి , తెదేపా నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి , డ్వామా పీడీ హరిహరనాథ్ , జిల్లా అధికారులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి , తహశీల్దార్ అనురాధ, ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీఎం రెడ్డెమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు శేఖర్ , రవితేజ, ఎంపీటీసీసీ రవికుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు సీతారాంనాయక్ , ఎంఎల్ వెంకట్రామిరెడ్డి , నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

విశాలాంధ్ర - ప్యాపిలి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామంలో జరిగిన ఆరవ విడత జన్మభూమి-మావూరు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శనివారం ఆయన పాల్గొన్నారు. ప్రజల సంక్షేమార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని, రాష్ట్ర విభజన లోటు బడ్జెట్‌తో ఉన్న నవ్యాంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి, ప్రజల సంక్షేమాభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్న గొప్ప వ్యక్తి మన సీఎం అన్నారు. రేషన్ కార్డులు, పక్కా గృహాలు, పింఛన్‌లు రానివారుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, కీ.శే ఎన్టీఆర్ నుంచి మహిళలంటే టీడీపీకి ఎంతో గౌరవమని, మహిళా సంఘాలు ఏర్పాటుచేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని, జలదుర్గం గ్రామానికి అన్ని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు.

125 పథకాలు ప్రభుత్వం అమలు చేస్తున్నని మంత్రి వివరించారు. చంద్రన్న పెళ్లి కానుక పథకంలో నిరుపేదలు పెళ్లికి 15 రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే, పెళ్లి నాటికి ప్రోత్సాహకాన్ని అందిస్తా మన్నారు. చంద్రన్న బీమా కింద సహజ మరణానికి రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు అందిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.వెయ్యి ఇస్తున్నామన్నారు. పుట్టినప్పటి నుంచి మహాప్రస్థానం వరకు ప్రతి వ్యక్తికి ఏదో ఒక పథకం ద్వారా లబ్దిని చేకూరుస్తున్నామన్నారు. ఆదరణ పథకంలో పనిముట్లను 10 శాతం చెల్లించి తీసుకోవాలన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు రైతాంగ సంక్షేమం, ఆహార భద్రత, ప్రకృతి సేద్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులను, చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అంతకు ముందు రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత రోడ్లు, కాలువలను ఆయన ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేకాధికారి గోపీనాథ్, ఆర్డీవో వేంకటేశ్వర్లు, గొర్రెల పెంపకం సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర యాదవ్, ఎమ్పీడీవో, తహశీల్దార్, అన్ని శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న రామాంజనేయులు

8,9ల్లో జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

రామాంజేనుయులు పిలుపు

విశాలాంధ్ర - డోన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8,9 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు అన్నారు. శనివారం ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా డోన్ పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుంకయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు, సీఐటీయూ నాయకులు మద్దయ్యలు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని ఏర్పాటుచేసి కనీస పెన్షన్ రూ. 6 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం, పని భద్రత కల్పించి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, నష్టపరిహారం అందించాలన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సమ్మెకు ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ స్కూటర్ ర్యాలీలో ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి మోటా రాముడు, ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ అధ్యక్షులు అబ్బాస్, డిప్యూటీ కార్యదర్శి పుల్లయ్య, కార్మిక యూనియన్ నాయకులు సురేంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివన్న, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, శివరామ్‌లు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఏకంగా కావాలి



విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా గిరిజనులు అంతా ఏకమవ్వాలని మహాకూటమి రాష్ట్ర ఛైర్మెన్ మధుగాని గురునాథం, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి పి. గోవిందులు పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మహాకూటమి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గిరిజనులను ఓటుబ్యాంకుగా వాడుకుంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. 30 ఏళ్లలో రూ.50వేల కోట్లు, ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. అణగారిన దళిత, గిరిజను వర్గాలు ఆర్థికంగా ,సామాజికంగా అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారమే లక్ష్యంగా సాగాలన్నారు. గిరిజన సంఘాలను ఏకం చేసి రానున్న ఎన్నికలల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం,రాజకీయ చైతన్యం చేసే విధంగా గిరిజన మహాకూటమి ఏర్పాటు చేస్తామని వివరించారు. రాజకీయపార్టీలకు అతీతంగా ఈ మహాకూటమికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఏఐబీఎస్ఎఫ్ రాష్ట్రకార్యదర్శి శ్రీనునాయక్, ఎస్టీఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మద్దయ్య, వైఎస్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి ధనలక్ష్మీ పాల్గొన్నారు.

వారసత్వ పాలనను అడ్డుకుందాం

విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్రంలో రెండు కుటుంబాల వారసత్వ పరిపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా పాయకరావుపేటలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు తర్వాత లోకేష్, ఆ తర్వాత దేవాన్ష్ రాష్ట్రాన్ని పరిపాలించాలని అనుకుంటున్నారన్నారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత ముఖ్యమంత్రి కుర్చీ తనకే కావాలని జగన్మోహన్‌రెడ్డి ఉవ్విళ్లూరుతున్నారని, ఇలాంటి కుటుంబాల పాలనను అడ్డుకోవాలన్నారు. ప్రజా సమస్యలు వదిలేసి ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పర్యటలు చేస్తుంటే, అసెంబ్లీని వదిలేసి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రల పేరుతో రోడ్లపై తిరుగుతున్నారని విమర్శించారు. పార్టీ పెట్టిన నాటి నుంచి ఏదో ఒక యాత్ర చేస్తున్న జగన్‌కు ముఖ్యమంత్రి కుర్చీ యాత్ర ఒకటే మిగిలి ఉందని వ్యాఖ్యానించారు. రెండు కుటుంబాల వారసత్వ పాలనను అడ్డుకుంటూ ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని నివారించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయం రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్నారు.

త్రిపుల్ తలాక్ బిల్లుకు ముస్లీంలు వ్యతిరేకం



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం చేసే ట్రిపుల్ తలాక్ బిల్లును ముస్లిం మేధావుల వేదిక (ఎంటీఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందని, దీనికి వ్యతిరేకంగా 6న అదివారం ప్రెస్‌క్లబ్‌లో ముస్లీంల హక్కులపై ఒక రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని వేదిక కన్వీనర్ ఎ.ఎం.యజ్దాని(డానీ) తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్రిపుల్ తలాక్ బిల్లు చట్టం కాకుండా రాజ్య సభలో అడ్డుకున్న విపక్ష పార్టీలు అన్నింటికీ ఎంటీఎఫ్ తరపున ధన్యవాదాలు చెప్పారు.సుప్రీంకోర్టు ఇన్ స్టాంట్ ట్రిపుల్ తలాక్‌పై 2017 ఆగస్టులో ఇచ్చిన తీర్పును ముస్లిం సమాజం సంపూర్ణంగా ఆమోదిస్తుందన్నారు. పేరుకి ముస్లిం మహిళ రక్షణ చట్టం అయినప్పటికీ ఇది నిజానికి ముస్లిం కుటుంబ భక్షణ చట్టం అని ఆయన ఎద్దేవా చేశారు. ముస్లింలే కాకుండా అన్ని మతాలకు చెందిన మతసామరస్యవాదులు ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశంలో ముస్లింల స్థితిగతుల్ని మార్చడానికి జస్టిస్ రంగనాధ మిశ్రా కమిషన్, జస్టిస్ రాజేంద్ర సచార్ కమిటీ సిఫార్సులు, నివేదికలను అమలు చేయాలని వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు పరచే అంశాన్ని తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని డానీ రాజకీయ పార్టీలను కోరారు. ఈ సమావేశంలో వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.ఎ.రహమాన్, రాజకీయ విశ్లేషకులు సయ్యద్ రఫీ పాల్గొన్నారు.

రైల్వేల ప్రైవేటీకరణ ఆపాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ప్రజల కష్టార్జితంతో అభివృద్ధి అయిన రైల్వే, రక్షణ, పబ్లిక్ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని, దానిలో భాగంగా ఈ నెల 8, 9 తేదీలలో జరిగే దేశవ్యాప్త జరగనున్న సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. రైల్వేల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే.సుభాని అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మోడీ నాలుగున్నరేళ్ల పాలనలో కార్పొరేట్ రంగాలకు, బడా పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటూ కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. దీనిపై అనేక సార్లు నిరసనలు, ఆందోళనలు చేపట్టినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో కూడా పెద్దఎత్తున దేశవ్యాప్త సమ్మె జరిగిందన్నారు. అయినా మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తీసుకోవడంలో మాత్రం వెనకడుగు వేయడం లేదన్నారు. రైల్వేల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా పని చేస్తున్న 46 వర్క్‌షాపుల్లో కొన్ని విభాగాలను ఇప్పటికే ప్రైవేటీకరించారని తెలిపారు. రైల్వే పోర్టులకు అనుసంధానంగా 8 లైన్ల రైల్వే నిర్మాణ పనుల కోసం, కంటెయినర్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ 15 ప్రైవేటు కంపెనీలకు ఇచ్చారన్నారు. మోడీని గద్దె దించుదాం-దేశాన్ని రక్షించుకుందాం - కార్మిక హక్కులను కాపాడుకుందాం అనే నినాదంతో 8,9 తేదీలలో జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. దేశభక్తిగల కార్మికులంతా పెద్దసంఖ్యలో పాల్గొని 8,9ల్లో జరిగే కార్మిక సమ్మెకు మదద్దతు తెలపాలని నాయకులు పిలుపునిచ్చారు.

1,241 ఎకరాలపై ల్యాండ్ పూలింగ్ అస్త్రం

- వీఎంఆర్‌డీఏకు పురపాలకశాఖ ఆదేశం
- తాజాగా మరో జీవో విడుదల
- రెండు మండలాల్లో భూములపై కన్ను

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూములు లాక్కునేందుకు మరోమారు ల్యాండ్ పూలింగ్ విధానం విశాఖ జిల్లాలో అమలుకు సిద్ధపడింది. రాజధాని తరహాలో అభివృద్ధి చేసిన భూమిలో రైతులకు 25 శాతం ఇచ్చేందుకు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని వీఎంఆర్‌డీఏను ఆదేశిస్తూ శుక్రవారం రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికన్ వల్వన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఉడా ల్యాండ్ పూలింగ్ స్కీమ్‌ను తాజాగా 1,241.11 ఎకరాలకు అమలుచేయాలని జీవోలో పేర్కొన్నారు. 2016 నవంబర్ 14న జీవో నంబరు 290, 304 విడుదల చేయగా, 2017లో జీవో నంబరు 18, 2018లో 268, 269, 337,414 జీవోలను విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా గత ఏడాది డిసెంబర్ 26న వీఎంఆర్‌డీఏ కమిషనర్ లేఖకు స్పందిస్తూ ఆనందపురం, పెందుర్తి మండలాల్లోని భూముల్లో ల్యాండ్ పూలింగ్ ప్రారంభించాలని పురపాలక శాఖ తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఆనందపురం మండలం రామవరం సర్వే నంబరు ఒకటిలో 133 ఎకరాలు, 32లో 11.14 ఎకరాలు, 34లో 18.48 ఎకరాలు, 37లో 28.09 ఎకరాలు, 38లో 53.6 ఎకరాలు, 39లో 5.62 ఎకరాలు, 40లో 3.76 ఎకరాలు, 53లో 8.94 ఎకరాలు, 55లో 15.5 ఎకరాలు, 56లో 3.82 ఎకరాలు, 57లో 75.25 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్ అమలు చేయనున్నారు. పెందుర్తి మండలంలోని ముదపాక సర్వే నంబరు ఒకటిలో 550.32 ఎకరాలు, 38లో 85.6, 76లో 247.99 ఎకరాల్లో పూలింగ్ ప్రారంభించాలని ఆదేశాల్లో పేర్కొంది. గతంలో ఈ భూములు ఇచ్చేది లేదని రైతులు పెద్దఎత్తున ఆందోళన చేసిన నేపథ్యంలో ఉడా తాజా ఉత్తర్వులు ఆధారంగా పూలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నద్ధం అవుతుంది. ఇప్పటికే ఈ భూములను అనేక మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, అనుచరులు, కొనుగోలు చేసి పూలింగ్ పేరిట భారీగా కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : విశాఖ జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ ఎదుట శనివారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు.వీరిలో ఒకరు మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యుడు కాగా, మరొకరు ఏరియా కమిటీ సభ్యురాలు. వీరి వివరాలను ఎస్పీ బాబూజీ మీడియాకు వెల్లడించారు. కడప జిల్లా లింగాల మండలం దొండల్ల వాగు గ్రామానికి చెందిన ఛవ్వా లక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ నర్సింహులు అలియాస్ అశోక్((51) పులివెందులలో నాటు సారా, మద్యపాన ఉద్యమాల్లో పాల్గొన్నారు. మరో మావోయిస్టు శ్రవణ్ దుర్గాదేవి(39) అలియాస్ ఇరివి అనారోగ్యంతో లొంగిపోయిందన్నారు.

అభ్యర్థుల కోసం ప్రధాన రాజకీయ పార్టీల వెతుకులాట

విశాఖ, అనకాపల్లి, అరకు సీట్లపై కుస్తీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ సిటీ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతమైన పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థుల కోసం విశాఖ జిల్లాలో రాజకీయ పార్టీలు వేట మొదలుపెట్టాయి. స్థానికుల కంటే వలస వ్యాపారులకు టిక్కెట్లు ఇచ్చేందుకు టీడీపీ, వైసీపీలు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. అనకాపల్లి, విశాఖ, అరకు సీట్ల గెలుపు కోసం అధికార టీడీపీతో పాటు ప్రతిపక్ష వైసీపీ, జనసేన పార్టీలు దృష్టి సారించాయి. కాంగ్రెస్, బీజేపీ నేతలు అన్వేషిస్తున్నారు. మూడు నెలల్లో ఎన్నికల వచ్చే అవకాశం ఉండటంతో ఆయా పార్టీల అధిష్టానాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించాలని అంచనా వేస్తున్నాయి. టీడీపీ, వైసీపీ, జనసేన నేతలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

విశాఖ సీటుపై ప్రత్యేక దృష్టి : విశాఖ పార్లమెంటు స్థానంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ప్రశాంత నగరంగా పేరొందిన విశాఖ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుండటంతో ఇక్కడ పాగా వేయాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థి హరిబాబు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మాతృ మూర్తి విజయమ్మ పై గెలుపొందారు. ఈ సారి టీడీపీ, బీజేపీ కలిసి పోటీ పరిస్థితులు కానరావడం లేదు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీతో కాంగ్రెస్ పొత్తు ఉండొచ్చనే ప్రచారం జరుగు తోంది. వైసీపీ అధిష్టానం కొత్త అభ్యర్థిని రంగంలోకి దించుతుందనే వాదన వినిపిస్తోంది. జనసేన పార్టీ అభ్యర్థి ఎవరనేది తేలాల్సివుంది. అనకాపల్లి, అరకు స్థానాలకు కూడా అదే పరిస్థితి.

తటస్థులపై కన్ను : రాబోయే ఎన్నికల కీలకం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఆర్థబలంతో పాటు సామాజిక సమీకరణాల ఆధారంగా అభ్యర్థులను అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది. విశాఖలో పేరు ప్రఖ్యాతు లున్న తటస్థులపై అన్ని పార్టీలు దృష్టిసారించినట్టు సమాచారం. కొందరు తటస్థ ప్రముఖులతో ఆయా పార్టీల అధినేతలు చర్చలు జరిపినట్టు ప్రచారం జరుగుతోంది.

మహిళా హక్కులు గుర్తిద్దాం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: చట్టాలను గౌరవించి-మహిళా హక్కులను కాపాడాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చట్టాలను గౌరవిద్దాం-మహిళల హక్కులను గుర్తిద్దాం అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు కావాలని శబరిమల విషయంలో రాద్ధాంతం చేస్తున్నాయని, సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ మతోన్మాద శక్తులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. శబరిమల పేరుతో కేరళలో అశాంతి నెలకొప్పడం జరుగుతుందని, దేవాలయంలో మహిళల ప్రవేశంపై కోర్టు తీర్పును ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సృష్టికి మూలమైన మహిళలను ఆచార సంప్రదాయాల పేరుతో హక్కులను కాలరాయడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు ఉస్తల సృజన, జ్యోతి, సామాజిక కార్యకర్త దేవి, సజయ, కృష్ణమూర్తి, ప్రేంపావని, ఛాయాదేవి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ వత్సరంగా 2019

తెలంగాణ అటవీ శాఖ నిర్ణయం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఈ ఏడాదిని అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ సంవత్సరంగా పాటించాలని తెలంగాణ అటవీ శాఖ నిర్ణయించింది. అగ్ని ప్రమాదాల నివారణ కోసం గతేడాది తీసుకున్న చర్యలు మంచి ఫలితాలివ్వడంతో, వాటిని కొనసాగించటంతో పాటు మరిన్ని నివారణ చర్యలను చేపట్టాలని భావిస్తోంది. ప్రమాద కారకాలను ముందే పసిగట్టడం, తగిన నివారణ చర్యలు తీసుకోవటం, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండే ప్రజలను చైతన్యవంతం చేయటం, అడవిపై ఆధారపడే జీవించే వారిపై నిఘాతో పాటు, ప్రమాదాల నివారణలో వారికి భాగస్వామ్యం కల్పించడం వంటి నిర్ణయాలను అటవీ శాఖ తీసుకుంది. ప్రమాదాలను తొందరగా పసిగట్టి క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రమాదాల నివారణ, అవసరమైన యంత్ర సామాగ్రి వాడకంపై సిబ్బందికి దూలపల్లి అటవీ అకాడమీలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మానవ నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాల వల్ల అమూల్యమైన అటవీ సంపదను కోల్పోవటంతోపాటు పర్యావరణా నికి ముప్పు కలుగుతోందని, ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలే మందని కార్యక్రమానికి హాజరైన పీసీసీఎఫ్ రఘువీర్ తెలిపారు. బీడీ ఆకులు, అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లేవారిని అప్రమత్తం చేయాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్షేత్ర స్థాయి అటవీ సిబ్బందికి మంటలను ఆర్పే సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి దుస్తులు, సామాగ్రి వాడాలి అనే దానిపై రీజనల్ ఫైర్ ఆఫీసర్ వర్ల పాపయ్య శిక్షణ ఇచ్చారు. అగ్ని ప్రమాదాల నివారణ దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా రిటైర్డ్ టీచర్ వల్లంపట్లనాగేశ్వర రావు రూపొందించిన కళారూపాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ కోట తిరుపతయ్య పాల్గొన్నారు.

మనోవికాసానికి పుస్తక పఠనం

- అనువాదాలకు పెరిగిన ప్రాధాన్యత
- గిఫ్ట్‌గా బుక్స్ ఇచ్చి చూడండి...
- జీవిత చరిత్రలకు తరగని ఆదరణ



('విశాలాంధ్ర-స్పెషల్ డెస్క్)

Sunday Special

శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మేధకు పఠనంకూడా అవసరమేనంటున్నారు అం దుకే చిరిగిన చొక్కా అయినా తొడుక్కో పుస్తకాన్ని.. కొనుక్కో అని కందుకూరి వీరేశ లింగం కోరారు. విజయవాడలో జరుగుతున్న 30వ పుస్తక మహోత్సవం పుస్తక ప్రియులకు పండుగ వాతావరణం తెచ్చింది. సాంకేతికత, సామాజిక మాధ్యమాల ఉధృతితో దూసు కెళ్తున్న ప్రస్తుత సమాజంలో పుస్తకపఠనం తగ్గిన మాట వాస్తవం. దీనిని నివారించి, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు పాదయాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పాల్గొని పుస్తకపఠనంపై ప్రజలకు అవగాహన కలిగిం చారు.

గిఫ్ట్‌లుగా పుస్తకాలు ఇచ్చి చూడండి... భేషజాలకు పోయి మరొకరిని అనుకరిం చేకన్నా పుట్టినరోజుకో, పెళ్లిరోజుకో ఏదైనా పుస్తకం ఇచ్చిచూడండి..ఆటోమేటిక్‌గా చదవ డానికి మక్కువ చూపిస్తారు.

ఏటా స్వరాజ్‌మైదాన్‌లో నిర్వహించే పుస్తకమహోత్సవానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి అభిమానులు ఇక్కడికి చేరు కుంటారు. అభిమాన రచయితల పుస్తకాలతో పాటు అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన పుస్తకాలు, అనువాదాలను ఇక్కడ కొనుగోళ్లు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలతో ఈ తరం వారిలో పుస్తకపఠనంపై ఆసక్తి తగ్గడంతో దానిని అధిగమించేందుకు పబ్లిషర్లు, కవులు, రచయితలు, మేథావులు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా జరిగిన పుస్తక మహోత్సవంలో బెందాళం కృష్ణారావు మాట్లాడుతూ, సాహి త్యం ద్వారానే సమా జంలో మార్పు సాధ్య మవుతుందని పేర్కొ న్నారు. శుక్రవారం జరిగిన పుస్తక ప్రియుల పాదయాత్ర సభలో పలువురు చిన్నారులు, పెద్దలు పాల్గొని పలు పుస్తకాలను ఆవిష్కరిం చారు.

ఆంగ్లసాహిత్యంలో కొత్త పుస్తకాల గురించి తెలుసుకునేందుకు, కొనుగోలు చేసేందుకు యువత మక్కువ చూపుతున్నారు. ఆంగ్ల సాహిత్యంలో ప్రసిద్ధ రచయితల పుస్తకాలు ఎక్కువగా అమ్ముడవుతున్నా యయని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రసిద్ధ చరిత్రకారుడు, జర్నలిస్టు, ఆంగ్ల రచయిత రామచంద్ర గుహ రచించిన 'గాంధీ ద ఇయిర్‌దట్ చేంజ్‌ద వరల్డ్ 1914-18 పేరుతో మార్కెటలోకి వచ్చింది. మహాత్మాగాంధీ మనుమడు రాజ్‌మోహన్ గాంధీ రాసిన మోడరన్ సౌత్ ఇండియాలో దక్షిణాది ప్రాముఖ్యత వివరంగా ఉంది. 'క్యాపిటలిజం ఇన్ అమెరికా', భారతీయ ఆంగ్లరచయిత చేతన్‌భగత్ 'ది గర్ల్ ఇన్ రూమ్ 105' గతేడాదే మార్కెట్‌లోకి వచ్చింది. అమెరికా మాజీ అధ్యక్షుడి సతీమణి మిచెల్ ఒబామా రచించిన 'బికమింగ్' పుస్తకం అందరినీ అలరిస్తోంది.

సృజనకు మెరుగులద్దే పుస్తకాలు, హృదయాలను నూతనత్వంతో ఆవిష్కరించే కవితలు, మానసిక ప్రశాంతతకోసం ఆధ్యా త్మిక రచనలతోపాటు తెలుగులోకి అనువా దాలు విస్తృతంగా వస్తున్నాయి. ఎమెస్కో విశాలాంధ్ర, అశోక్‌బుక్ హౌస్‌లు అనేక సంస్థల అనువాదాలపై దృష్టిపెట్టి తెలుగు పాఠకులకు అందిస్తున్నారు. తెలుగువారం దరికీ సుపరిచితమైన పెద్దబాల శిక్ష 179 సార్లు ముద్రించబడింది. దీంతో ఆ పుస్తకంపై మనవారికుండే మక్కువ తెలుస్తోంది. న్యాయ వాదులకు ఉపయుక్తమైన 'అడ్వాన్స్‌డ్ లా లెక్సికన్' ఎలక్ట్రానిక్ విద్యార్థుల కోసం ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎలక్ట్రోమ్యాగ్నెటిక్స్ అందు బాటులో ఉన్నాయి. ఈసారి పలు ఉద్యో గాలకు ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేయ డంతో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలకు డిమాండ్ పెరిగింది. ఏటా లక్షమంది వరకు వచ్చే ఈ పుస్తక ప్రదర్శనకు ఈ సారి సంఖ్య మరింత పెరగవచ్చునని అంచనా...

శరీరానికి వ్యాయామంతోపాటు చదవడం, చదివించడం కూడా అవసరమేనం టున్నారు గుంటూరుజిల్లా యడ్లపాడుకు చెందిన పోపూరి రామారావు. రోజుకు నాలు గు గంటలు ఆయన గ్రంథాలయంలో గడుపు తారు. 82ఏళ్లవయసులో ఆయన పత్రికలు, పుస్తకాలు చదవని రోజంటూ ఉండదు. ఎక్కువగా ఆరోగ్య సంబంధిత పుస్తకాలను చదువుతారు. ఆ తరువాత జనరల్ నాలెడ్జ్, వ్యవసాయ సంబంధితాలపై మక్కువ చూపిస్తారు. 1960లో బిఏ పూర్తిచేసిన రామారావు వ్యవసాయం జీవనాధారమైనా ప్రతిఏటా పుస్తక మహొత్సవానికి వస్తానని చెబుతున్నారు. కనీసం రెండు, మూడు వేలరూపాయల పుస్తకాలు కొంటారు. పొలం నుంచి వచ్చిన తర్వాత కచ్చితంగా గ్రంథాల యానికి వెళ్తానని చెబుతున్నారు. ప్రపంచంలో జరిగే పరిణామాల గురించి ఆసక్తి ఉండటంతో ఎప్పటికప్పుడు విషయాలను తెలుసుకుంటానని చెబుతున్నారు. మనోమా లిన్యమనే చీకటిని పఠనం అనే వెలుగుతో తొలగించుకోవాలని రాజ్యాంగ రచయిత డా. అంబేద్కర్ వెల్లడించారు. పుస్తకపఠనమే ప్రతి ఒక్కరినీ అభ్యుదయబాటలో నడిపిస్తుంద నడంలో సందేహం లేదు.

అన్ని వివరాలివ్వాల్సిందే..

పంచాయతీ అభ్యర్థులకు ఈసీ స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు తమ ఆస్తులు, నేరాల చిట్టాను విప్పాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. నూతన పంచాయతీ రాజ్ చట్టం నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆదాయం, ఖర్చులు, ఉమ్మడి ఆస్తులు, విద్యార్హతలతో కూడిన సమాచారాన్ని నామినేషన్ పత్రాలతో సమర్పించాలనే నిబంధన ఉంది. నామినేషన్ పత్రాలపై అభ్యర్థుల సంతకాలతో పాటు ఇద్దరు సాక్షుల సంతకం ఉండాలి. అభ్యర్థి జీవిత భాగస్వామి, పిల్లల ఆస్తుల వివరాలనూ పొందుపర్చాలి. కుటుంబ విరాలంటే పాన్ కార్డు, బ్యాంకు ఖాతాలు, ఐటీ రిటర్న్, ఆదాయం వంటి సమాచారాన్ని వెల్లడించాలి. ఉమ్మడి కుటుంబమైతే కటుంబం ఆస్తిలో వాటా, ఫైనాన్సియల్ సంస్థల్లో డిపాజిట్లు, షేర్స్, పోస్టాఫీస్ డిపాజిట్లు, బీమాలు, వాహనాలు, ప్లాట్లు, అప్పుల వివరాలను అభ్యర్థులు తెలపాలి. చిన్నా పెద్దా కేసుల వివరాలు, సెక్షన్స్, ఏ పోలీస్ స్టేషన్, ఏ కోర్టులో కేసులు నడుస్తున్నాయి, శిక్ష పడిందా, పడితే ఎంత కాలం.. వంటి వివరాలనూ వెల్లడించాలి. విద్యార్హత, వారి రిమార్క్సనూ కచ్చితంగా తెలపాలని అభ్యర్థులకు ఈసీ స్పష్టం చేసింది.

చెన్నై ఘటనపై నివేదిక ఇవ్వండి

ఇండిగో సంస్థకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ : చెన్నై నుంచి కోల్‌కతా వెళ్లే ఇండిగో సంస్థ విమానానికి ఈ నెల మూడున తృటిలో తప్పిన ప్రమాదంపై తక్షణమే నివేదిక ఇవ్వాలని కేంద్ర పౌరవిమానయాన సంస్థ ఆదేశించింది. చెన్నై నుంచి కోల్‌కతాకు బయలుదేరిన ఎయిర్‌బస్ ఏ320 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పెద్ద శబ్దం వచ్చి ఇంజన్ ఫెయిలైంది. విమానం గాల్లో ఉన్న సమయంలో పెద్ద శబ్దంతో ఇంజన్ ఫెయిల్ అవడంతో పాటు స్వల్పంగా మంటలు, పొగ రావడాన్ని పైలెట్లు గుర్తించారు. దీంతో వెంటనే విమానాన్ని వెంటనే చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానం బాగా ఊగిపోయినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనేది తెలియరాలేదు. ఈ ఘటనపై విచారణ చేసేందుకు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కి చెందిన బృందం రంగంలోకి దిగింది.

బీసీలు ఎదగకుండా కుట్ర : కోదండరామ్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : బీసీ నాయకులు ఎదగకుండా చేసే కుట్రలో భాగంగానే పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వే షన్లు తగ్గించారని తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం ఆరోపిం చారు. గ్రామస్థాయిల్లో జరిగే ఎన్నికలలో కొత్తనాయకత్వం తయారు కావాలంటే రిజర్వేషన్లు అవసరమన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు. జెడ్పీటీసీలైతే రాజకీయంగా ఎదిగిన తర్వాతే జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు అవుతారని తెలిపారు. ఎంపీటీసీలు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ప్రస్తుత రిజర్వేషన్లే కొనసాగుతాయన్నారు. రాజకీ యాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే రాజకీయ వ్యవస్థ బలపడుతుందని కోదండరామ్ అన్నారు. బీసీ రిజర్వేషన్‌ల అమలులో టీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఒక రోజు నిరసనను టీజేఎస్ చేపట్టింది. బీసీ నేతలతో పాటు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రిజర్వేషన్లు ఉండాలని, బీసీలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపసం హరించుకోవాలని కోదండరామ్ డిమాండు చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 22 శాతం తగ్గించడం అన్యాయమన్నారు. బీసీ రిజర్వేషన్‌లపై సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేయాలని అన్నారు. రిజర్వేషన్లు తగ్గించడం వలన 1500 మంది బీసీలు సర్పంచ్ అయ్యే అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. అన్ని పార్టీలు తమ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు డా.డి.సుధాకర్ మాట్లాడుతూ ఒక్క రోజులో సమగ్ర సర్వే చేయగలిగిన కేసీఆర్, ఆరునెలలుగా బీసీల కులగణన చేయకపోవడం కుట్ర పూరితమని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే, ప్రతిపక్షనేతలు, ప్రజాసంఘాల నేతలు ఎవరితో చర్చించకుండా దొడ్డిదారిన ఆర్డినెన్స్ తేవడాన్ని తప్పుబట్టారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి దాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కోర్టు ఉత్తర్వులను బేఖాతర్ చేసి కోర్టు ధిక్కరణకు కేసీఆర్ పాల్పడుతున్నారని ఆరోపిం చారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ పంచాయ తీరాజ్ చట్టం ప్రకారం బిసిలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.

17 నుంచి తెలంగాణ అసెంబ్లీ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ రెండో శాసనసభ తొలి సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. కొత్తగా ఎన్నికైన శాసన సభ్యుల్లో సీనియర్ అయిన చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రోటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. ఈ నెల 16న సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ మరునాడు నుంచి శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. కొత్త స్పీకర్ ఎన్నికయ్యే వరకు ప్రొటెం స్పీకర్ సభను నిర్వహిస్తారు. సీనియర్ ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం ఆనవాయితీ. ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన ఖాన్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రొటెం స్పీకర్‌గా ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ప్రజలు గొప్ప మెజారిటీతో తమను గెలిపించారని, ఆ స్ఫూర్తితో ఉత్తరాయణ పుణ్యకాలంలో ఏకాదశి తిథినాడు శాసనసభ కార్యకలాపాలు ఆరంభించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 17న ఉదయం 11-30 గంటలకు ప్రోటెం స్పీకర్ అధ్యక్షతన సమావేశాలు ప్రారంభమవుతాయి. కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం సుమారు రెండు గంటలు కొనసాగుతుంది. మధ్యాహ్నం జూబ్లీహాల్స్‌లోని కౌన్సిల్ లాన్స్‌లో సభ్యులకు భోజనం ఏర్పాటు చేస్తారు. అదే రోజున స్పీకర్ ఎన్నికకు షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ కార్యక్రమాలు వుంటాయి. 18న స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఆ తరువాత నూతన స్పీకర్‌ను సభానాయకుడు, ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రతిపక్ష నాయకులు, ఇతర శాసనసభా పక్ష నాయకులు స్పీకర్ స్థానానికి తోడ్కొని పోతారు. ఆ తరువాత స్పీకర్ అధ్యక్షతన సభా కార్యక్రమాలు సాగుతాయి. అనంతరం బీఏసీ సమావేశాన్ని స్పీకర్ నిర్వహిస్తారు. 19న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టడం, దానికి సభ ఆమోదం తెలపడం జరుగుతుంది. డిసెంబరు 13న కేసీఆర్ రెండోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల శాసనసభ్యుల ప్రమాణస్వీకారాన్ని వాయిదా వేస్తూ వచ్చిన విషయం తెలిసిందే.

భూదాన భూములను కాపాడాలి



విశాలాంధ్ర-రంగారెడ్డి: భూదాన భూములను కాపాడాలని, తప్పుడు ధృవపత్రాలతో భూములను లేఔట్లుగా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. తుర్కయంజాల్‌లోని రెవెన్యూ సర్వే నెంబర్ 619లోని 15 ఎకరాల భూ దాన భూమిలో అక్రమ లేఔట్లు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు సిపిఐ ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించి విజ్ఞప్తి చేసింది. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య సారథ్యంలో ప్రతినిధి బృందం శనివారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసింది. రూ.50 కోట్లు విలువ చేసే 15 ఎకరాల భూదాన భూమిలో హెచ్ఎండిఏ నుంచి అక్రమ లేఔట్లు తీసుకున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమ లేఔట్‌పై హెచ్ఎండిఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, సంబంధిత లేఔట్‌లో భూదాన భూమి ఉందని భూదాన బోర్డు చెప్పడంతో ఆ లేఔట్‌ను నిలిపివేయడంతో పాటు జిల్లా కలెక్టర్, హెచ్ఎండిఏకు గత నవంబర్ 22వ తేదీన లేఖ కూడా రాశారని మున్సిపల్ కమిషనర్ దృష్టికి యాదయ్య తీసుకొచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంతమాత్రం జాప్యం చేయకుండా లేఔట్ అభివృద్ధి పనులను నిలిపి వేయాలని, ప్లాట్ల కొనుగోలు దారులకు సంబంధిత రియల్టర్ల నుండి తిరిగి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, భూదాన భూమిని కాజేయాలని చూస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్, హెచ్ఎండి కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ బృందంలో అనురాధ, యాదగిరి, ఈశ్వర్, బండారి ఈశ్వర్ ఉన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సం క్రాంతి రద్దీ దృష్ట్యా టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పం డుగ రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు తెలంగాణ ఆర్టీసి రీజినల్ మేనేజర్ యాదగిరి తెలిపారు. మొత్తం 5252 బస్సులు సిద్ధం చేశామన్నారు. ఎంజీబీఎస్ నుంచి 3400 బస్సులు తిరుగుతాయని, ఉత్తర తెలంగాణ బస్సులు 10-14 తేదీల్లో జేబీఎస్ నుంచి నడుస్తాయని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా 300 బస్సులు ఫుల్ అయినట్టు వెల్లడించారు. ట్రాఫిక్ దృష్ట్యా నగరశివార్లలో స్టాపింగ్ పాయింట్లను టీఎస్ ఆర్టీసీ ఏర్పాటు చేసింది. నల్లగొండ వెళ్లే బస్సులు దిల్‌షుఖ్‌నగర్ నుంచి, వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి; కర్నూలు అనంతపురం వెళ్లే రెగ్యులర్ బస్సులు ఎంజీబీఎస్ నుంచి, స్పెషల్ బస్సులు సీబీఎస్ నుంచి బయలు దేరుతాయి. వికారాబాద్, తిరుపతి, మహబూబ్ నగర్, బెంగుళూరు బస్సులు ఎంజీబీఎస్ నుంచి వెళ్తాయి. విజయవాడ వైపు వెళ్లే బస్సులు నగర శివార్ల నుండే బయలుదేరుతాయి. వెయ్యి బస్సులకు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించామని, 24 గంటలూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికా రులు తెలిపారు. ప్రత్యేక బస్సులకు 50 శాతం అదనంగా చార్జీలు ఉంటాయన్నారు. బస్సులు రద్దీగా వెళ్లినప్పటికీ వచ్చే టప్పుడు ఖాళీగా వస్తాయి కాబట్టే ఈ అదనపు చార్జీలంటూ వారు వివరించారు. రిజర్వేషన్లలో విశాఖ, అమ లాపురం, రాజోలు వంటి ప్రాంతాలకు డిమాండు ఉందని, 1592 బస్సులను తెలంగాణకు, 3670 బస్సులను ఏపీకి నడపను న్నట్లు చెప్పారు. రోజుకు 400 మెట్రో ఎక్స్‌ప్రెస్, లైనర్లు, డీలక్స్ బస్సులను వాడుతామని, ప్రమాదాల నివార ణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.

సౌర వనాలు..ప్రగతి ఫలాలు

- సౌర విద్యుదుత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానం
- రూ. 4కే యూనిట్ సోలార్ విద్యుత్
- భవిష్యత్తులో రూపాయిన్నర కే యూనిట్
- కర్నూలులో ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు



విశాలాంధ్ర- అమరావతి :విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఒకప్పుడు విద్యుత్ రంగంలో చీకట్లు ఉండేవి.. ప్రస్తుతం మిగులు విద్యుత్ సాధ్యమైంది. ఫలితంగా ఇంధన రంగంలో దేశంలోనే అగ్రగామిగా ఏపీ నిలిచింది 2014 సెప్టెంబరులో అనంతపురం సౌర పార్కు నిర్మాణంపై జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. అలా మొదలైన సౌర పార్కుల ప్రస్థానం భారీగా విస్తరించింది. నాలుగు వేల మెగావాట్ల పార్కులకు బీజం పడింది.

పునరుత్పాదక ఇంధన వనరులు

ముఖ్యంగా సౌర రంగంపై ప్రపంచమంతా దృష్టి సారిస్తోంది. ఈ రంగంలో చోటుచేసుకున్న పరిణా మాల నేపథ్యంలో సౌర విద్యుత్తు ధర బొగ్గు ప్రాజెక్టుల విద్యుత్తు ధర స్థాయికి దిగివచ్చింది. ఇదే తరుణంలో సౌర విద్యుత్తును నిల్వ చేసే ప్రయత్నాలు ప్రారం భమయ్యాయి. సౌర మినీగ్రిడ్‌ల ద్వారా ఎక్కడికక్కడ స్థానికంగానే విద్యుత్తు అందించాలనేది ఆశయం.

సౌర పంపుసెట్ల పంపిణీ: రాష్ట్రంలో సుమారు 14 వేల సౌర పంపుసెట్లను రైతులకు ఇచ్చారు. కేంద్రం ఇచ్చే రాయితీకి తోడు విద్యుత్ పంపిణీ సంస్థలు కొంత మొత్తాన్ని భరిస్తున్నాయి. రూ.55 వేలు రైతు చెల్లిస్తే సరిపోతుంది. రాష్ట్రంలో లక్ష పంపుసెట్లకు సౌర విద్యుత్ కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించింది. ఒక మెగావాట్ సౌర విద్యుత్ యూనిట్ నిర్మాణానికి సుమారు ఐదెకరాల భూమి కావాలి. భూసేకరణ అత్యంత ఇబ్బందికరమైన అంశం. ఈ ఇబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం చాలా వరకు అధిగమిం చింది. దాదాపు 27 వేల ఎకరాల సేకరణకు శ్రీకా రం చుట్టింది. ఇందులో కొద్దిగా మినహా సేకరణ కూడా పూర్తయింది. ప్రపంచవ్యాప్తంగా సౌర ఫలకాల ధర తగ్గడం వరమైంది. ఉత్పత్తిదారుల్లో పోటీ పెరిగి సౌర విద్యుత్ ధర తగ్గింది. తద్వారా దాన్ని ఉపయో గించుకోవడం సులువయింది. సౌర విద్యుత్ స్థాపక సామర్థ్యంలో దూకుడు ప్రదర్శించినందున ప్రస్తుత సంవత్సరంలో ఆర్పీవోను చేరుకోవడం ఇబ్బంది కాకపోవచ్చు. దేశస్థాపక సామర్థ్యం ప్రస్తుతం 12 వేల మెగావాట్లకు పైగా చేరుకుంది. గత జనవరిలో ఇది 9,235 మెగావాట్లే. ఈవిషయంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగంలో నిలిచింది. తమిళనాడు, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాలు దీనికి పెద్ద పీట వేస్తున్నాయి.

సౌర పార్కులకు భూసేకరణ తీరు

రాష్ట్రంలో సౌర పార్కుల సాకారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆంధ్రప్రదేశ్ సౌర విద్యుత్ సంస్థను నెలకొల్పాయి. దీని ద్వారానే భూసేకరణ, 'పార్కుల' అభివ ృద్ధి జరుగుతోంది. రాష్ట్రంలో ఇళ్ల పైకప్పు సౌర విద్యుత్ స్థాపక సామర్థ్యం 15 మెగా వాట్లకు చేరుకుంది. ఈ విద్యుత్‌ను వాడుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం నెట్‌మీటరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. వినియోగదారుడు తన అవసరాలకు సౌర విద్యుత్‌ను వాడుకోవచ్చు. మిగిలితే విద్యుత్ సంస్థలకు విక్రయించవచ్చు. సోలార్ రూఫ్‌టాప్ ధరలు కూడా గణనీయంగా తగ్గాయి. కర్నూలు సౌర పార్కు ఒక రకంగా దేశాన్ని మలుపుతిప్పింది. ధరల తగ్గుదలకు నాంది పలికింది. సౌరఫలకాల ధర తగ్గడం ఒక ఎత్తయితే భూమి సిద్ధంగా ఉండడం వల్ల వెంటనే ప్రాజెక్టులను నెలకొల్పే అవకాశమూ కలిగింది. తద్వారా పెట్టిన పెట్టుబడికి వెంటనే ఆదా యం వచ్చింది. సౌర, పవన ప్రాజెక్టులు రాయల సీమలోనే ప్రధానంగా కేంద్రీకృతమయ్యాయి. సాగు భూమి తక్కువగా ఉండటంతో ఇది సాధ్యమైంది.

పుష్కలంగా ఇంధన వనరులు: ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా ఇంధన వనరులు ఉన్నాయి. అతి తక్కువ ధరకే సౌర విద్యుత్ అందుతుంది. ఒకప్పుడు యూనిట్ సోలార్ విద్యుత్ ధర రూ.14 ఉండేది, ఇప్పుడు నాలుగు రూపాయిలకే లభిస్తోంది. దీనిని రూపాయిన్నరకే ఇచ్చే రోజులు త్వరలోనే రానున్నాయి. ఎనర్జీ సేవింగ్ పరికరాల తయారీలో ముందుంటే ఏపీకి తిరుగుండదు. 4,059 మెగావాట్ల పవన విద్యుత్, 2,591 మెగావాట్ల సౌర విద్యుత్‌తో కలిపి 7,464 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏపీ చేరుకుంది. 2014లో యూనిట్‌కు రూ.6.49గా ఉన్న సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని ప్రస్తుతం రూ.2.70కు తగ్గింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 31,725 సౌర విద్యుత్ పంపుసెట్లను అమర్చారు. అనంతపురం, కడప, కర్నూలులో మొత్తం కలిపి 4000 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులను ఏర్పాటు చేశారు.



కార్మిక సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను దోపిడీకి గురిచేస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అందుకు ఉదాహరణనే కార్మిక చట్టాల సవరణగానీ, కార్మికులకు కనీస వేతనాల జిఓను విడుదల చేయకపోవటం అని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి యం.డి.యూసుఫ్ విమర్శించారు. శనివారం ఎఐటియుసి హైదరాబాద్ నగర 16వ మహాసభ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా కార్మిక హక్కులపై ప్రభుత్వాలు దాడిని తీవ్రతరం చేయటం జరిగిందన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరణ చేసి వాటిని యాజమానులకు అనుకూలంగా చేయుటకు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణకు పూనుకున్నదని, దానిని ప్రతిఘటిస్తూ ఈ నెల 8,9 తేదీలలో దేశవ్యాపితంగా జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత పిఆర్‌సి సందర్భంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని, చట్ట ప్రకారం సమాన పనికి సమాన వేతనం రావాల్సి ఉన్నా దానిని విస్మరించిందన్నారు. భవిష్యత్తులో కార్మిక హక్కుల సాధనకు సమైక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహాసభల ప్రారంభానికి ముందు ఎఐటియుసి జెండాను సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ ఆవిష్కరించగా అనంతరం జరిగిన సభకు బి.వెంకటేశం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, కోశాధికారి బొడ్డుపల్లి కిషన్, ఉపాధ్యక్షులు ఎ.భిక్షపతియాదవ్, రాజమౌళి, కార్యదర్శులు లక్ష్మిబాయి, హసీనాబేగం, శ్రీనివాస్, వెంకట్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



భారత్‌దే.. పైచేయి

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 236/6
- 386 పరుగుల ఆధిక్యంలో భారత్
- తిప్పేసిన కుల్దీప్, జడేజా

సిడ్నీ: టీమిండియా చివరి టెస్టు మూడో రోజు ఆటలోనూ పైచేయి సాధించింది. ఆట చివరి సెషన్‌లో భారీ వర్షం కురవడం, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపేశారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఆసీస్ 83.3 ఓవర్లకు గానూ 236/6 పరుగులు చేసి ఎదురీదుతోంది. మూడో రోజు ఆటలో భాగంగా 24/0 ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆదిలోనే వికెట్ కోల్పోయింది. బౌండరీలు బాదుతూ దూకుడు మీదున్న ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా(27)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. దీంతో ఆసీస్ 72 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్‌తో కలిసి ఓపెనర్ హారిస్ నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. వీరు భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ భోజన విరామం వరకు వికెట్ కోల్పోకుండా జాగ్రత్తగా పడ్డారు. ఆ తర్వాత జడేజా వీరి భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆరంభం నుంచి క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్ మార్కస్ హారిస్(79)ను జడేజా బౌల్డ్ చేశాడు. తరువాత బ్యాటింగ్‌కు చ్చిన షాన్ మార్ష్ ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. 49వ ఓవర్లో జడేజా వేసిన బంతిని షాన్ మార్ష్(8) భారీ షాట్ ఆడబోయి రహానే చేతికి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ప్రమాదకర బ్యాట్స్‌మెన్ మార్ష్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో ఆసీస్ మీద మరింత ఒత్తిడి పెరిగింది. కాసేపటికే లబుషేన్(38) షమీ బౌలింగ్‌లో రహానేకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్ కుదేలైంది.

కుల్‌దీప్ ఖాతాలో కీలక వికెట్లు..

తుది జట్టులో స్థానం దక్కించుకున్న కుల్‌దీప్.. ఆసీస్ మిడిల్ ఆర్డర్‌ను అడ్డుకున్నాడు. ట్రావిస్ హెడ్, కెప్టెన్ పైన్ వంటి కీలక వికెట్లు పడగొట్టాడు. కాసేపు నిలకడగా ఆడినట్లు కనిపించిన ట్రావిస్ హెడ్(20)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి ఆసీస్ 192 పరుగులు చేసి ఐదు వికెట్లు కోల్పోయింది. బ్యాటింగ్‌కు దిగిన వెంటనే బౌండరీ బాదిన ఆసీస్ సారథి వికెట్ సైతం కుల్‌దీపే పడగొట్టాడు. 69ఓవర్లో కుల్‌దీప్ అద్భుతమైన బంతితో టిమ్‌పైన్(5) బౌల్డ్ చేశాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా దెబ్బతింది. భారత స్పిన్నర్ల దెబ్బకి ఆస్ట్రేలియా 198 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన బౌలర్ కమ్మిన్స్ (25) మరోసారి బ్యాట్‌తో రాణించాడు. హాండ్స్‌కాంబ్ (28)తో కలిసి ఆసీస్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. కాసేపటికే వర్షం, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను కొంతసేపటివరకు నిలిపి వేశారు. తర్వాత భారీ వర్షం కురవడంతో మూడో రోజు మ్యాచ్‌ను 84 ఓవర్లకే ముగించారు. మూడో రోజు ఆట చివరికి ఆసీస్ ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు తీయగా జడేజా రెండు, షమీ ఒక వికెట్ తీశారు. టీమిండియా 386 పరుగుల ఆధిక్యంలో ఉండటంతో ఆసీస్‌కు ఫాల్‌ఆన్ గండం పొంచి ఉంది. రెండో రోజు ఆటలో భారత్ 622 పరుగులకు ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే.



మూడో రోజు 'పింక్ డే'

సిడ్నీ: ఆసీస్‌తో సిడ్నీ వేదికగా జరుగుతున్న చివరి టెస్టు మూడో రోజు ఆటలో భాగంగా టీమిండియా గులాబి రంగు టోపీలు ధరించి మైదానంలోకి దిగింది. బ్రెస్ట్ కేన్సర్ మీద అవగాహన కల్పించడానికి భారత ఆటగాళ్లతో పాటూ ఆస్ట్రేలియా ఆటగాళ్లు గులాబి రంగు టోపీలు ధరించారు. దీంతోపాటు ఆసీస్ మాజీ క్రికెటర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌కు నిధుల సేకరణకు గౌరవ సూచకంగా వీటిని ధరించారు. ఈ విరాళాల సేకరణ కోసం సిడ్నీ టెస్టు మూడో రోజు మ్యాచ్‌ను 'పింక్ డే'గా నామకరణం చేశారు. దీంతో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. సిడ్నీ స్టేడియం గులాబీరంగుతో నిండిపోయింది. పలువురు క్రికెట్ అభిమానులు సైతం గులాబీ రంగు దుస్తులు ధరించి మైదానానికి వచ్చారు. అంతే కాకుండా స్టేడియంలోని బౌండరీ లైన్లు, ఆటలో ఉపయోగించే వికెట్లను సైతం గులాబీ రంగులలోకి మార్చారు. ఈ రోజు సేకరించిన మొత్తాన్ని ఆస్ట్రేలియా వ్యాప్తంగా బ్రెస్ట్‌కేన్సర్‌తో బాధపడుతున్న వారికి మెక్‌గ్రాత్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. మెక్‌గ్రాత్ భార్య జేన్ మెక్‌గ్రాత్ కేన్సర్‌తో బాధపడుతూ 2008లో మృతి చెందారు. జేన్ కొన్ని సంవత్సరాల పాటు బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడ్డారు. దీంతో 2005లో మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. బ్రెస్ట్ కేన్సర్ బాధితులకు ఈ ఫౌండేషన్ బాసటగా నిలుస్తోంది.

పంత్ మరో గిల్‌క్రిస్ట్

పాంటింగ్



సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో తన బ్యాంటింగ్, కీపింగ్, స్లెడ్జింగ్‌తో అదరగొడుతున్న టీమిండియా యువ సంచలనం రిషబ్ పంత్‌పై ప్రశంసల జల్లు కురుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రిషబ్ ఆట తీరుపై ఆసీస్ మాజీ క్రికెటర్ రికీ పాంటింగ్ కూడా స్పందిస్తూ.. పంత్‌ను ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు గిల్‌క్రిస్ట్‌తో పోల్చాడు. 'రిషబ్ నిజమైన ప్రతిభ ఉన్న ఆటగాడు. అంతేకాదు, బంతిని అంచనా వేసి ఆడగల మంచి స్ట్రైకర్. అతడికి ఆటను అర్థం చేసుకుని ఆడగల నైపుణ్యం ఉంది. ఐపీఎల్‌లో పంత్ ఆడుతున్న ఢిల్లీ జట్టుకు నేను కోచ్‌గా ఉండటంతో అతడిని పరిశీలించాను. కీపింగ్‌పై మరింత శ్రద్ధ పెడితే, భవిష్యత్‌లో మరింత గొప్ప కీపర్‌బ్యాట్స్‌మన్ అవ్వగలడు. కామెంటరీ బాక్సులో మేము మాట్లాడుకుంటున్నప్పుడు కూడా అతడిని మరో గిల్‌క్రిస్ట్‌గానే అభివర్ణిస్తున్నాను 'చాలా సందర్భాల్లో భారత క్రికెట్‌పై ఎంఎస్ ధోని ప్రభావం గురించే మేము మాట్లాడుకుంటాం. అతడెన్నో టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. కానీ, కేవలం ఆరు సెంచరీలు మాత్రమే చేశాడు. అయితే, పంత్ మరిన్ని టెస్టు శతకాలు సాధిస్తాడన్న నమ్మకం ఉంది. 21ఏళ్ల పంత్‌కు ఇది కేవలం ఎనిమదో టెస్టు మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని టెస్టు మ్యాచ్‌లు ఆడే అవకాశం అతనికి ఉంది" అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు. గిల్‌క్రిస్ట్ కూడా పంత్ ఆటతీరును మెచ్చు కున్నాడు. 'పంత్ అందమైన ఇన్నింగ్స్ ఆడాడు. పంత్ ఆటను చక్కగా ఆస్వాదించవచ్చు. భవిష్యత్‌లో మంచి టెస్టు క్రికెటర్ అవుతాడు' అని గిల్‌క్రిస్ట్ అన్నాడు.

అతిథులను గౌరవించడం నేర్చుకోండి : సీఏ

సిడ్నీ: అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టు సందర్భంగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిని ఆసీస్ ప్రేక్షకులు గేలి చేస్తూ అవమానించిన విషయం తెలిసిందే. తాజాగా సిడ్నీ వేదికగా జరుగుతున్న నాల్గో టెస్టులోనూ కోహ్లికి అటువంటి అనుభవమే ఎదురైంది. కోహ్లి బ్యాటింగ్‌కు దిగుతున్నప్పుడు ఆసీస్ అభిమానులు అతడిని వెక్కిరిస్తూ విపరీత వ్యాఖ్యలు చేసి అనుచితంగా ప్రవర్తించారు. ఈ రెండు ఘటనలపై క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ఆతిథ్య జట్టుకు కనీస గౌరవం ఇవ్వాలనే విషయాన్ని మరచి పోతే ఎలా అంటూ సదరు అభిమానులపై మండిపడింది. ఇది ఆస్ట్రేలియా క్రికెట్‌కు ఒక మచ్చగా మిగిలిపోతుందని అభిప్రాయపడింది. దయచేసి ఇక నుంచి అటువంటి అనుచిత ప్రవర్తనను కట్టిపెట్టి మర్యాదగా ప్రవర్తించాలని ఆసీస్ అభిమానులకు విజ్ఞప్తి చేసింది. 'దేశానికి వచ్చిన అతిథులను ఇలా అవమానించడం సరికాదు. అతిథులను గౌరవించడం నేర్చుకోవాలి. మనందరికంటే ఆట గొప్పది. అతిథులను మనం గౌరవించాలి. మన దేశానికి వచ్చినప్పుడు వారికి అందమైన అనుభవం ఇవ్వాలి. అయితే, మైదానంలో మాత్రం కలబడాలి' అని ఆస్ట్రేలియా సీఈవో కెవిన్ రాబర్ట్స్ పేర్కొన్నాడు. ఇలాంటి చర్యలను పునరావృతం చేయవద్దని అభిమానులకు హితవు పలికాడు.

మనకదే తొలి విజయం

- రాజకీయాలకు డబ్బు అవసరంలేదని కాన్షీరాం నిరూపించారు
- టీడీపీ, వైసీపీలకు బూత్ కమిటీలున్నాయా?
- నీతిలేని నాయకుల వల్లే పీఆర్పీ లక్ష్యం నీరుగారింది
- త్వరలో పార్లమెంటు సెగ్మెంట్ కమిటీలు
- ప్రకాశం, చిత్తూరు జిల్లాల సమీక్షలో పవన్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: జనసేన పార్టీ తమతో కలిసి వస్తుందని అధికార, ప్రతిపక్షాలు ప్రచారం చేసుకోవడం మనకి తొలి విజయమేనని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విజయవాడ జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ప్రకాశం, చిత్తూరు జిల్లాల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ జనసేన అండతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ మనల్ని రాజకీయ పార్టీగా గుర్తించడానికి ఇష్టపడని స్థాయి నుంచి జనసేన తమతో కలిసి వస్తోందని ప్రచారం చేసుకునే స్థాయికి వెళ్లిందన్నారు. జనసేనకు అధికార, ప్రతిపక్ష పార్టీల అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు జనసేనకు మొదటి ఎన్నికలు మాత్రమేననీ, భవిష్యత్తు అంతా జనసేనదేనన్నారు. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భవానికి బలమైన పాత్ర పోషించిన వారిలో తాను ఒకరినన్నారు. డబ్బు ప్రభావం లేని రాజకీయాలు చేయాలన్న లక్ష్యంతో పీఆర్పీ ఏర్పాటు అయ్యిందన్నారు. అయితే పార్టీ ఓడిపోగానే నీతిలేని నాయకులు బయటకు వెళ్లిపోయారన్నారు. ఆనాడు పీఆర్పీలోకి వచ్చిన వారంతా పదవీ వ్యామోహంతో వచ్చారని స్పష్టం చేశారు. దీనివలన జనసేన పార్టీ నిర్మాణంలో ఆచితూచి వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. పీఆర్పీ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కమిటీల నియామకానికి తొందరపడటం లేదన్నారు. రాత్రికి రాత్రే రాజకీయాల్లో ఎవరూ ఎదగలేరన్నారు. కనీసం పాతిక సంవత్సరాలు ఓపిక పట్టాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో సమస్య లెక్కడుంటాయో అక్కడ ప్రజలకు మనం అండగా నిలవాలని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి రూ.2 వేల కోట్లు అవసరమని చాలా మంది చెబుతున్నారన్నారు. అధికార, ప్రతిపక్షాలు దీనికి సన్నద్ధంగా ఉన్నాయని మీరెలా పోటీ పడతారని పలువురు ప్రశ్నిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి డబ్బు అవసరం లేదని బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం రుజువు చేశారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే విషయమై తనకు ఆయనే మార్గదర్శి అని అన్నారు. టీడీపీ, వైసీపీలకు నిజమైన బూత్ కమిటీలున్నాయా అని ప్రశ్నించారు. అందరికీ తెలిసినంత వరకు సీపీఐ, సీపీఎం, బీజేపీలకు కొంత వరకు బూత్ కమిటీలున్నాయన్నారు. పాలకులు చేసిన తప్పిదాల వలనే తెలంగాణ ఉద్యమం వచ్చి రాష్ట్రం రెండుగా విడిపోయింద న్నారు. ఎవరెవరో చేసిన తప్పులకు అమాయక ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాల్లోకి రాకముందు నుంచే సమాజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ఆరంభించానన్నారు. కళాశాలల నుంచి పట్టాలు తీసుకోక పోయినా పొలిటికల్ సైన్సు, పబ్లిక్ పాలసీలు, అంబేద్కరిజం వంటి వాటిపై అవగాహన పెంచుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రస్తుత భారత రాజకీయాల్లో మధ్యేమార్గం అవసరమన్నారు. ఆ మధ్యేమార్గం జనసేన. ప్రజలందరినీ కలిపే ఒక ఉమ్మడి సిద్ధాంతం కావాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రావెల కిషోర్‌బాబు, గంగాధరం, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



యువత అద్భుతాలు సృష్టించాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశ యువత సన్మార్గంలో నడిచి అద్భుతాలు సృష్టించాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. విజయవాడ ఆంధ్రా లయోల కళాశాలలో కళాశాల ఫౌండర్ ప్రిన్సిపల్ థియో మత్తయాస్ శత జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. దీంతోపాటు కళాశాల 65వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో యువశక్తికి కొదవలేదన్నారు. యువత తమశక్తిని తెలుసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆధునిక విజ్ఞానాన్ని అభివృద్ధికే ఉపయోగించాలనీ, విధ్వంసానికి ఉపయోగించవద్దని హితవు పలికారు. జీవితంలో ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినప్పటికీ కన్నతల్లినీ, జన్మభూమినీ, మాతృభాషను, గురువులను మర్చిపోవద్దన్నారు. ఇతర దేశాల్లో స్థిరపడిన విద్యార్థులు దేశాభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు. కుల, మత విభేదాలు లేకుండా అందరూ ఐక్యంగా ఉండి దేశ సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని కాపాడాలని కోరారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. లయోల కళాశాల ఫౌండర్ ప్రిన్సిపల్ థియో మత్తయాస్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంతో ఉన్నత ఆశయంతో ఆయన స్థాపించిన కళాశాల వర్ధిల్లుతుందని ఆకాంక్షించారు. అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆంధ్రా లయోల కళాశాల సొసైటీ అధ్యక్షులు అమలరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎ.పి.కిషోర్, రెక్టార్ బాలశౌరి, కరస్పాండెంట్ సాగయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికతోనే మానవ సంబంధాలు మెరుగు

వక్తల ఉద్ఘాటన



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సాంకేతిక విప్లవంతో దెబ్బతింటున్న మానవ సంబంధాలను మెరుగుపర్చేందుకు ఆత్మీయ కలయిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సమతాపార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఏటా నిర్వహించే ఆత్మీయ కలయిక కార్యక్రమం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరి యంలో శనివారం జరిగింది. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేరీతిలో అంగరంగ వైభవంగా కార్యక్రమం సాగింది. కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా ఆత్మీయ కలయిక కార్యక్రమం మానవ సంబంధాలను మెరుగుతో పాటు, విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి దోహదపడాలని వక్తలు ఆకాంక్షించారు. నేడు సమాజంలో పెరుగుతున్న రుగ్మతలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజకీయ రంగంలో సేవాభావం కొరవడుతోందని, విలువలు పతనమవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా సమాజంలో ఇంకా ఆర్థిక అసమానతలు పెరగడం, మహిళలపై వివక్ష, కుల, మత, ప్రాంతీయ బేధాలు కొనసాగడం విచారమన్నారు. సాంకేతిక విప్లవం సృష్టించిన సెల్, ఇంటర్నెట్, వాట్సాప్, ట్విట్టర్ తదితర సౌకర్యాలతో మానవ సంబంధాలు మృగ్యమవుతున్నాయని, కుటుంబ సభ్యులు సైతం ఆత్మీయంగా, ఆనందంగా మాట్లాడుకోలేని పరిస్థితులు ఉత్పన్నంకావటం శోచీయమన్నారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో పార్టీల కతీతంగా సమాజాభివృద్ధే లక్ష్యంగా నిర్వహించే ఆత్మీయ కలయిక కార్యక్రమాలు కచ్చితంగా మార్పునకు దోహదపడతాయని తెలిపారు. యువ న్యాయవాది పీ రవితేజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, బీహార్ ఎంపీ అరుణ్‌కుమార్, ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, కృష్ణాజిల్లా జడ్పీ చైర్మన్ గద్దె అనూరాధ, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి రాఘవాచారి, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు హరినాథ్, టీడీపీ నాయకులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అరసం నాయకుడు కొండపల్లి మాధవరావు, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమూరి బసవ కుటుంబరావు (చిట్టియ్య), మహిళా సంఘం నాయకురాలు రమాదేవి, రఫీ తదితరులు ప్రసంగించారు.

ఉండి మండలంలో విశాలాంధ్రకు 60 సంవత్సర చందాలు



పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలంలో 60 మంది విశాలాంధ్ర దినపత్రిక సంవత్సర చందాదారులుగా చేరారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పీ హరినాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్క్యులేషన్ క్యాంపెయిన్‌లో ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు ఒక్కరే 25 మందిని చందాదారులుగా చేర్పించారు. అందుకు సంబంధించిన నగదు మొత్తాన్ని ఆయన జీఎం హరినాథ్‌రెడ్డికి అందజేశారు. అలాగే ఉండి నియోజకవర్గం వైసీపీ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు ఐదు పత్రిక లకు సంవత్సర చందాను అందజేశారు. ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జుత్తిగ నాగరాజు ఐదు పత్రికలకు, ఉండి సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కుమార్ ఐదు పత్రికలకు, ఉండి తహసిల్దార్ వై దుర్గా కిశోర్ నాలుగు పత్రికలకు సంవత్సర చందాలను చెల్లించాలరు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర గోదావరి జిల్లాల అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ అమరశ్రీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యులు గంజి రాజు, కళింగ లక్ష్మణరావు, ఉండి పట్టణ కార్యదర్శి సనపల శ్రీనివాసరావు, ఏఐటీయుసి ఉండి మండల కార్యదర్శి పతివాడ దుర్గా గణపతిరావు, నాయకులు పతివాడ నరసింహమూర్తి, గలవల్లి ధనుంజయ, విశాలాంధ్ర విలేకరులు బురిడి సురేష్‌బాబు, మురళీకృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉండి

బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్ పోటీ

బెంగళూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రకటించారు. తాను క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన కొత్త సంవత్సరం ప్రారంభం రోజున ప్రకటించారు తన కొత్త ప్రయాణానికి మద్దతుగా నిలుస్తున్న వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 'సిటిజన్ వాయిస్' స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక దృక్పథాన్ని చాటుతున్న ప్రకాశ్‌రాజ్ తన ఆప్తులతో పోటీ విషయంపై చర్చలు జరిపారు. కర్ణాటకతో పాటు తెలంగాణ, తమిళనాడులోని పలు గ్రామాలను దత్తత తీసుకున్న ఈ బహుభాషా నటుడు ఏ రాష్ట్రంలో పోటీ చేస్తారనే దానిపై అభిమానుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ ప్రకటనతో తెరపడింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.